సూర్య 17వ వసంతంలోకి... www.suryaa.com

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

visit us @ http://epaper.suryaa.com

సోమవారం | 11 డిసెంబర్ 2023 | విజయవాడ

సంపుటి 17 | సంచిక 50

| పేజీలు 8+8 | వెల: రూ. 8.00

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi



విద్యార్థులకు దిశా నిర్దేశం..నిరుద్యోగులకు మార్గనిర్దేశకం...



APPSC,TSPSC
పోటీపరీక్షల గైడెన్స్
నిపుణులైన అధ్యాపకులతో
నాణ్యమైన మెటీరియల్
కరెంట్ అఫైర్స్
నమూనా ప్రశ్నాపత్రాలు
విద్యా ఉద్యోగ సమాచారం
'సూర్య' ఆన్‌లైన్ఎడిషన్ www.suryaepaper.com చూడండి.


అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం దక్షిణాయనం - శరత్ ఋతువు, కార్తీక మాసం బహుళ చతుర్థశి తె.5.48, విశాఖ ఉ 11.36 వర్జ్యం. మ.3.40 నుంచి 4.18 వరకు
రాహుకాలం ఉ.7.30 నుంచి 9.00 వరకు, దుర్ముహూర్తం మ.12.16 నుంచి 1.00 వరకు తిరిగి మ.2.29 నుంచి 3.13 వరకు



మంత్రివర్గం ప్రమాణ స్వీకారం చేసిన నేపథ్యంలో మరో ఆరు పదవులు మిగిలి ఉన్నాయి. వాటిని భర్తీ చేసే దిశగా రేవంత్ రెడ్డి కసరత్తు చేస్తున్నారు. తెలంగాణలో కొత్త ప్రభుత్వం ఇప్పటికే కొలువు తీరింది. సీఎం రేవంత్ వేగంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. మంత్రివర్గంలో 11 మంది మంత్రులకు శాఖలు ఖరారయ్యాయి. కీలక శాఖలు సీఎం వద్దే ఉన్నాయి. కేబినెట్ లో మరో ఆరు స్థానాలు భర్తీ చేయాల్సి ఉంది. ఈ స్థానాలను భర్తీ చేసేందుకు రేవంత్ సిద్దంగా ఉన్నారు. జాబితా సిద్దం చేసుకున్నారు. హైకమాండ్ ఆమోదం కోసం ఎదురు చూస్తున్నారు. ఈ నెలాఖరులోగా మంత్రి వర్గ విస్తరణకు ఛాన్స్ కనిపిస్తోంది.రేవంత్ తొలి మంత్రివర్గంలో సీనియర్లకు అవకాశం ఇచ్చారు. వారికి శాఖలు అప్పగించారు. కీలక శాఖలు ఇంకా భర్తీ చేయాల్సి ఉంది. రేవంత్ ఇప్పటికే మరో ఆరుగురికి కేబినెట్ లో అవకాశం కల్పించేలా ప్రణాళికలతో సిద్దమయ్యారు. వారి కోసమే కొన్ని ప్రధాన శాఖలను పెండింగ్ పెట్టారు. అందులో హోం శాఖతో పాటుగా విద్యా, సాంఘిక సంక్షేమం, మున్సిపల్ వంటి కీలక శాఖలు ఉన్నాయి.

# హోం మంత్రి ఎవరు?

3 లో



- సర్వత్ర ఆసక్తి -విస్తరణపై ఉత్కంఠ
- అధిష్టాన వర్గానికి ఆశావహుల తాకిడి
- సింఎంపై పెరిగిన ఒత్తిడి
- ఎమ్మెల్సీలకు, ఓడిపోయిన ప్రముఖుల కూడా దక్కనున్న ఛాన్స్
- ఇప్పటికే స్పష్టతకు వచ్చిన రేవంత్ రెడ్డి
- చివరి నిమిషంలో మార్పులు చేర్పులు అవకాశం
- రేసులో షబ్బీర్ అలీ, అంజన్ కుమార్ యాదవ్, మల్‌రెడ్డి రంగారెడ్డి, గడ్డం వివేక్, ప్రేమ్ సాగర్ రావు, మధుయాష్కి గౌడ్ తదితరులు?

## తుపాను బాధితులను ఆదుకోండి



2 లో

- ప్రధాని నరేంద్ర మోడీకి టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు లేఖ
- తుఫాను కారణంగా 15 జిల్లాలు ప్రభావితమయ్యాయన్న చంద్రబాబు
- ఆరుగురు ప్రాణాలు కోల్పోయారని, రూ. 10 వేల కోట్ల పంట నష్టం వాటిల్లిందని ఆవేదన
- జాతీయ విపత్తుగా ప్రకటిస్తే బాధితులకు మెరుగైన సాయం అందుతుందన్న టీడీపీ అధినేత

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

## కేసీఆర్‌కు సిఎం రేవంత్ పరామర్శ



3 లో

యశోద హాస్పిటల్‌కు సిఎం రేవంత్ రెడ్డి
- త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్ష
- ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో వాకబు
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు, యశోద హాస్పిటల్ డాక్టర్లను కలిసి కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై ఆరా
- సీఎం వెంట మంత్రి సీతక్క, షబ్బీర్ అలీ తదితరులు

## ఛత్తీస్‌గఢ్ కొత్త సీఎంగా విష్ణుదేవ్ సాయ్

- బీజేపీ శాసనసభా పక్ష నేతగా ఎన్నిక
- వారం రోజుల సస్పెన్స్‌కు తెర
- 2019లో టిక్కెట్టే ఇవ్వలేదు
- ఈసారి ఏకంగా సీఎం పోస్ట్
- ఛత్తీస్‌గఢ్ కొత్త సీఎం ప్రస్థానం
- గతంలో కేంద్ర మంత్రిగా పని చేసిన విష్ణుదేవ్



6 లో

## ప్రజల వెంటే కాంగ్రెస్ సర్కార్



3 లో

- ప్రతి పేద కుటుంబానికి 10 లక్షల ఆరోగ్యశ్రీ వర్తింపు
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం
- రెండు రోజుల్లో రెండు గ్యారెంటీలను అమలు చేసిన ప్రభుత్వం
- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

## అంతా ఇంతే!



అన్ని లెక్కలు తేల్చడానికేమో సార్

## 19న ఇండియా కూటమి నేతల సమావేశం




6 లో

- సీట్ల పంపకమే ప్రధాన అజెండా
- రానున్న భేటీలో కాంగ్రెస్‌కు చిక్కులు తప్పవేమో?
- మూడు రాష్ట్రాల్లో ఓటమి ప్రభావం
- ఈ సారి అఖిలేష్ హాజరయ్యే అవకాశం

## కాంగ్రెస్ పార్టీ ఎలాంటిదంటే



3 లో

- కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ : కిషన్‌రెడ్డి ఆరోపణ
- ఆర్నెల్లు కాకముందే కాంగ్రెస్ అవినీతి షురూ చేసిందని వ్యాఖ్య
- కర్ణాటకలో ఓ నేత నుంచి తెలంగాణకు భారీగా డబ్బు తరలించారని ఆరోపణ

## సికింద్రాబాద్ నుంచి మరో వందే భారత్

- ఇప్పటికే దేశంలో వివిధ రూట్లలో వందే భారత్ రైళ్లు
- త్వరలో మరో 10 వందే భారత్ రైళ్లకు పచ్చ జెండా
- వాటిలో సికింద్రాబాద్- పుణె రైలు



6 లో


## రాయలసీమ సమగ్రాభివృద్ధికై ఉద్యమిద్దాం : జన చైతన్య వేదిక



తిరుపతి, సూర్య బ్యూరో ప్రతినిధి : వెనుకబాటుతనానికి మారుపేరుగా నిలిచిన రాయలసీమ సమగ్రాభివృద్ధికై ఐక్యంగా ఉద్యమిద్దామని వివిధ రాజకీయ పార్టీల నేతలు పిలుపునిచ్చారు. జనచైతన్య వేదిక ఆంధ్రప్రదేశ్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ ఆదివారం ఉదయం తిరుపతిలోని వేమన విజ్ఞాన కేంద్రంలో రాయలసీమ అభివృద్ధి – సమస్యలపై జరిగిన చర్చా గోష్టికి జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. ప్రధాన వక్తగా విచ్చేసిన రాజ్యసభ మాజీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ మీడియా కమిటీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ ఎన్.తులసీ రెడ్డి ప్రసంగిస్తూ రాష్ట్ర విభజన చట్టం హామీలను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయనందున రాయలసీమ తీవ్రంగా నష్టపోయిందన్నారు. బుందేల్ ఖండ్ ప్యాకేజీ అమలు చేయకపోవడం, స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా నేతృత్వంలో కడప స్టీల్ ఫ్యాక్టరీని పొందలేకపోవటం, హైకోర్టును సాధించలేకపోవడం, నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తి చేసుకోలేకపోవడం వలన రాయలసీమ ప్రాంతం అభివృద్ధి కాలేకపోయిందన్నారు.రాష్ట్రవ్యాప్తంగా 18 లక్షల మోటారు బావులుండగా ఒక్క రాయలసీమలోనే 12 లక్షల మోటార్ బావులు ఉన్నాయని వీటన్నింటికీ స్మార్ట్ మీటర్లు పెడితే రాయలసీమ రైతులకు అవి ఉరితాళ్ళు గా మారుతాయి అన్నారు. సిపిఐ కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ గఫూర్ ప్రసంగిస్తూ రాయలసీమ సమగ్ర అభివృద్ధి ప్రణాళికను రూపొందించి వాటి అమలుకు రాజకీయాలకు అతీతంగా ఐక్యంగా కృషి జరగాలన్నారు.హంద్రీనీవా సృజన స్రవంతి,గాలేరు –నగరి ప్రాజెక్టులను సత్వరం పూర్తి చేసుకోవాలన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే ఆంధ్రప్రదేశ్ కు నీటి సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. జన చైతన్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ 1956 నుండి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నీటిపారుదల ప్రాజెక్టుల కోసం ఆయా రాష్ట్ర బడ్జెట్లలో 10% పైగా కేటాయించి ఖర్చు చేస్తే నేటి ప్రభుత్వం గత ఐదు బడ్జెట్లలో ఐదు శాతం లోపే కేటాయించి,మూడు శాతం మాత్రమే వ్యయం చేసింది అన్నారు.

# తుపాను బాధితులను ఆదుకోండి

- ప్రధాని నరేంద్ర మోడీకి టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు లేఖ
- తుపాను కారణంగా 15 జిల్లాలు ప్రభావితమయ్యాయన్న చంద్రబాబు
- ఆరుగురు ప్రాణాలు కోల్పోయారని, రూ. 10 వేల కోట్ల పంట నష్టం వాటిల్లిందని ఆవేదన
- జాతీయ విపత్తుగా ప్రకటిస్తే బాధితులకు మెరుగైన సాయం అందుతుందన్న టీడీపీ అధినేత



గుంటూరు నుంచి 'సూర్య' ప్రత్యేక ప్రతినిధి : మిగ్జాం తుపాను వల్ల నష్టపోయిన ఆంధ్రప్రదేశ్ ప్రజలను ఆదుకోవాలని ప్రధాని నరేంద్ర మోడీకి టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఆదివారం లేఖ రాశారు. తుపానును జాతీయ విపత్తుగా ప్రకటించి సాయం చేయాలని కోరారు. రాష్ట్రంలోని 15 జిల్లాల్లో తుపాను తీవ్ర ప్రభావం చూపించిందన్నారు. 22 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. తుపాను కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం జరిగింది. ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. రూ. 10వేల కోట్ల మేర పంట నష్టం ఉంటుందని అంచనా. దాదాపు 770 కి.మీ మేర రోడ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. తాగునీరు, నీటిపారుదల, విద్యుత్, కమ్యూనికేషన్ రంగాలకు నష్టం. వ్యవసాయంతో పాటు ఆక్వా రంగం కూడా నష్టపోయింది. తుపాను నష్టం అంచనాకు కేంద్ర బృందాన్ని పంపాలని మోదీకి రాసిన లేఖలో చంద్రబాబు పేర్కొన్నారు.

లేఖలోని ముఖ్యాంశాలు ఇవే : తుపాను వల్ల జరిగిన నష్టాన్ని మీ దృష్టికి తీసుకొచ్చేందుకే ఈ లేఖ రాస్తున్నా. తుఫాను కారణంగా రాష్ట్రంలోని 15 జిల్లాలు ప్రభావితమయ్యాయి. 100 కిలోమీటర్ల వేగంతో వీచిన గాలులు ప్రజా జీవనాన్ని అతలాకుతలం చేశాయి. తుఫాను కారణంగా ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. ప్రాథమిక అంచనా ప్రకారం 22 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. దీనివల్ల రూ. 10 వేల కోట్ల వరకు పంట నష్టం ఉంటుందని అంచనా. పంటలు దెబ్బతినడంతో పాటు పలు చోట్ల పశువులు చనిపోయాయి, చెట్లు విరిగిపడ్డాయి. దాదావు 770 కిలోమీటర్ల మేర రోడ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. తాగునీరు, నీటిపారుదల, విద్యుత్, కమ్యూనికేషన్ రంగాలకు నష్టం జరిగింది. వ్యవసాయంతో పాటు ఆక్వా రంగం కూడా నష్టపోయింది. తుఫాను వల్ల పంట నష్టపోయి ఆవేదనతో నలుగురు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. మత్స్యకార పడవలు, వలలకు కూడా నష్టం జరిగింది. వారు జీవనోపాధి కోల్పోయారు. తుఫాను ప్రభావం ఒక్క ఆంధ్రప్రదేశ్కే పరిమితం కాలేదు. పొరుగున ఉన్న తమిళనాడుపై కూడా ప్రభావం చూపింది. తుఫాను తీవ్రత, నష్టం దృష్ట్యా మిజాంగ్ తుఫానును 'జాతీయ విపత్తు'గా ప్రకటించాలని కోరుతున్నాను. తుఫాను నష్టాన్ని అంచనా వేయడానికి కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక బృందాన్ని పంపండి. జాతీయ విపత్తుగా ప్రకటిస్తే తక్షణ, మెరుగైన సాయం బాధితులకు అందుతుంది. మీ ప్రకటన ద్వారా తుఫాను బాధితులలో విశ్వాసాన్ని నింపే అవకాశం ఏర్పడుతుందన్నారు.

# 3వేల కి.మీ. చరిత్రాత్మక మైలురాయికి చేరుకున్న యువగళం

- ఉభయ గోదావరి జిల్లాల్లో లోకేష్‌కు బ్రహ్మరథం పట్టిన ప్రజలు
- ప్రజాచైతన్యంలో విజయవంతమైన లోకేష్ పాదయాత్ర
- యువగళం గొంతునొక్కేందుకు విఫలయత్నాలు
- పదునైన ప్రసంగాలతో ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు
- ఉభయ గోదావరి జిల్లాల్లో బ్రహ్మరథం



అమరావతి నుంచి 'సూర్య' ప్రత్యేక ప్రతినిధి : ఉద్యోగాల్లేక నిరాశ,నిస్పృహలతో కొట్టుమిట్టాడుతున్న యువత ఒకవైపు..అరాచకపాలనలో బాధితులుగా మారిన ప్రజలు మరోవైపు.. ఇంటినుంచి బయటకు వెళ్తే తిరిగి క్షేమంగా తిరిగివస్తామనే గ్యారంటీలేక భయాందోళనలతో బతుకుతున్న మహిళాలోకం ఇంకోవైపు...ఇటువంటి రాక్షసపాలన నుంచి ప్రజలకు విముక్తి కల్పించేందుకు యువనేత నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 219వరోజు తుని నియోజకవర్గం తేటగుంట వద్ద 3వేల కి.మీ.ల చారిత్రాత్మక మైలురాయికి చేరుకోనుంది. ఈ ఏడాది జనవరి 27వతేదీన కుప్పం శ్రీ వరదరాజస్వామి పాదాల చెంతనుంచి ప్రారంభమైన యువగళం... అన్ని అవరోధాలను అధిగమించి విజయవంతంగా దూసుకుపోతోంది. జగన్మోహన్ రెడ్డి అరాచకపాలనను అంతమొందించేందుకు జనగళమే యువగళమై జెట్ స్పీడ్ తో సాగుతున్న యువగళం పాదయాత్ర యువతను మేల్కొల్పడంతో సూపర్ సక్సెస్ అయింది. పార్టీ అధినేత చంద్రబాబునాయుడును అక్రమంగా అరెస్టుచేసి జైలులో పెట్టిన సమయంలో అనివార్యమైన పరిస్థితుల్లో 79రోజుల విరామం మినహా 219రోజులుగా లోకేష్ జైత్రయాత్ర అవిశ్రాంతంగా ముందుకు సాగుతోంది. ఇప్పటివరకు 10 ఉమ్మడి జిల్లాలు, 92 అసెంబ్లీ నియోజకవర్గాలు, 217మండలాలు/మున్సిపాలిటీలు, 1915 గ్రామాలను స్పృశిస్తూ 219రోజులపాటు సాగిన యువనేత లోకేష్ పాదయాత్ర 3019 కి.మీ.లు పూర్తయింది. (ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పూర్తయ్యేసరికి).ఈ సుదీర్ఘ పాదయాత్రలో యువనేత లోకేష్ 70 బహిరంగసభలు, 145 ముఖాముఖి సమావేశాలు, 12 ప్రత్యేక కార్యక్రమాలు, 8రచ్చబండ కార్యక్రమాల్లో పాల్గొని ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ప్రజలనుంచి రాతపూర్వకంగా 1063 వినతిపత్రాలు అందగా, లక్షలాది ప్రజలు నేరుగా యువనేతను కలుసుకుని తమ కష్టాలు చెప్పుకున్నారు. కష్టాల్లో ఉన్న ప్రజలకు నేనున్నానని భరోసా ఇస్తూ ముందుకు సాగుతున్న లోకేష్ ను కుటుంబసభ్యుడి మాదిరిగా ఆదరించి సంఘీభావం తెలియజేస్తూ జనం నీరాజనాలు పడుతున్నారు. దారి పొడవునా జనం యువనేతకు నీరాజనాలు పడుతూ తాము ఎదుర్కొంటున్న సమస్యలను చెప్పుకుంటున్నారు. యువగళం ప్రారంభమయ్యాక వివిధ రూపాల్లో దాదావు 1.2కోట్ల మంది ప్రజలు యువనేత లోకేష్ కు కనెక్ట్ అయ్యారు.

యువగళం గొంతునొక్కేందుకు విఫలయత్నాలు : యువగళం పాదయాత్రకు ప్రజలనుంచి వస్తున్న అనూహ్య స్పందనతో ప్రభుత్వ పెద్దల్లో వణుకు మొదలైంది. భీమవరం, ఉంగుటూరు, గన్నవరం, నూజివీడు నియోజకవర్గాల్లో వైసిపి ముష్కరమూకలు, పోలీసులు కలిసి పసుపుసైనికులను రెచ్చగొట్టి తిరిగే వారిపైనే తప్పుడు కేసులు బనాయించారు. 40మంది యువగళం వాలంటీర్లను నాన్ బెయిలబుల్ కేసులు పెట్టి రాజమండ్రి జైలుకు పంపారు. గన్నవరం నియోజకవర్గంలో విదేశాల్లో ఉన్నవారితోసహా 46మంది కీలకనాయకులపై తప్పుడు కేసులు పెట్టడం అధికారపార్టీలో నెలకొన్న భయానికి అద్దంపడుతోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో యువనేత ప్రచారరథం మొదలు నిలబడే స్టూల్ వరకు అన్నీ లాగేసి గొంతునొక్కే ప్రయత్నం చేశారు. యువనేత లోకేష్ ఏ మాత్రం వెన్నుచూపకుండా కోట్లాదిమంది ప్రజల గొంతుకనే తనగళంగా వినిపిస్తూ రెట్టింపు ఉత్సాహంతో ముందుకుసాగారు. కుప్పంలో యువగళం పాదయాత్ర ప్రారంభం మొదలు తంబళ్లనియోజకవర్గం వరకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ప్రతి 20 కిలోమీటర్లకు ఒకటి చొప్పున మొత్తంగా 25పోలీసు కేసులు నమోదయ్యాయి. ఇందులో యువనేత లోకేష్ పై 3కేసులు నమోదు చేశారు. ప్రచార రథం, సౌండ్ సిస్టమ్, మైక్, స్టూల్ తో సహా అన్నింటినీ పోలీసులు సీజ్ చేశారు. ఎంతలా వేధించినా, ఎన్ని తప్పుడు కేసులు బనాయించినా క్రమశిక్షణకు మారుపేరైనా లోకేష్ నేతృత్వంలో యువగళం బృందాలు మొక్కవోని పట్టుదలతో ముందుకు సాగుతున్నాయి. యువగళాన్ని స్వాగతిస్తూ గ్రామాల్లో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు చించడం, రాళ్లు రువ్వడం, పసుపు సైనికులు తిరగబడితే పారిపోవడం వైసిపి పేటిఎం బ్యాచ్ కి అలవాటుగా మారింది.

అడ్డంకులు సృష్టించినా అడుగు ముందుకే : యాత్రను అడ్డుకునేందుకు ఎన్ని అడ్డంకులు సృష్టించినా తగ్గేదే లేదంటూ పట్టువదలని విక్రమార్కుడిలా లోకేష్ ముందుకు సాగుతున్నతీరు టిడిపి కేడర్ లో నూతనోత్సాహాన్ని నింపుతోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి తూర్పుగోదావరి వరకు యువగళం పాదయాత్రను అడ్డుకునేందుకు అధికారపార్టీ చేయని కుట్రలులేవు. అయితే ఉక్కు సంకల్పంతో యజ్ఞంలా సాగుతున్న యువగళాన్ని అడ్డుకోవడం వైసిపి ముష్కరమూకల వల్లకాలేదు. చైతన్యానికి మారుపేరైన విజయవాడ వంటి నగరంలో ప్రజలు స్వచ్ఛందంగా రోడ్లపైకి వచ్చి తెల్లవారుజాము 3.30వరకు ఎదురుచూడటం యువనేత లోకేష్ పై నెలకొన్న అభిమానం, నమ్మకానికి అద్దం పడుతోంది. యువగళం పాదయాత్ర చిత్తూరు జిల్లా దాటకముందే రాష్ట్రంలో 108 అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో జరిగిన 3 ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుపార్టీ విజయదుందుభి మోగించడంతో అధికారపార్టీలో ప్రకంపనలు చెలరేగాయి. లోకేష్ పాదయాత్ర ప్రజాచైతన్యంలో సంపూర్ణంగా విజయం సాధించింది. యువగళం పాదయాత్ర రాయలసీమలో చరిత్ర సృష్టించింది. గతంలో మరే నాయకుడు చేయని విధంగా రాయలసీమలో 124రోజులపాటు 44 అసెంబ్లీ నియోజకర్గాల మీదుగా 1587 కి.మీ. పాదయాత్ర చేసి రికార్డు సృష్టించారు.

# ముఖ్యమంత్రి ఎంత అవినీతి చేసిందీ ఒప్పుకోవాలి

- ప్రభుత్వంలో ప్రతి శాఖలోనూ అవినీతి పేరుకుపోయింది
- పంచాయతీ నిధుల మళ్లింపుపై కాగ్ నివేదికను బయటపెట్టాలి
- రైతులను నిండా ముంచిన వైసీపీ సర్కారు
- తుపాను బాధిత రైతులకు తక్షణ పరిహారం అందజేయాలి
- తెలుగుదేశం పార్టీతో సమన్వయం చేసుకొని ముందుకు వెళ్దాం
- శ్రీకాకుళంలో పార్టీ కార్యకర్తల సమావేశంలో పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్



శ్రీకాకుళం, సూర్య బ్యూరో ప్రతినిధి : ముఖ్యమంత్రి జగన్ కేబినెట్ లో కీలక మంత్రిగా పనిచేసి, సీఎం కుటుంబంతో బంధుత్వం కలిగిన ఓ మాజీ మంత్రి ప్రజా వేదికపై బహిరంగంగా తాను మంత్రి పదవిలో ఉన్నవుడు అవినీతి చేశానని ఒప్పుకోవడం వైసీపీ పాలనలో జరుగుతున్న అసలు తంతును బయటపెట్టిందని జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. ఆయన ఇప్పటికైనా ప్రజల ముందు బహిరంగంగా తాను తప్పు చేసినట్లు ఒప్పుకొన్నందుకు అభినందించాలి. ఆయనే కాదు. ముఖ్యమంత్రి కూడా ప్రజల ముందు చేసిన తప్పులను ఒప్పుకోవాలి. మేం మొదటి నుంచి చెబుతున్నట్లుగా వైసీపీ ప్రభుత్వంలో ఏం జరుగుతుందో సాక్షాత్తూ మాజీ మంత్రులు సంకోచం లేకుండా చెబుతున్నారంటే పాలన ఎలా సాగుతుందో ప్రజలు అర్ధం చేసుకోవచ్చ'ని నాదెండ్ల మనోహర్ అన్నారు. ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా ఆదివారం శ్రీకాకుళం జిల్లా ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం శ్రీకాకుళంలో జరిగింది. ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్ గారు మాట్లాడుతూ ప్రతి శాఖలోనూ అవినీతి ఆకాశమంత పెరిగిపోయింది. తవ్వే కొద్దీ అవినీతి జాడలు బయటపడుతున్నాయి. పాలన అస్తవ్యస్తం చేసి, ఇష్టారీతిన వైసీపీ పాలకులు దాష్టీకాలకు పాల్పడుతున్నారు. ఓ మాజీ మంత్రి తాను పదవిలో ఉన్నవుడు అవినీతికి పాల్పడినట్లు చెబుతున్నారంటే ప్రజా ధనం ఎంత దుర్వినియోగం అవుతుందో అర్ధం చేసుకోవచ్చు. వనరుల దోపిడీని ఏ స్థాయిలో జరుగుతుందో కూడా తెలుసుకోవచ్చన్నారు.

**పాల వెల్లువ కాదు... పాపాల వెల్లువ** : శ్రీకాకుళం జిల్లాకి చెందిన మంత్రి చూస్తున్న పశు సంవర్ధక శాఖలో అవినీతి మరో ఎత్తు. 3 లక్షలకు పైగా పాడి పశువులు కొన్నట్లు చూపారు. వాస్తవానికి కొన్నవి 8 వేలు మాత్రమే. లక్షల పశువులు అంటూ వేల కోట్ల నిధులు బ్యాంకులు నుంచి తీసుకొని ఏం చేశారో చెప్పాలి. పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేశారు. గ్రామ సచివాలయాలు రాజ్యాంగ విరుద్ధం అని కాగ్ తేల్చింది. రూ.3,200 కోట్లు పంచాయతీ నిధులు మళ్లించారు. కాగ్ తనిఖీల్లో తేలింది. కాగ్ నివేదికను బయటకు రాకుండా తొక్కిపెట్టారన్నారు.


గట్టు దిగని వారికి రైతుల బాధలెలా తెలుస్తాయి : తుపాను ప్రభావంతో ఖరీఫ్ పంట తీవ్రంగా నష్టపోయింది. ముఖ్యంగా పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, చిత్తూరు, నెల్లూరు జిల్లాల రైతులు తీవ్రంగా నష్టపోయారు. చేతికి పంట వచ్చే సమయంలో తుపాను విరుచుకుపడిన వేళ అన్నదాతకు అండగా ఉండాల్సిన ముఖ్యమంత్రి కనీసం వారిని పలకరించిన పాపాన పోలేదు. నష్టపోయిన పంటను పొలం గట్టు వరకు దిగి పరిశీలించలేదు. పంట పొలాల దగ్గర వేదికలను ఏర్పాటు చేసుకొని పంటను పరిశీలిస్తే ఏం తెలుస్తుంది..? రైతన్న గుండె బాధ ఎలా అర్ధం అవుతుంది. పంటల బీమాను పూర్తిగా నాశనం చేసి, ఆపత్కాలంలో రైతుకు మొండి చేయి చూపించిన ఈ ప్రభుత్వం వారిని అన్ని విధాలుగా మోసం చేసింది. పరిహారం విషయంలోనూ మాయ మాటలు చెబుతున్నారు. వెంటనే వారికి కనీసం రూ.20 వేల సాయం అందించాలి. కౌలు రైతులు బాగా దెబ్బతిన్నారు. వారికి కూడా తగిన సాయం చేయాలి. చివరి దశలో ఉన్న పంట నష్టపోవడం ఎంతో విచారకరం. రైతన్నలకు అండగా జనసేన నిలబడుతుందన్నారు.

**పదవులు అలంకారం కాకూడదు** : పార్టీకి నాయకులు కంటే జన సైనికులు, వీర మహిళలే పెద్ద బలం. క్షేత్రస్థాయిలో వారి పోరాట పటిమ జనసేన పార్టీకి పెద్ద ఆస్తి. చిన్న స్థాయి కూలీల దగ్గర నుంచి పైస్థాయి వ్యాపారుల వరకు జనసేన జెండా పట్టుకుని ధైర్యంగా ముందుకు వెళ్లడం కదిలిస్తుంది. నాయకులకు పదవులు అలంకారం కాకూడదు. జన సైనికులకు అండగా, వారిని క్షేత్రస్థాయిలో నడిపించే తోడుగా నాయకులు ఉండాలి. కేవలం ప్రొటోకాల్ కోసం రాజకీయ పదవులు చేస్తామంటే కుదరదు. రాబోయే జనసేన తెలుగుదేశం ప్రభుత్వంలో పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే ప్రతి నాయకుడికి, కార్యకర్తకు తగిన గౌరవం ఉంటుంది. ఏ ఒక్కరి కష్టాన్ని అధినేత శ్రీ పవన్ కళ్యాణ్ గారు మర్చిపోరు. ఓటర్ల జాబితాను తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి క్షుణ్ణంగా తనిఖీ చేయాలని కోరారు.

ఉమ్మడి పోరాటాలే మన లక్ష్యం : తెలుగుదేశం పార్టీతో పొత్తు అనేది రాష్ట్ర భవిష్యత్తు కోసం తీసుకున్న నిర్ణయం అనేది గుర్తించాలి. ఒకవేళ జనసేన పార్టీ పొత్తు లేకుండా ఎన్నికలకు వెళితే ప్రభుత్వాన్ని స్థాపించడానికి అవసరమైన సంఖ్య రాకపోతే, ఓట్లు చీలి మళ్లీ జగన్ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయితే ఆంధ్రప్రదేశ్ పూర్తిగా నాశనం అవుతుంది. మళ్లీ కోలుకోలేని పరిస్థితికి వెళ్లిపోతుంది. దీన్ని ఆలోచించే పవన్ కళ్యాణ్ పొత్తు నిర్ణయం తీసుకున్నారు. దీన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలి. క్షేత్రస్థాయిలో తెలుగుదేశం పార్టీ నాయకులను, కార్యకర్తలను సమన్వయం చేసుకొని ముందుకు వెళ్లాలి. ఉమ్మడి పోరాటాలే మన లక్ష్యం. ఉమ్మడి మేనిఫెస్టో కూడా ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి. వచ్చే జనసేన తెలుగుదేశం ప్రభుత్వంలో ఏ ఒక్క సంక్షేమ కార్యక్రమం ఆగిపోదని, మరిన్ని మంచి పథకాలను తీసుకొస్తామని చెప్పండి. వైసీపీ ప్రభుత్వ అవినీతికి భిన్నంగా పాలన చేస్తే మరింత సంక్షేమం ప్రజలకు అందించడం సులభమే అన్న విషయాన్ని ప్రజలకు అర్ధం అయ్యే రీతిలో వివరించండి. క్షేత్రస్థాయిలో ఈ ఎన్నికల్లో ఎంత బలంగా నాయకులు పనిచేస్తే, అంత బలంగా మనం అధికారంలో మనదైన మార్కు వేసుకోగలం. దీన్ని గుర్తుంచుకొని రాబోయే 100 రోజుల్లో బృహత్తర అధికార ప్రణాళికతో ముందుకు వెళదామన్నారు. ఈ సమావేశంలో పార్టీ పీఏసీ సభ్యులు కోన తాతారావు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్విని, రాష్ట్ర అధికార ప్రతినిధి పరుచూరి భాస్కరరావు, పార్టీ నాయకులు లోకం మాధవి, పిసిని చంద్రమోహన్,ఎస్.విశ్వక్షేన్, కోరాడ సర్వేశ్వరరావు, గేదెల చైతన్య, పెడాడ రామ్మోహన్, దాసరి రాజు, కణితి కిరణ్, నిమ్మల నిబ్రం, ఎన్ని రాజు, వి.దుర్గారావు, గర్భాన సత్తి బాబు, సందీప్ పంచకర్ల, సుందరవు వెంకట సతీష్ పాల్గొన్నారు.

**క్రియాశీలక సభ్యుల కుటుంబాలకు బీమా చెక్కులు పంపిణీ** : వేర్వేరు ప్రమాదాల్లో ఇటీవల మృతి చెందిన జనసేన పార్టీ క్రియాశీల కార్యకర్తల కుటుంబాలకు శ్రీకాకుళంలో ప్రమాద బీమా చెక్కులను మనోహర్ అందజేశారు. ఆపత్కాలంలో పార్టీ కార్యకర్తలను ఆదుకోవాలనే ఉన్నత ఆశయంతో పవన్ కళ్యాణ్ ప్రారంభించిన ఈ కార్యక్రమం ఎల్లవుడూ కొనసాగుతుందన్నారు. ఇటీవల ప్రమాదాల్లో మృతి చెందిన క్రియాశీల కార్యకర్తలు పలాస నియోజకవర్గానికి చెందిన బోరా శేషగిరిరావు, ఆమదాల వలస నియోజకవర్గానికి చెందిన గొర్లెల వసంత్ కుమార్, ఎచ్చెర్ల నియోజకవర్గానికి చెందిన మల్లపల్లి ఎల్లయ్య, పాలకొండ నియోజకవర్గానికి చెందిన వాస శివ ప్రసాద్ కుటుంబాలకు ప్రమాద బీమా చెక్కులను ఒక్కొక్కరికీ రూ.5 లక్షల చొప్పున అందించారు. కార్యకర్తల కుటుంబ సభ్యులతో ప్రత్యేకంగా మాట్లాడిన మనోహర్ పార్టీ ఎల్లవేళలా అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. వారి ఆర్థిక, కుటుంబ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

## ఆంక్షల పేరుతో అంధురాలి పెన్షన్ తొలగింపు కర్కశత్వం



అమరావతి, సూర్య బ్యూరో ప్రతినిధి : ప్రభుత్వం పెన్షన్ నిలిపివేయడంతో అనంతవురం జిల్లాలో గిరిజన మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ విచారకర ఘటనపై మాజీ సీఎం, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు స్పందించారు. కొంచెం మానవత్వం చూపండి జగన్ గారూ! మాటల్లో కాదు చేతల్లో..ఆంక్షల పేరుతో అంధురాలి పెన్షన్ తొలగింపు కర్కశత్వం. ఆమె ఆత్మహత్య అత్యంత హృదయవిదారకం అంటూ ఎక్స్ వేదికగా చంద్రబాబు తీవ్రంగా విమర్శించారు. ఏపీ హేట్స్ జగన్ అనే హ్యాష్ట్యాగ్ను తన ట్వీట్కు జోడించారు.

## ఇంకెంత మంది దివ్యాంగులను బలి తీసుకుంటావు జగన్



అనంతవురం జిల్లా గుంతకల్ మండలం నక్కనదొడ్డికి చెందిన దివ్యాంగురాలు సరోజ ఆత్మహత్య ఘటనపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ స్పందించారు. సరోజ కళ్లు కనిపించవని, కళ్లుండీ ఆమె ప్రాణాలు రక్షించలేకపోయాని వైఎస్సార్సీపీ సర్కారుపై మండిపడ్డారు. ఆమె తమ్ముడికి ఉద్యోగం వచ్చిందనే కారణం చూపి ఏడాదిగా పెన్షన్ నిలిపేశారని, తనకున్న ఏకైక ఆసరా కోల్పోయాననే బెంగతో సరోజ ఆత్మహత్యకు పాల్పడిందని పేర్కొన్నారు. ఇంకెంత మంది దివ్యాంగులు, వృద్ధులను బలి తీసుకుంటావు సైకో జగన్ అంటూ ముఖ్యమంత్రిపై ధ్వజమెత్తారు. కాగా ఫించను తొలగించారనే ఆందోళనలతో అనంతవురం జిల్లా గుంతకల్లు మండలంలోని నక్కనదొడ్డి తండాకు చెందిన సరోజ అనే 40 ఏళ్ల అంధురాలు ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. వుట్టుకతో అంధురాలైన ఆమెకు చిన్నప్పటి నుంచి ఫించను వచ్చేది. అయితే ఆమె తమ్ముడికి రైల్వేలో ఉద్యోగం రావడం, అతడి పేరు కూడా రేషన్ కార్డులో ఉన్న కారణంగా ప్రభుత్వం ఫించను ఆపేసింది.

## రైతుల విషయంలో స్వార్థపూరిత రాజకీయాలు మానుకోవాలి



గుంటూరు, సూర్య బ్యూరో ప్రతినిధి : రైతుల విషయంలో స్వార్ధపూరిత రాజకీయాలు మానుకోవాలని ఏపీసీసీ ప్రెసిడెంట్ గిడుగు రుద్రరాజు వ్యాఖ్యానించారు. తెనాలి నియోజకవర్గంలో ఆదివారం నాడు తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో కాంగ్రెస్ నేతలు పర్యటించారు. తుఫాన్ వల్ల నీట మునిగిన పంటలను గిడుగు రుద్రరాజు, మస్తాన్ వలీ పరిశీలించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పంటల రుణాల రీ షెడ్యూల్ని వెంటనే విడుదల చెయాలి. జగన్ తాడేపల్లి ప్యాలస్ నుంచి బయటకు వచ్చి రైతులను ఆదుకోవాలి. తక్షణ సహాయం ఇచ్చి రైతులను ఆదుకోవాలి. కాంగ్రెస్ పార్టీ తరువున రైతాంగానికి అంటాం. రైతులు ధైర్యంగా ఉండాలని రుద్రరాజు పేర్కొన్నారు.

## తుపాన్ భాధితులను ఆదుకోవడంలో జగన్ సర్కార్ విఫలం



విశాఖపట్నం, సూర్య బ్యూరో ప్రతినిధి : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన విశాఖలో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో మీచాంగ్ తుపాన్ భాధితులను ఆదుకోవడంలో జగన్ సర్కార్ విఫలం అయిందని, సీఎం చెబుతున్న దానికి, క్షేత్ర స్థాయిలో జరుగుతున్న పనులకు పొంతన లేదని విమర్శించారు. రాష్ట్రంలో వైసీపీకి తీవ్ర వ్యతిరేకత ఉందని, మేము ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతామన్నారు. సీఎం జగన్ ప్రజలను కలవరని, ఏమైనా ఉంటే సజ్జలకు చెప్పుకోవల్సిందేనన్నారు. సీఎం జగన్ తన వైఖరి మార్చుకోకపోతే, తెలంగాణలో బీఆర్ఎస్కు పట్టిన గతే వైసీపీకి పడుతుందని శ్రీనివాసరావు అన్నారు. ధాన్యం ఉత్పత్తి తగ్గిందని దీంతో బియ్యం ధరలు పెరుగుతాయన్నారు. అఖిల పక్ష సమావేశాన్ని తక్షణమే జగన్ ఏర్పాటు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించి పది వేల కోట్లు ప్రకటించి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైల్వే జోన్కు భూములు ఇవ్వలేదని బీజేపీ నేతలు సాకులు చెబుతున్నారని, విశాఖ స్టీల్ ప్లాంట్, రైల్వే జోన్ విషయంలో బీజేపీ మోసం చేస్తోందని శ్రీనివాసరావు ఆరోపించారు. స్టీల్ ప్లాంట్ మూసి వేయమని పార్లమెంట్లో బీజేపీ ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. బీజేపీ ఇప్పటి వరకు ప్రజా ద్రోహం చేసిందని, రాముడు పేరు చెప్పి దైవ ద్రోహనికి పాల్పడుతోందని వి. శ్రీనివాసరావు తీవ్ర స్థాయిలో విమర్శించారు.

## తెలంగాణ ఎన్నికల్లో చంద్రబాబు జోక్యం లేదు



విజయవాడ, సూర్య బ్యూరో ప్రతినిధి : తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడంలో చంద్రబాబు జోక్యం లేదని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్ధా వెంకన్న స్పందించారు. తెలంగాణ ఎన్నికల్లో చంద్రబాబు కానీ, టీడీపీ కానీ జోక్యం చేసుకోలేదని గుర్తు చేశారు. గాంధీభవన్ వద్ద టీడీపీ జెండాలకు, చంద్రబాబుకు సంబంధమేంటని ప్రశ్నించారు. చంద్రబాబుపై అవాకులు చవాకులు పేలుతున్న వైసీపీ నేతలను నియంత్రించాల్సిన బాధ్యత జగన్దేనని, ఇష్టారీతిగా మాట్లాడితే తాము కూడా అదే రీతిలో స్పందించాల్సి ఉంటుందని హెచ్చరించారు. తెలంగాణ ఎన్నికల ఫలితాలు చూసిన తర్వాత ఏపీని వదిలేందుకు చాలామంది వైసీపీ నేతలు సిద్ధమవుతున్నారని పేర్కొన్నారు. టీడీపీ నుంచి సస్పెండ్ అయిన కొడాలి నాని వైసీపీలోకి వెళ్లారని, ఆయనిప్పుడు చంద్రబాబుపై ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే సహించేది లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో విజయవాడ పశ్చిమ నుంచి బరిలోకి దిగాలని భావిస్తున్నట్టు వెంకన్న చెప్పారు. బీసీ అభ్యర్థిగా తనకు సీటు ఇస్తారన్న నమ్మకం ఉందని, ఇవ్వకుంటే తన వద్ద ఆప్షన్–బి ఉందంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. టీడీపీ నుంచి వైసీపీలోకి వెళ్లిన ఎమ్మెల్యేలు వచ్చే ఎన్నికల్లో గెలవరని జోస్యం చెప్పారు.

# కాంగ్రెస్ శ్రేణుల బ్రహ్మరథం

## దిగ్గజ నేతలకు నీరాజనం : పులకించిన ఖమ్మం

తెలంగాణ బ్యూరో ప్రతినిధి హైదరాబాద్: తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటై నాలుగురోజులే అయింది. కొత్త ప్రభుత్వం ఇంకా కుదురుకోలేదు. పూర్తి స్థాయి మంత్రివర్గ ఏర్పాటు కాలేదు. ముఖ్యమంత్రి మినహా మంత్రులు ఇంకా తమ బాధ్యతలనూ స్వీకరించ లేదు. మంత్రులు ఇంకా తమ బాధ్యతలను తీసుకోవాల్సి ఉంది. పూర్తిస్థాయిలో మంత్రివర్గాన్ని విస్తరించడానికి కసరత్తు చేస్తోంది కాంగ్రెస్ ప్రభుత్వం. మరో ఆరుమందిని కేబినెట్లోకి తీసుకోవాలని భావిస్తోంది. దీనికోసం ఆశావహుల జాబితాను వడపోస్తోంది. ఇప్పటివరకు ప్రాధాన్యత లేని జిల్లాలు, సామాజిక వర్గాలకు ప్రాధాన్యత లభించడం ఖాయంగా కనిపిస్తోంది. ప్రస్తుత మంత్రివర్గంలో ఖమ్మం జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు ప్రాతినిథ్యాన్ని వహిస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావులు ముగ్గురూ ఈ జిల్లాకు చెందిన వారే. భట్టి విక్రమార్క– మధిర, పొంగులేటి– పాలేరు, తుమ్మల నాగేశ్వర రావు– ఖమ్మం నియోజకవర్గాల నుంచి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత ఈ ముగ్గురూ తొలిసారిగా ఖమ్మం జిల్లాలో అడుగుపెట్టారు. ఈ ఉదయం ఖమ్మం జిల్లాకు చేరుకోగానే వేలాదమంది కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వారికి అదిరిపోయేలా స్వాగతం పలికారు. గజమాలలతో సత్కరించారు. ఖమ్మం టోల్ గేట్ దాటిన వెంటనే ప్రత్యేకంగా ర్యాలీని ఏర్పాటు చేశారు. ముగ్గురూ ఒకే వాహనంపై ప్రదర్శనగా బయలుదేరారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు పెద్ద ఎత్తున బైక్ ర్యాలీని చేపట్టారు. ప్రైవేటు, వ్యక్తిగత వాహనాలు, టూవీలర్లతో వారి వెంట ర్యాలీగా సాగిపోయారు.




## తప్పులో కాలేసినట్టే : బిజెపిలో అంతర్మథనం

తెలంగాణ బ్యూరో ప్రతినిధి హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో వెల్లడైన ఫలితాలపై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఖిన్నులైనట్టు సమాచారం. ప్రత్యేకంగా తనకు అందిన నివేదిక నేపథ్యంలో అమిత్ షా అందులోని వివరాలను చూసి నివ్వెరపోయినట్టు తెలుస్తోంది. 5 రాష్ట్రాలను గెలవాల్సిన మనం తెలంగాణలో ఇంత దారుణంగా ఎలా ఓడిపోయాం అని ఆరా తీశారని చెబుతున్నారు. ఈటెల రాజేందర్ చెప్పిన 50 లక్షల ముదిరాజ్ ఓట్లు ఏమయ్యాయి?,బిసి సీఎం అని ప్రజాల్లోకెళ్తే, తను ఎమ్మెల్యే, సీఎం అవుతాడని తెలిసి కూడా సొంత నియోజకవర్గ ప్రజలే ఎందుకు ఓడించారు?,రెండు స్థానాల్లో దారుణ ఓటమికి కారణాలు ఏమిటీ అనే విషయమై పార్టీ నేతల వద్ద ప్రస్తావించారు.బండి సంజయ్ హిందుత్వ ఎజెండా వల్ల ఓట్లు రావని ఫిర్యాదు చేసిన ఈటెల, తన సొంత ఫార్ములా తో వెళ్తే ఎలా ఓడిపోయాడన్నారు.ఈటెల సామాజికవర్గం ఓట్లు అధికంగా ఉన్న చోట్ల కనీసం డిపాజిట్ రాని పరిస్థితి కి కారణం ఏమిటి అనే విషయం పై వాకబు చేశారు.6 నెలల ముందు 23 శాతం ఉన్న ఓటు బ్యాంకు 13 శాతానికి ఎలా పడిపోయింది,ఎంత గుర్తింపు ఇచ్చినా ఈటెల వల్ల పార్టీ కి వచ్చిన లాభం ఏమిటీ అంటూ అమిత్ షా అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. అన్ని విషయాలపై ఆరా తీసిన అమిత్ షా, త్వరలోనే పార్టీని గాడిలో పెట్టేందుకు సమయం అవుతున్నట్టు సమాచారం. అసలు కొందరు నాయకులను ఇంత గుడ్డిగా ఎలా నమ్మాము అర్థం కాని పరిస్థితి ఉన్నదని, సొంత నేతలని కాదని ఇతరుల మాటలు వింటే చేతులారా పార్టీని నాశనం చేసుకున్నట్టు అయిందనే దిశగా పార్టీలో అంతర్మథనం సాగుతున్నట్టు తెలుస్తోంది.

# ప్రజల వెంటే కాంగ్రెస్ సర్కార్

- ప్రతి పేద కుటుంబానికి 10 లక్షల ఆరోగ్యశ్రీ వర్తింపు
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం
- రెండు రోజుల్లో రెండు గ్యారెంటీలను అమలు చేసిన ప్రభుత్వం
- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ




సంగారెడ్డి మేజర్ న్యూస్ ప్రతినిధి : నియోజకవర్గస్థాయిలోరాజీవ్ ఆరోగ్యశ్రీ చేయూత, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం(మహాలక్ష్మి) పథకాలను ప్రారంభించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ,ఆయా శాసనసభ్యులుప్రభుత్వం చేసిన ఆరు వాగ్దానాలలో (గ్యారంటీలలో) రెండింటినీ రెండు రోజుల్లోనే ప్రభుత్వం అమలు చేస్తుందని, ఇది ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి. దామోదర్ రాజనర్సింహ అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు, మహిళలకు ఉచిత ప్రయాణ వసతి కల్పిస్తూ అందుబాటులో తెచ్చిన మహాలక్ష్మి పథకాలను నియోజకవర్గ స్థాయిలో ఆందోల్ నియోజక వర్గంలో జోగిపేట బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి ఆదివారం లాంచనంగా ప్రారంభించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కు సంబంధించి బస్సులను జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ సమాజానికి, తెలంగాణ రాష్ట్రానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే వంద రోజుల్లో ఆరు గ్యారంటీ లు అమలు చేస్తామని చెప్పిన మేరకు ప్రభుత్వం ఏర్పడిన రెండు రోజుల్లోనే రెండు హామీలను అమలు చేస్తున్నా మన్నారు. రాజశేఖర్ రెడ్డి హయాంలో రాజీవ్ ఆరోగ్యశ్రీని మొదలుపెట్టామని, అదే ఆరోగ్యశ్రీ తో ప్రతి పేద కుటుంబానికి 10 లక్షల రూపాయల వరకు కార్పొరేట్ ఆసుపత్రులలో ఉచిత వైద్యాన్ని అందజేస్తామన్నారు. ఐదు లక్షల రూపాయల పరిమితినీ పది లక్షల రూపాయలకు పెంచినట్లు తెలిపారు. ఏ పేదవాడు ఆరోగ్యానికి సంబంధించి అప్పుల పాలు కావద్దని, కాంగ్రెస్ సర్కారు ప్రజల వెంట ఉందని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతుందన్నారు.తెలంగాణ మహిళా బిడ్డలు ఏ పుణ్యక్షేత్రమైన, మారుమూల ప్రాంతమైన, పర్యాటక ప్రాంతమైన వెళ్లేలా ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణాన్ని మొదలుపెట్టామ న్నారు. ఇది కాంగ్రెస్ రెండవ వాగ్దానమని పేర్కొన్నారు. ప్రభుత్వం అన్నివేళలా ఆడబిడ్డలకు అండగా ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శరత్, నియోజకవర్గ ప్రత్యేక అధికారి జడ్పీ సీఈఓ ఎల్లయ్య, వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గాయత్రీ దేవి, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్, ఆర్టీసీ రీజినల్ మేనేజర్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.పటాన్ చెరు నియోజకవర్గం పటాన్చెరు డివిజన్ పరిధిలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు కార్యక్రమాన్ని, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం (మహాలక్ష్మి) కార్యక్రమాన్ని శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ప్రారంభించారు. శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న 5 లక్షల రూపాయల పరిమితి నుండి 10 లక్షల రూపాయలకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, మహాలక్ష్మి పేరిట మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజాప్రతి నిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.జహీరాబాద్ నియోజకవర్గ స్థాయిలో జహీరాబాద్ బస్టాండ్ ఆవరణలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పెంపు, మహాలక్ష్మి పథకాలను జహీరాబాద్ శాసనసభ్యులు మాణిక్ రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ శివకుమార్, ఇతర ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, మహిళలు పాల్గొన్నారు.నారాయణఖేడ్ నియోజకవర్గంలో నారాయ ణఖేడ్ రాజీవ్ చౌక్ వద్ద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం (మహాలక్ష్మి) కార్యక్రమాన్ని, నారాయణఖేడ్ ఏరియా ఆసుపత్రి ఆవరణలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు కార్యక్రమాన్ని నారా యణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ సంజీవరెడ్డి ప్రారంభించారు.ఈ కార్య క్రమంలో ఇతర ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.సంగారెడ్డి నియోజ కవర్గంలో సంగారెడ్డి కొత్త బస్టాండ్ ఆవరణలో డిప్యూటీ రీజినల్ మేనేజర్, డిప్యూటీ డిఎం అండ్‌హెచ్ ఓ, నియోజకవర్గ ప్రత్యేక అధికారి, నిర్మలా జయప్రకాష్ రెడ్డి,ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొని ప్రారంభించారు.

## యశోద హాస్పిటల్‌కు సిఎం రేవంత్ రెడ్డి

- మాజీ సీఎం కేసీఆర్‌కు పరామర్శ
- త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్ష
- ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో వాకబు
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు, యశోద హాస్పిటల్ డాక్టర్లను కలిసి కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై ఆరా
- సీఎం వెంట మంత్రి సీతక్క, షబ్బీర్ అలీ తదితరులు



తెలంగాణ బ్యూరో ప్రతినిధి హైదరాబాద్ :తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కె .చంద్రశేఖర్ రావు ను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం యశోద దవాఖాన లో పరామర్శించారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు, యశోద హాస్పిటల్ డాక్టర్లను కలిసి కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, డాక్టర్ ఎంవీ రావు తదితరులున్నారు. సీఎం వెంట మంత్రి సీతక్క, షబ్బీర్ అలీ తదితరులున్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఎలాంటిదో చెప్పడానికి ఇదొక ఉదాహరణ : కిషన్ రెడ్డి

- కర్నాటక, తెలంగాణ రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్
- ఆరు నెలలు కాకముందే కాంగ్రెస్ అవినీతి షురూ చేసిందని వ్యాఖ్య
- కర్నాటకలో ఓ నేత నుంచి తెలంగాణకు భారీగా డబ్బు తరలించారని ఆరోపణ



తెలంగాణ బ్యూరోప్రతినిధి: తెలంగాణ బీజేపీ చీఫ్, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీపై ధ్వజమెత్తారు. ఎక్కడ కాంగ్రెస్ ఉంటే అక్కడ అవినీతి విజృంభిస్తుందని, దేశ ఆర్థిక వ్యవస్థను కాంగ్రెస్ పార్టీ చెదలు పట్టినట్టుగా తొలుస్తుందని విమర్శించారు. కర్ణాటకలో అధికారం పీఠం ఎక్కి ఆర్నెల్లు కూడా కాకముందే కాంగ్రెస్ అవినీతికి తెరలేపిందని అన్నారు. ఈ దోపిడీకి భయపడి కర్ణాటకలోని బిల్డర్లు పొరుగు రాష్ట్రాలకు పారిపోతున్నారని, కాంగ్రెస్ పాలన ఎలా ఉంటుందో చెప్పడానికి ఇదొక ఉదాహరణ అని వివరించారు. కర్ణాటకలో కాంగ్రెస్‌ను గెలిపించినందుకు ప్రజలు ఇప్పుడు తలపట్టుకుంటున్నారని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఝార్ఖండ్ లో కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ సాహు నివాసంపై ఐటీ దాడులు జరిగితే రూ. 290 కోట్లు దొరికాయని, అవినీతికి పాల్పడే సీఎంలను, ఎంపీలను కాంగ్రెస్ పార్టీ ఏటీఎంలుగా మార్చుకుంటుందని విమర్శించారు. ఇటీవల కర్ణాటక నుంచి భారీ ఎత్తున తెలంగాణకు తరలించిన డబ్బు పట్టుబడిందని తెలిపారు. ధీరజ్ సాహు తరహాలోనే కర్ణాటకలోని ఓ నేత నుంచి ఈ డబ్బు తరలించారని కిషన్ రెడ్డి ఆరోపించారు. త్వరలో పార్లమెంటు ఎన్నికలు రానున్నాయని, కాంగ్రెస్ కు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు.

# హోమ్ మంత్రి ఎవరు?

- సర్వత్ర ఆసక్తి -విస్తరణపై ఉత్కంఠ
- అధిష్ఠాన వర్గానికి ఆశావహుల తాకిడి
- ముఖ్యమంత్రిపై పెరిగిన ఒత్తిడి
- ఎమ్మెల్సీలకు , ఓడిపోయిన ప్రముఖులకు కూడా దక్కనున్న ఛాన్స్
- ఇప్పటికే స్పష్టతకు వచ్చిన రేవంత్ రెడ్డి
- చివరి నిమిషంలో మార్పులు చేర్పులకు అవకాశం
- రేసులో షబ్బీర్ అలీ, అంజన్ కుమార్ యాదవ్, మల్‌రెడ్డి రంగారెడ్డి, గడ్డం వివేక్, ప్రేమ్ సాగర్ రావు , మధుయాష్కి గౌడ్ తదితరులు








తెలంగాణ బ్యూరో ప్రతినిధి హైదరాబాద్: మంత్రివర్గం ప్రమాణ స్వీకారం చేసిన నేపథ్యంలో మరో ఆరు పదవులు మిగిలి ఉన్నాయి. వాటిని భర్తీ చేసే దిశగా రేవంత్ రెడ్డి కసరత్తు చేస్తున్నారు. తెలంగాణలో కొత్త ప్రభుత్వం ఇప్పటికే కొలువు తీరింది. సీఎం రేవంత్ వేగంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. మంత్రివర్గంలో 11 మంది మంత్రులకు శాఖలు ఖరారయ్యాయి. కీలక శాఖలు సీఎం వద్దే ఉన్నాయి. కేబినెట్ లో మరో ఆరు స్థానాలు భర్తీ చేయాల్సి ఉంది. ఈ స్థానాలను భర్తీ చేసేందుకు రేవంత్ సిద్దంగా ఉన్నారు. జాబితా సిద్ధం చేసుకున్నారు. హైకమాండ్ ఆమోదం కోసం ఎదురు చూస్తున్నారు. ఈ నెలాఖరులోగా మంత్రి వర్గ విస్తరణకు ఛాన్స్ కనిపిస్తోంది.రేవంత్ తొలి మంత్రివర్గంలో సీనియర్లకు అవకాశం ఇచ్చారు. వారికి శాఖలు అప్పగించారు. కీలక శాఖలు ఇంకా భర్తీ చేయాల్సి ఉంది. రేవంత్ ఇప్పటికే మరో ఆరుగురికి కేబినెట్ లో అవకాశం కల్పించేలా ప్రణాళికలతో సిద్దమయ్యారు. వారి కోసమే కొన్ని ప్రధాన శాఖలను పెండింగ్ పెట్టారు. అందులో హోం శాఖతో పాటుగా విద్యా, సాంఘిక సంక్షేమం, మున్సిపల్ వంటి కీలక శాఖలు ఉన్నాయి. ప్రస్తుత కేబినెట్ లో నిజామాబాద్, అదిలాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు ప్రాతినిధ్యం దక్కలేదు. మిగిలి ఉన్న ఆరు స్థానాలకు 15 మంది పోటీ పడుతున్నారు. ఇందులో ఎమ్మెల్యేలుగా ఓడిన వారు ఉన్నారు. అయితే, రేవంత్ రెడ్డి మాత్రం తన టీంలో ఎవరికి అవకాశం ఇవ్వాలో ఇప్పటికే నిర్ణయించుకున్నట్టు సమాచారం. ఇదిలా ఉండగా ఆదిలాబాద్ నుంచి గడ్డం సోదరుల మధ్యే పోటీ నడుస్తోంది. చెన్నూరులో గెలిచిన వివేక్, బెల్లంపల్లిలో గెలిచిన వినోద్ కేబినెట్ బెర్త్ కోసం సోనియాను కలిసారు. రేవంత్ తనకు అవకాశం ఇస్తారని వివేక్ నమ్మకం తో ఉన్నారు. నిజామాబాద్ నుంచి షబ్బీర్ అలీ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. ఈయన నిజామాబాద్ అర్బన్లో ఓడినప్పటికీ ఎమ్మెల్సీ ఇచ్చి కేబినెట్లోకి తీసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. వీళ్లతో పాటు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ రావు కూడా కేబినెట్ ప్రయత్నాల్లో ఉన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి మల్రెడ్డి రంగారెడ్డి పేరు పరిశీలనలో ఉన్నాయి. హైదరాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థులు ఎవరూ గెలవలేదు. అయినప్పటికీ మైనార్టీ కోటాలో ఫిరోజ్ఖాన్ పోటీలో ఉన్నా,షబ్బీర్ అలీకి ఓకే అయితే ఫిరోజ్ఖాన్కి అవకాశాలు సన్నగిల్లుతాయి.గ్రేటర్ నుంచి మైనంపల్లి హన్మంతరావు, అంజన్ కుమార్ యాదవ్, మధుయాష్కి పేర్లు కూడా పరిశీలనలో ఉన్నాయి. దేవరకొండ ఎమ్మెల్యే బాలూనాయక్ మంత్రి పదవి ఆశిస్తున్నారు. ఎస్టీ సామాజికవర్గం నుంచి సీతక్కకు అవకాశం ఇవ్వటంతో మరో బెర్తు కష్టమనే వాదన ఉంది. హైదరాబాద్ నుంచి అంజన్ కుమార్ యాదవ్ కే ఎక్కువ అవకాశాలు కనిపిస్తున్నాయి. షబ్బీర్ అలీ, అంజన్ కుమార్ యాదవ్ కు మంత్రులుగా అవకాశం ఇచ్చి ఎమ్మెల్సీలుగా ఎంపిక చేస్తారని సమాచారం. అదే సమయంలో కీలకమైన హోం శాఖ ఎవరికి అప్పగిస్తారనేది చర్చ సాగుతోంది. హైదరాబాద్ నుంచి మంత్రి పదవి ఖరారు,శాఖల కేటాయింపు ఇప్పుడు కీలకంగా మారుతోంది. ఇప్పటికే ముఖ్యమంత్రిపై మిగిలిన ఆరు మంత్రి పదవులకు సంబంధించి ఒత్తిడి పెరిగింది. వివిధ మార్గాల ద్వారా ఆశావహులు పెద్ద ఎత్తున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై ఒత్తిడి చేస్తున్నారు. ఈ తాకిడి కాంగ్రెస్ పార్టీ అధిష్టాన వర్గంకు కూడా ఉంది. అయితే మంత్రుల ఎంపిక అనేది ముఖ్యమంత్రి అభిష్టానికి హై కమాండ్ వదిలివేసినట్టు తెలిసింది. అవసరమైతే మరొకసారి అధిష్టాన వర్గంతో ముఖ్యమంత్రి పదవులకు సంబంధించి చర్చించే అవకాశాలు ఉన్నట్టు చెబుతున్నారు. ఇప్పటికే ఎవరెవరికి మంత్రి పదవులు ఇవ్వాలనే విషయమై స్పష్టతకు వచ్చినప్పటికీ, చివరి నిమిషంలో చేర్పులు మార్పులు కూడా అనివార్యం అనే అభిప్రాయం నెలకొన్నది. అయితే కాంగ్రెస్ పార్టీకి మొదటి నుంచి ఆయువు పట్టుగా ఉన్న మంచిర్యాల శాసనసభ్యుడు ప్రేమ్ సాగర్ రావు కూడా తన ప్రయత్నాలను ముమ్మరం చేశారు. పార్టీకి చేసిన సేవలను గుర్తు చేస్తున్నారు. కచ్చితంగా మంత్రి పదవి ఇవ్వాల్సిందేనని ఆయన హై కమాండ్ వద్ద ముఖ్యమంత్రి వద్ద పట్టుబడుతున్నారు.

## యశోద హాస్పిటల్‌కు ప్రముఖుల తాకిడి

- కెసిఆర్‌కు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మాజీ ఎంపీ వీహెచ్ తదితర ప్రముఖుల పరామర్శ
- కేటీఆర్, హరీష్ రావులను వివరాలు అడిగి తెలుసుకున్న నేతలు



తెలంగాణ బ్యూరో ప్రతినిధి హైదరాబాద్ : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను పరామర్శించేందుకు యశోద దవాఖానకు ఆదివారం పలువురు ప్రముఖులు వచ్చారు. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి. హన్మంతరావు, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ కిసాన్ సెల్ నేత కోదండ రెడ్డి తదితరులు ఆస్పత్రికి వచ్చి కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి పై అడిగి తెలుసుకున్నారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు, శ్రీనివాస గౌడ్,ఎమ్మెల్సీ లు కవిత, గోరటి వెంకన్న తదితరులు కూడా అక్కడే ఉన్నారు.

# సర్కారుతో సమరమేనా?

- ముఖ్యమంత్రికి మింగుడు పడని కొందరు ఐఏఎస్‌లు
- సీఎంను కలవడానికి సైతం ససేమిరా
- రేవంత్ రెడ్డి వైఖరిపై ఉత్కంఠ
- వేటు తప్పదని అంచనా
- గత ప్రభుత్వానికి సానుకూలంగా వ్యవహరించాలని సీఎం సందేహం
- కొందరు అధికారులను లూప్ లైన్‌లోకి పంపించే ఛాన్స్
- ఇప్పటికే మానసికంగా సిద్ధమైన సదరు అధికారులు



తెలంగాణ బ్యూరో ప్రతినిధి హైదరాబాద్: ప్రభుత్వంలో కొందరు ఐఏఎస్ అధికారుల మరియు ఇతర సీనియర్ అధికారుల తీరు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మింగుడు పడడం లేదు. గత పది సంవత్సరాల కాలంలో అధికారులు అనుసరించిన పక్షపాత వైఖరి దీనికి కారణం అనే అభిప్రాయం సీఎం లో నెలకొంది. తనతో కలిసి రాని అధికారుల పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుసరించనున్న వైఖరి పై అంతటా ఉత్కంఠ ఏర్పడింది. సర్కారుతో సమరమే అనే పద్ధతిలో కొందరు అధికారులు ఉన్నారని సమాచారం. వాస్తవానికి తెలంగాణ ముఖ్యమంత్రిగా ఎనుముల రేవంత్ రెడ్డి ఈనెల ఏడోతేదీన ప్రమాణ స్వీకారం చేశారు. ఇప్పటికే నాలుగు రోజులవుతోంది. ప్రగతి భవన్ లో ప్రజాదర్బార్ నిర్వహిస్తుండటంతో ప్రజలు నేరుగా కలుస్తున్నారు. అలాగే ఈ నాలుగు రోజుల్లో పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు వరుసపెట్టి ముఖ్యమంత్రిని కలుస్తున్నారు. అయితే ఇంతవరకు రేవంత్ ను కలవని ఐఏఎస్ లు కూడా ఉన్నారు. అలాంటి వారిలో స్మిత సబర్వాల్, జయేష్ రంజన్, అరవింద్ కుమార్, ప్రియాంక వర్గీస్ లు ముఖ్యులు.వీరు మాత్రం ఇంతవరకు ముఖ్యమంత్రిని కలవలేదు. వీరిపై బదిలీ వేటు పడుతుందంటున్నారు. స్మిత సబర్వాల్ ముఖ్యమంత్రి సెక్రటరీగా పనిచేశారు. ప్రస్తుతం ఇరిగేషన్ అదనపు కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ప్రియాంక వర్గీస్ ముఖ్యమంత్రి కార్యాలయ ఓఎస్డీగా పనిచేశారు. స్మిత సబర్వాల్ తో కలిసి మిషన్ భగీరథ పనులు పర్యవేక్షించారు. పరిశ్రమలు, ఐటీ శాఖను పర్యవేక్షించిన జయేష్ రంజన్ మాజీ మంత్రి కేటీఆర్ కు అత్యంత సన్నిహితుడు. అరవింద్ కుమార్ పురపాలక కార్యదర్శిగా పనిచేశారు. ఈయన కూడా కేటీఆర్ కు దగ్గరయ్యారు. ఔటర్ రింగ్ రోడ్డు కాంట్రాక్టు విషయంలో వివరాలు కావాలని అడిగితే రేవంత్ రెడ్డికి అప్పుడు మున్సిపల్ సెక్రటరీగా ఉన్న అరవింద్ కుమార్ కౌంటర్ ఇచ్చారు. విలేకరుల సమావేశంలో అరవింద్ కుమార్ పని తీరు పట్ల రేవంత్ రెడ్డి విమర్శలు చేశారు. వీరంతా ముఖ్యమంత్రిని కలవడానికి ఇష్టం చూపడంలేదని తెలుస్తోంది. వీరితోపాటు దేవాదాయ శాఖలో తన సర్వీస్ ఎక్స్ టెన్షన్ లో ఉన్న అనిల్ కుమార్, జీఏడీ ప్రోటోకాల్ సెక్రటరీ అరవింద్ సింగ్ ను కూడా ప్రస్తుత ప్రభుత్వం పక్కన పెట్టే అవకాశం ఉంది. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత గత ప్రభుత్వ హయాంలో కీలకంగా వ్యవహరించిన అధికారులపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా ఐఏఎస్ అధికారులతో పాటు రెండవ శ్రేణి అధికారులు కూడా పెద్ద ఎత్తున సీఎంను కలవకుండా ఉన్నారు. గత ప్రభుత్వానికి అత్యంత అనుకూలంగా వ్యవహరించిన అధికారుల చిట్టా బయటకు తీయాలని ముఖ్యమంత్రి ఇప్పటికే ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రం అభివృాఎద్ధి సంక్షేమ రంగాలలో దూసుకుపోవాలంటే తనతో చిత్తశుద్ధితో కలిసివచ్చే టీం అవసరమని సీఎం అభిప్రాయపడ్డారు. ఆ క్రమంలోనే తనకు అనుకూలమైన జట్టును సిద్ధం చేసుకుంటున్నారు. పది సంవత్సరాలు భారత రాష్ట్ర సమితి పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉండడంతో సీనియర్ అధికారులు పలువురు అధికార పక్షంతో చేతులు కలిపారని ముఖ్యమంత్రి అనుమానిస్తున్నారు. ఈసారి కూడా అధికారంలోకి భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం వస్తుందని ఊహించారు. రాష్ట్రంలో తాజాగా అనూహ్యంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో అధికారులు అయోమయంలో పడ్డారు. అధికారంలో ఉన్న పార్టీతో సఖ్యతతో ఉంటే అనుకూలముద్ర వేస్తారని పలువురు అధికారులే అంటున్నారు. ముక్కు సూటిగా నిజాయితీగా వ్యవహరిస్తే ప్రభుత్వం నుంచి ఇబ్బందులు ఉంటాయని కూడా పేర్కొంటున్నారు. పాలకపక్షాల రాజకీయ పోకడలతో, ఒత్తిడితో తాము సతమతం అవుతున్నామని కూడా అంతర్గత సమావేశాలలో ఐఏఎస్ అధికారులు పేర్కొంటున్నారు. గతంలో డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు కూడా పలువురు అధికారులు ఒత్తిడికే లోనయ్యారు. అనంతరం పోలీస్ కేసులలో ఇరుక్కోవడం, జైలుకు వెళ్లిన సందర్భాలు కూడా లేకపోలేదు.

## తెలంగాణ అభివృద్ధి పథంలో నడిపిస్తాం

- కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేస్తాం
- కొత్తగూడెంను పారిశ్రామికంగా అభివృద్ధి చేసిన ఘనత కాంగ్రెస్‌దే
- డీప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

తెలంగాణ బ్యూరోప్రతినిధి: కొత్తగూడెం ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. ఆదివారం నాడు జిల్లాలోని పాల్వంచ సుగుణ గార్డెన్‌లో కాంగ్రెస్, సీపీఐ పార్టీల ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య , మట్టా రాగమయి జారే ఆదినారాయణ, రాందాస్‌కి సన్మానం చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కమాట్లాడుతూ గత ఎన్నికల్లో గెలిపించిన ఎమ్మెల్యే పార్టీ మారితే ఈ ఎన్నికల్లో కూనంనేనిని గెలిపించారు. మార్పు కోసం 9 స్థానాల్లో కాంగ్రెస్, సీపీఐ పార్టీని గెలిపించారు. రాజకీయాలను ప్రజా సేవగా చేయాలనే తపన ఉన్న నాయకుడు కూనంనేని. కాంగ్రెస్ పార్టీ మాట ఇచ్చింది ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తాం. అనంతరం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రి పదవులు దక్కడం సంతోషంగా ఉందని చెప్పారు.

'సూర్య' సాహిత్య సాంస్కృతిక వేదిక

# అక్షరం



## చీకటి మధ్యలో

చీకటి మధ్యలో ఏదో జాతరెళ్ళింది
అర్ధరాత్రంతా మద్దెల దరువులు
పిచ్చి అరుపులు..మై మెరుపులు
ఈలలు.. ఈదురు గాలులు
గాఢ నిద్రలో ఏమైందో గుర్తే లేదు
పొద్దు పొడిచే వేళకి
ఏ సద్దూ లేదు.. చప్పుడూ లేదు
ఇంట్లోకి చొరబడిన కొత్త నీరు
తరచి చూస్తే బురద వాసన
ఎంత చూసినా నేనెవరికీ పట్టనూ లేదు
తలుపు తట్టనూ లేదు
చప్పున గుర్తొచ్చింది.. చూద్దును కదా
చూపుడు వేలు పై సిరాముద్ర



బుద్ధొచ్చే దాకా నిలిచే పుట్టుమచ్చ.
నా మొద్దు నిద్రకు ఆనవాలుగా.

– డా. డి.వి.జి.శంకర రావు , మాజీ ఎంపీ, పార్వతీపురం. 94408 36931.

## నీ కోసం!!

నీ ప్రాపకం కోసం
ప్రపంచాన్ని పట్టించుకోక
అంతులేని ఆరాటపడి
అలసిపోని పోరాటం చేస్తూ !
ఎన్నో వాసంతాలని
ఎన్నెన్నో శరత్తులని
మరెన్నో హేమంతాలని
ఆస్వాదించక గుడ్డిగా వదులుకున్నా!
స్వాతిముత్యపు జల్లుల వెల్లువకు
తడిసిముద్దై మురిసిపోక
నీకై అనునిత్యం పరితపిస్తూ
నిను పొందాలని వెంపర్లాడా!
ఎదురొచ్చి కలిసొచ్చే విలువైన కాలాన్ని
చిదిమి ఛిద్రంజేసి మింగేసి
నీ దాహార్తి తీరునని
ఎండమావులెంట పరుగులో మునిగితేలా!
గ్రీష్మపు ఎండతీరున్న
మిసిమివేడి ఈడు దాటిపోయె
భ్రమలలోనే సాగుతూ జీవితం
ప్రొద్దువాలు సంధ్యలోకి చేరిపోయె!
వాస్తవ లోకంలోకి జారిపడి



ఆశలురాలి బ్రతుకు శిశిరపు మోడాయె
వెంటపడ్డ ఎండమావులూ మాయం
సొగసైన కాలం ప్రాయం మటుమాయం!
జీవితపు అద్దంలోకి తొంగిచూస్తే
గతం తాలూకు జ్ఞాపకాలన్నీ
అహోరాత్రాలు నీ గురించి
అర్రులుచాచడమే
విఫల ప్రయత్నమైన ఓ కోరుకున్న
గమ్యమా!!

– రవి కిషోర్ పెంట్రాల, లాంగ్లీ, లండన్!0044-07703327908

## చివరి కోరిక

కళ్ళలో వత్తులు మొరాయించాయి ....
కన్నీరు నిండుకుని ....
నింగిలోని మేఘాలు కళ్లకింద చేరాయి
పొయ్యిలో కరకర మండాల్సిన
ఎండుకట్టెలు జాలిగా చూస్తున్నాయి
నా బతుకు చిత్రం
బహుముఖ చిత్రాలయ్యాయి ....!
ఏటిలోన నా చిత్రం సూరీడు చెరిపేశాడు
చింత చెట్టు నా నీడను రాకాసిలా
మింగేసింది
వర్షానికి తడిసి ముద్దైన నా ప్రాణంలో
కొత్త మొలకలొస్తాయన్న ఆశ –
ఆకాశాన్ని
తాకకముందే – కుండపోతలో
కొట్టుకుపోయింది
ప్రకృతికీ నా బతుకు భారమైందేమో
కాళ్ళ కింద మట్టి బీటలు వారకముందే .
గుండెజారి ఏటిలో పడ్డాను !
అందరికి కూడు పెట్టిన నా చేతులు
ఇప్పుడూ
ఏవేవో జలరాసులకు కూడు గా ...
ఆపన్నహస్తం కోసం అలసిన కళ్ళు



నిశ్చింతగా శాశ్వత ఒడిలోకి చేరుతూ
పైకి చూశాయి– చందమామ పైనున్న
ద్యాసలో ఇసుమంతైనా భూమ్మీద ఉంటే
ఆధునికత ప్రయోగిస్తే – యువత
ముందుకు రాదా
నిరంతర సేద్యం పచ్చగా ముందుకు
సాగదా ?
జై భారత్ – జై కిసాన్

...న్యాలకంటి నారాయణ 9550833490

## రాయలసీమ చిత్రలేఖన పోటీలు

రాయలసీమ ప్రాంత జీవన స్థితిగతులు, సంస్కృతి, ప్రకృతి, సమకాలీన సమస్యల నేపథ్యంగా చిత్రలేఖన పోటీలను రాయలసీమ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ప్రముఖ సామాజిక ఉద్యమకారులు తిమ్మాపురం బాలకృష్ణారెడ్డి గారి స్మారకార్థం నిర్వహిస్తున్నాం. జనవరి 31 వ తేదిలోగా 9962544299 వాట్సప్ నవంబర్‌కు చిత్రాలను పంపాలి. విజేతలకు పదివేల రూపాయలు బహుమతులుగా అందజేస్తాం. మరిన్ని వివరాలకు 9963917187 సంప్రదించగలరు.


**– డా. అప్పిరెడ్డి హరినాథరెడ్డి, రాయలసీమ సాంస్కృతిక వేదిక,, సమన్వయ కర్త.**

# మానవ సమాజానికి ఆదర్శ ప్రాయం ఋగ్వేద సమాజం

## ఋగ్యజుస్సామాథర్వ వేదాల సారం-2



**వనం జ్వాలా నరసింహారావు**
**80081 37012**




ఋగ్వేదం ఒక పరిపూర్ణ, శాంతియుత, స్వయం సమృద్ధ సమాజాన్ని సృష్టించింది. అయోమయంలో వుండి, అడుగంటనున్న నేటి ప్రపంచ మానవ సమాజానికి ఆదర్శప్రాయం ఋగ్వేద సమాజం. ఈ సమాజంలో ఒక స్థిరమైన రాజకీయ వ్యవస్థ వుంది. మానవ సంబంధాలు స్థిరపడ్డాయి. ఉమ్మడి కుటుంబాలు, ప్రేమాభిమానాలు, అనుబంధాలు అమృతప్రాయములైనాయి. గ్రామాల్లో శాంతి, సహకారం, సద్భావం అవతరించాయి. స్త్రీలకు ఆస్తి హక్కు, కుటుంబ యాజమాన్యం కలిగించారు. ఋగ్వేద జీవన విధానమే ప్రపంచమంతటా కొనసాగింది. ఇన్ని వేల సంవత్సరాలు నిరంతరాయంగా కొనసాగిన జీవన విధానాన్ని మానవజాతికి అందించిన ఋగ్వేదాన్ని నమోవేదమాత అనడం కన్నా మనం ఏం చేయగలం?'.

'ఋగ్వేదం ప్రధానంగా పరమాత్మ, ఆత్మ, ప్రకృతి యొక్కగుణాలు, లక్షణాలను వివరిస్తుంది. అదీకాక దృశ్యాదృశ్య (కంటికి కనిపించే, గోచరమైన జగత్తు గురించి, కంటికి కనిపించని అగోచరమైన జగత్తు విశేషాల గురించి) జగత్తు వివిధ లక్షణాల గురించి వివరిస్తుంది. రసాయన, భౌతిక, గణిత, ఖగోళ, విశ్వోద్భవ శాస్త్రాల యొక్క ప్రాథమిక అంశాలను వివరిస్తుంది. మానవుడి పూర్తి జీవితంలో అనుసరించవలసిన ధర్మాల గురించి, అనుసరించవలసిన ఆదర్శాల గురించి చెప్తుంది. ఆధ్యాత్మిక విషయాల యొక్క లక్షణాలు, ప్రకృతి, పనితీరు వివరిస్తుంది.' మరిన్ని వివరాల్లోకి పోతే.....

'వేదం అపౌరుషేయం, దైవదత్తం, దైవప్రసాదం, అమృతమయం. 'వేదం అపౌరుషేయమంటే అది మానవ నిర్మితమైనది కాదని అర్థం. అలాగే వేదం దైవదత్తం, దైవప్రసాదం. ఆ మాటకొస్తే, సమస్త ప్రకృతి దైవదత్తమే, దైవ ప్రసాదమే! మానవుడు సృష్టించగల సామర్థ్యం వున్నవాడు కాదు. ప్రకృతిని దర్శించి వినియోగించగలవాడు మాత్రమే. ప్రకృతి సహాయం లేకుండా లోకాలు నిలువజాలవు. దైవప్రసాదమైన ప్రకృతి శక్తులను శాస్త్రజ్ఞులు, ఆవిష్కర్తలు, మేధావులు, ఋషులు మాత్రమే దర్శిస్తారు. దర్శించడం అంటే కంటికి కనిపించేది చూడడమని కానేకాదు. కంటికి కానరానిదానిని కనుగొనడం. ఋషి అతీంద్రియ దర్శి. వేదం శ్రుతి. విన్నది మాత్రమే. వేదంలోని మంత్రాలను, సూక్తాలను ఋషులు కనుగొన్నారు. మనం వేదంలో చూసే ఋషులు వేదకర్తలుకారు. ద్రష్టలు మాత్రమే. స్మర్తలు గుర్తుంచుకున్నవారు అవుతారు'.

'వేదం కర్మ ప్రతిపాదకం. కర్మ అంటే కార్యం. కృషి. ఇంద్రాది దేవతలు కర్మలవల్ల గొప్పవారయినారు. జన్మమాత్రాన కాదు. ఉదాహరణకు నూరు సత్కార్యాలైన యజ్ఞాలు చేసినవాడు ఇంద్రుడు అవుతాడు. వేదం అపారం. వేదార్థము బహువిధము. ఇందు అనేక శాస్త్రాలు, శాస్త్రార్థాలు, విజ్ఞానాలు, వికాసాలు, నానాశాఖలు వున్నాయి. ఏ ఒకరో, ఇద్దరో దీనిని అర్థం చేస కోవడం అసాధ్యం, అసంభవం. సత్యాన్ని దర్శించడానికి ఒకే ఈశ్వరుని ప్రతిపాదించడానికి వేదంలో నిరంతర ప్రయత్నం సాగుతున్నది. లోకం గతానుగతం.నలిగిన మార్గంలో నడిచేది. కొత్తదాన్ని ఆమోదింపచేయడం ఎంత కష్టమైనను పాతది నిలబడడం లేదు. అయినా సామాజిక శాస్త్రంలో, తాత్విక శాస్తంలో విజయవంతమైన ప్రయోగాలు అరుదు'.

'మానవ చరిత్రకు ఆద్యంతాలు లేవు. ఇది కాలం సహితంగా నిరంతరం సాగుతూనే వుంటుంది. ఆ చరిత్ర గమనంలో మానవుడు ఒకప్పుడు పురోగతుడవుతాడు. మరొకప్పుడు తిరోగతుడవుతాడు. మానవ గమనానికి నిర్దిష్ట బిందువులేదు. కాబట్టి, పురోగమన తిరోగమనాలను స్పష్టంగా చెప్పలేం. అప్పుడు గమనం సాపేక్షమవుతుంది. అప్పటి స్థితిని బట్టి వెనుకకా? ముందుకా? అనేకాని అదికూడ నిర్దిష్టం కాదు. మానవ జీవితం ఏకముఖం కాదు. ఇది బహుముఖీనము. ఆర్థికం, సామాజికం, పారమార్థికం, ఇలా లెక్కలేనన్ని? వాటిలో ఎక్కడా సాపేక్షముగా ముందడుగు, లేదా, వెనుకడుగు నిర్ణయించడం మానవుడికి అసాధ్యం. మానవుడికి విశ్వాసం కలిగించడం అతి కష్ట కార్యం. మానవుడు ఆత్మవిశ్వాసంలో దేవతకావచ్చునని వేదం వచిస్తున్నది'.

'అర్థం అంటే ధనం. మానవుడిలో అర్థం అంటే సగం అని మాత్రమే! అర్థం, బాహిరము. భౌతికము. శ్వాసలేక మనిషి జీవించలేనట్లే అర్థం లేక మనిషి జీవించలేడు. అర్థం జీవికకు తప్పనిసరి. జీవితం శ్వాసమాత్రము కాదు. మానవుడికి మనసున్నది. మనసు అర్థపరము కాదు. ధర్మపరము. కేవలం అర్థపరులు కానివారు మహాత్ములవుతున్నారు. అయినప్పటికీ మానవ జీవితంలో ధర్మాన్ని సాధించడానికి తొలుత కావలసింది శరీరమేకదా? మానవజీవితపు మొట్టమొదటి దుర్దశ భయం. భయంలేనిదైన జ్యోతిని దర్శించడం ఎంతో మహోన్నతం, మానవీయం, దైవికం, మహోత్తమైన, ఆలోచన!'

'ధనమున్నవానికి శాంతి, శాంతి ఉన్నవానికి ధనం వుండవు. పరిపూర్ణత ప్రకృతికి లేదు కాబట్టి జీవితానికీ లేదు. సృష్టిలోనైనా, అతీతంగానైనా పరమేశ్వరుడు ఒక్కడే పరిపూర్ణుడు. అయినా మానవుడి గమనం నిలువదు. దానికి నిర్దిష్ట లక్ష్యాలు ఉండవు. అది ఉన్నది అనుకోవడం భ్రమ! జీవితమే ఒక భ్రమ కదా! పూజ్యం, అనింద్యం, అద్వేష్యం అయిన ధనమే శాంతిని, సుఖాన్ని కలిగిస్తుంది. అలా కానిది అశాంతి కారకం అవుతుంది. ఉన్నవారి ధనాన్ని లేనివారికి ఇవ్వమన్నది వేదం'.

'మానవుడికి ప్రధానమైంది కర్మ, పని. పనిలేనిది మానవుడు మనజాలడు. పని తరువాత అవసరమయినది యజ్ఞము, ప్రయత్నం. కర్మకాండ అని పేరొందిన ఒక విధి విధాన యజ్ఞం మానవులకు సౌఖ్యాలను సమకూర్చడానికి ఏర్పడినది. ఇది భగావధారాధనము. యజ్ఞానికి సాధనసంపద సమకూర్చువాడొకడు. అతడు యజమాని. యజ్ఞం జరిపించువాడొకడు. అతడు ఋత్విక్కు. యజమానికి కర్మకాండతోగాని, ఋత్విక్కునకు సాధన సామాగ్రితోకాని సంబంధములేదు. తపస్సు అటువంటిదికాదు. సంపూర్ణ స్వప్రయత్నం. దీనికి చేయువాడు, చేయించువాడు ఉండరు. స్వసంకల్పము స్వ పృత్నం. ఇచట దేహమే యజ్ఞభూమి. సంకల్పమే ఋత్విక్కు. ఇది జ్ఞానానికి మార్గము'.

'మానవుని జీవితయాత్ర అనంతం, అద్భుతం, ఆశ్చర్యకరమైనది. భగవంతుని సృష్టి సమస్తంలో మానవుడికి మాత్రమే ఆలోచన ప్రసాదించినాడు భగవంతుడు. ఆలోచన మానవుని ప్రగతికి, వినాశనానికి కారణభూతం అవుతున్నది. సత్యం అంటే నిజం చెప్పడం మాత్రమే కాదు. "సత్" అంటే ఉన్నది, "అసత్" అంటే లేనిది. ఉన్నది, లేనిది వీటిని గురించిన జ్ఞానం. సకల చరాచర ప్రపంచం "అసత్". ఉండునదికాదు. వచ్చిపోవునది. దీనికి స్థిరత్వము, శాశ్వతము లేదు. "సత్" ఉన్నది, శాస్వతమయినది. పరమాత్మ స్వరూపం. అర్థం జీవితాన్ని తెలుసుకోవడం. పరమార్థం పరాత్పరుడిని తెలుసుకోవడం. పరాత్పరుడు ఎవడు? అదియే మానవుడికి ఎన్నటికీ తెలియనిది. ప్రస్తుతం మనం విశ్వసించినవాడే ఈశ్వరుడు. ఇది విశ్వాసం మాత్రమే! మానవుడి ఆలోచనకు గోచరించని ఒక మహా పదార్థం పరమాత్మ. పరమేశ్వరుడు. పరంధాముడు. అతడే "ఋత్". కావున ఋతమే సర్వానికి కారణం. ఋతము భౌతికము కాదు. పరమాత్మ నుండే సమస్త దేవతలు పుట్టినారు'.

'నిరంతర అన్వేషణయే జీవితం. వ్యక్తి, కుటుంబ, సమాజ, దేశ, లోక జీవితములందు అన్వేషణమే గోచరించుచున్నది. అన్వేషణము లేనిదాని కొరకు కాదు, ఉన్నదానికొరకే. ప్రకృతి తనలో అనంతములైన రహస్యాలను దాచుకున్నది. వాటికొరకు అన్వేషణ సాగినది, సాగుతున్నది, సాగనున్నది. అన్వేషణమే వేదం. ఈ సమస్త చరాచర ప్రకృతికి మూలం ఏమిటి? ఏది దీనిని కాపాడుతున్నది? ఏది దీనిని అంతమొందిస్తున్నది? వీటిని కనుగొనే అన్వేషణమే వేదం. సత్యాన్ని కనుగొనేవరకు అన్వేషణ ఆగదు. సత్యం దృగ్గోచరమవడం మానవుడికి సాధ్యం కాదు. అయినా అన్వేషణ ఆగదు. అన్వేషణ అనంతం, నిరంతరం. నవీనాలను తెలుసుకోవడమే అన్వేషణం'.

'సమస్త సృష్టి, స్థితి, లయాలకు పంచభూతాలు (భూమి, నీరు, వెలుగు, వాయువు, ఆకాశం) ఆధారాలు. ప్రస్తుతకాలంలో మానవుడు పంచ భూతాలకు దుఃఖం కలిగిస్తున్నాడు. దుఃఖాన్ని అనుభవిస్తున్నాడు. నరుడిగల మానవతా లక్షణాలలో కృతజ్ఞత ప్రధానమైంది. మనకు ఉపకారము చేసినవారిని తలచుకోవడం, ప్రత్యుపకారం చేయడం కృతజ్ఞత అవుతుంది. ఉపకారిని తలచకుండడం, ప్రత్యుపకారం చేయకుండడం కృతఘ్నత. దీనికి నిష్కృతి లేదు. పంచ భూతాలు మనకు అనంతములైన ఉపకారం చేస్తున్నాయి. పంచ భూతాలకు కృతజ్ఞత తెలియచేయడం మానవుడి కనీస కర్తవ్యం'.

'పురోహితుడు అనగా పూర్వము ఉండినవాడు. సృష్టికి పూర్వము ఉన్నవాడు. పరాత్పరుడు, ఈశ్వరుడు. పురోహితుడు యజ్ఞానికి అవసరమైన పదార్థాలను సేకరించేవాడు. పురోహితుడు సామాజిక శాస్త్రజ్ఞుడు. ఒక వ్యక్తి, ఒక సంఘపు సుఖ, దుఃఖాలను వినేవాడు. సుఖ జీవనానికి అవసరమైన సలహాలు ఇచ్చేవాడు. అతడు ఆచార్యుడిలాగా, వైద్యుడిలాగా, మిత్రుడిలాగా ఉపకరించేవాడు'.

'వేదంలో వైద్యాన్ని, విద్యను స్తుతించడం జరిగింది. ఇది క్రమ పరిణామం. సక్రమ ప్రగతి. అభ్యుదయం. అశ్వినులు కవలలు, సూర్యుడి పుత్రులు, ఆరోగ్యదేవతలు, వైద్యులు, వీరు జంట దేవతలు. ఒంటరిగా వుండరు. వైద్యం శారీరకం, మానసికం కలిసి జరుగవలసి ఉన్నది. ఈ సత్యాన్ని వేదం వెల్లడించింది. ఆధునిక వైద్యం ఇంకా ఎదగాల్సి ఉన్నది. అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయాలను మన వైద్యం గుర్తించాల్సి ఉన్నది. అస్తి పంజరం కాదు, మనసున్న మనిషిని అధ్యయనం చేయాల్సి ఉన్నది. గుండె జబ్బులకు, కామెర్లకు, పండు రోగానికి వేదంలో సూర్యరశ్మిచికిత్స చెప్పడం జరిగింది. విద్య నదిలాగా వుండాలని వేదం వచిస్తున్నది. అది ఎంతో సత్యం! విద్య ఒకచోట ఉండరాదు. ప్రవహించాలి. విద్య నదిలాగా సమస్త జనులకు ఉపయోగపడాలి. నది సాగరంలో కలుస్తుందనే జ్ఞానం ప్రసాదించేదే విద్య అవుతుంది. లోకంలో వున్న సమస్త ప్రజ్ఞలను ప్రకాశింప చేసేది విద్య. సరస్వతి'.

'ఇంద్రుడు మేఘాలను కొట్టినవాడిగా, జలాలను చీల్చినవాడిగా, కొండల నుండి నదులను బహిర్గతం చేసినవాడిగా చెప్పడం జరిగింది. ఇంద్రుడు కొట్టిన మబ్బులు కురిశాయి. నదులయ్యావి. నదులు సముద్రాలకు సాగాయి. అది అద్భుతం. ఆశ్చర్యకరమైన జలముక్తి మహాత్కార్యాన్ని వివరించేది. కొండలందు దాగిన నదుల అడ్డంకులను తొలగించి ప్రవహింపచేయు మహాత్కార్యాన్ని వర్ణిస్తున్నది. ఇది ఆధునిక యుగంలో నదులకు ఆనకట్టలు కట్టే యంత్రాల అట్టహాస కార్యాన్ని తలపిస్తున్నది. ఆధునిక కాలంలో కట్టడం అయితే, ఆ నాటి కాలంలో అది విప్పడమనే గొప్ప ఇంజనీరింగ్ ప్రక్రియ. ఇంజనీర్లే దీనిని వివరించగలరు'.

'స్వరాజ్యాన్నిగురించిన ఆలోచన ఆనాడే వచ్చింది. వేదాలది అంతటి ప్రగతిశీల ఆలోచనా విధానం. ఇంద్రుడు స్వరాజ్యంలో ప్రభుత్వం ఎలా వుండాలో వివరించినాడు. ప్రభుత్వం తనను, దేశాన్ని రక్షించే సామర్థ్యం కలిగి వుండాలి. ప్రజలకు శాంతి సౌభాగ్యం కలిగించే ఉపాయాలు కలిగి, వాటిని అమలు పరచాలి. ప్రజలకు సంతృప్తికరమైన జీవితాన్ని సాధ్యమయ్యే ప్రయత్నాలు చేయాలి. ఈ లక్షణాలు కలదే స్వరాజ్యమవుతుంది. భూమి, నీరు, వాయువు, శిలలు అన్నింటిలోను ఔషధాలు వున్నాయని వేదం చెప్తున్నది. మనువు ఔషధాలు నరులకు ఇచ్చినాడు. రుద్రుడు నీతిబోధచేయు వరకు అవి ఫలించలేదు. భూమియే స్వర్గం. భూమియే అంతరిక్షం. భూమియే తల్లి. భూమియే తండ్రి. భూమియే పుత్రుడు. భూమియే సర్వ దేవతలు. భూమియే అయిదు విధాల జనులు. భూమియే పుట్టుక. భూమియే పుట్టిన వస్తువు. భూమియే సర్వం. భూమిని మించినది లేదు'.

'ఒక పని నిర్విఘ్నంగా జరగడానికి అనేకుల అండదండలు, ఆశీస్సులు అవసరమవుతాయి. ప్రకృతి శక్తులు, దేవతలు, మానవులు, పరిసరాలు ఇన్ని సహకరించాల్సి ఉన్నది. అందరిని ప్రార్థించవలసి ఉన్నది. మానవుని మనుగడకు సమాజపు నిలకడకు సదాశయాలే ఆధారాలు. వేదంలో ఉన్నతమైన సదాశయాలున్నాయి. 'దేవతలది ప్రత్యేక వర్గము, వర్ణము, జన్మము కావు. అగ్ని, వాయువు, ఇంద్రుడు, లాంటివారు మానవజాతికి చేసిన ఉపకారము వల్లే వారు దేవతలయ్యారు. ఋషులు జన్మవలనే కాకుండా సాధన ద్వారా ఋషులు అయినారు. ద్రష్టలు అయినారు. స్మర్తలు అయినారు. పటు పరిశ్రమ, మేధాసంపత్తి, నిరంతర పరిశ్రమతో దేవతలలో చేరవచ్చునని ఋషులు నిరూపించినారు. పాండిత్యానికి, శాస్త్ర పరిజ్ఞానానికి, జన్మతో నిమిత్తం లేదని నిరూపించినారు. ప్రతిభకు ఏనాడు కూడా ఆటంకం కలగలేదు. కలగదు కూడా'.

**(డాక్టర్ దాశరథి రంగాచార్య వేద సంహితల ఆధారంగా)**

# ఆధ్యాత్మిక, నీతి కథలు యోగక్షేమం వహామ్యహం..

"కావ్యాలు ఒక అంశాన్ని పాఠకులకు చెప్పే విధానాన్ని బట్టి ప్రభు సమ్మితం ,మిత్ర సమ్మితం, కాంతా సమ్మితాలుగా చెప్పవచ్చు. ఆర్.సి కృష్ణ స్వామి రాజుగారు రాసిన "యోగక్షేమం వహామ్యహం" (ఆధ్యాత్మిక కథలు) మిత్ర సమ్మితాలే .ఎందుకంటే ఆధ్యాత్మిక విషయాలను కథల రూపంలో, అందమైన భాషను ఉపయోగించి, నీతిని జోడించి చెప్పడం అంటే చాలా కష్టమైన పని. సామాన్యులకు సైతం అర్థమయ్యేలా రాయడం మరెంతో కష్టం. అలాంటిది కథలకే కథల గురువైన ఆర్ సి కృష్ణ స్వామి రాజుగారు సులభ సాధ్యం చేశారు. వీరు రాసిన ఆధ్యాత్మిక కథలన్నీ కూడా ప్రముఖ దిన వార, మాస పత్రికల్లో ప్రచురితమైనవే .ఆ కోవలోకే చెందిన ఆధ్యాత్మిక కథల పుస్తకమే యోగక్షేమం "వహామ్యహం". ఇది ఆర్ సి కె రాజు గారి కలం నుండి జారి వారిన మలి ఆధ్యాత్మిక కథల పుస్తకం".

మొదటి కథ "గజ స్నానం"లో మనిషి లేనిపోని ఆలోచనలతో ,తన మనసుని చెడగొట్టుకొని, తన జీవితాన్ని అల్లకలోలం చేసుకుంటాడు గజస్నానం లాగా ,అనే చక్కటి సందేశాన్ని పాఠకులకు అందించే ప్రయత్నం చేశారు. సత్సంగం చేస్తున్న సేపు "మంచే చేయాలి మంచిగానే ఉండాలి అనుకుంటారు" తీరా అనవసరమైన విషయాల పైన ఆసక్తిని ప్రదర్శిస్తారు అనే సంఘనీతిని చక్కగా ఆవిష్కరించారు ఆర్ సి కె రాజుగారు.




ఉమ్మడి కుటుంబాలు కనుమరుగవుతున్న నేటి కాలంలో అత్తమామలను తల్లిదండ్రుల మాదిరిగా చూడాలనే సమాజ హితాన్ని" పాలమీగడ కథలో తెలుసుకుంటాం. అత్తమామలు కష్టపడి తన కొడుకును ప్రయోజకుడుగా చేయడం వల్లే భర్తగా దొరికాడనే విషయాన్ని భార్యకు తెలియచెప్పే విధానం బాగుంది. ఈ కథ ప్రతి ఇంటిలో జరుగుతున్న వాస్తవానికి దగ్గరలో ఉందనిపిస్తుంది తప్పనిసరిగా ఈ కథను చదివిన పాఠకుల్లో మార్పు వస్తుంది.

చిన్నచిన్న పొరపాట్లు మానవ సహజం వాటన్నింటినీ భూతద్దంలో పెట్టి చూస్తే జీవితం కొనసాగదు ."సర్దుకుంటేనే సమాజంలో ఇమిడిపోతాం .లేకపోతే ఆశాభంగం తప్పదనే" హెచ్చరిక" కొత్త ఊరు "కథలో నేర్చుకుంటాం. కవిగారు కథను నడిపించిన విధానం ఆద్యంతం ఆసక్తిగా ఉంది.అనవసర ఆలోచనలు మనిషిని బలహీనం చేస్తాయి . వద్దన్నా ఆలోచనలు రాకుండా ఉండవు. ఇది మనసుకున్న సహజ లక్షణం. వాటి పరిమితులను గుర్తించాలి." చెప్పుల్ని ఇంటి బయటే వదిలినట్లు "చెడు ఆలోచనలు కూడా వదిలేయాలి అని చక్కటి మాట" సమస్య పరిష్కారం" కథలో ఇందులో ఉంది.మనిషి ఈ నేల మీదికి రాకముందు, ఇక్కడినుండి వెళ్ళిపోయాక అంతా సమానమే. ఎవరు గొప్ప కాదు, తక్కువ కాదు అనే మంచి సందేశం "చదరంగం" కథలో ఆవిష్కరించాడు రచయిత గారు.

మరో కథ "గురుదేవోభవ "లో గురువు ఉపాధ్యాయుల మధ్య తేడా తెలియజెప్పారు. "గురువు చెప్పే తత్వాన్ని అవగాహన చేసుకుని ,మనలోని జ్ఞాన కాంతిని ప్రకాశం చేసుకోవాలి" అనే వాస్తవాన్ని వివరించే ప్రయత్నం చేశారు ఆర్ సి కె రాజుగారు

ఇలా రచయిత రాసిన మొత్తం 52కథలలో దేనికదే ప్రత్యేకతను కలిగి ఉంది. ఈ కథలలో ఒక వైపు ఆధ్యాత్మికం బోధిస్తూనే, చక్కటి సందేశాన్ని అందించే ప్రయత్నం చేశారు కృష్ణస్వామి రాజు గారు. ప్రతి కథలో తప్పనిసరిగా ఒక నీతిని అందించడం రచయిత గారి ప్రత్యేక శైలిగా చెప్పవచ్చు. ఈ పుస్తకంలోని మొత్తం పేజీల సంఖ్య 111 . ముఖ చిత్రం ఆకర్షణీయంగా ఉంది. పుస్తకం వెల 160 రూపాయలు. ప్రతి కథలో శీర్షికకు పైన చక్కటి చిత్రాన్ని అందించారు. చిత్రాన్ని చూడగానే చదవాలని ఆసక్తి పాటకంలో పెంపొందుతుంది ఇలాంటి ఆధ్యాత్మిక నీతి కథలు మరెన్నో రచయిత కలం నుండి జాలు వారాలని కోరుకుంటూ, రచయితకు శుభాకాంక్షలు అభినందనలు తెలుపుదాం.

**పుస్తక ప్రతులకు:** ఆర్ సి కృష్ణస్వామి రాజు, 22బి 4బి71 బ్యాంక్ ఎంప్లాయి కాలనీ, మంగళం రోడ్డు ,తిరుపతి, 517507, చరవాణి: 9393662821

**పుస్తక సమీక్షకులు:** యాడవరం చంద్రకాంత్ గౌడ్, 9441762105

# తెలుగు కథా సాహిత్యంలో కొత్త ఒరవడులు అల్లం రచనలు



సాధారణంగా కథల పాఠకులు కొత్తదనం కోరుకుంటారు. ఇది గ్రహించే కథా రచయితలు పాఠకులను తమ కథల పట్ల ఆసక్తిని పెంపొందించే కథా వస్తువులను ఎంచుకునే ప్రయత్నం చెయ్యడం కద్దు. దీనిని పూర్తిగా అర్థం చేసుకుని తెలుగు కథా రచనలో కొత్త ఒరవడిని సృష్టించా డు అల్లం శేషగిరిరావు. ఎన్నో కథలు వచ్చాయి కాని తెలుగులో వేట గురించి కథలు అల్లం శేషగిరిరావు రాసేవరకూ రానేలేదని చెప్పవచ్చు. అడవిలోని క్రూర మృగాల ప్రాకృతిక ధర్మాలను కథా వస్తువుగా తీసుకున్నా , మానవ మానసిక స్థితిని నిగూఢంగా సూచించడమే ఆయన రచనా లక్ష్యంగా ప్రస్ఫుటం అవుతుంది. మామూలుగా కాక, అయన కథలను విశ్లేషణా పరంగా ఆలోచనకు భూమిక చేశాడు. అల్లం శేషగిరిరావు (డిసెంబర్ 9, 1934 – జనవరి 3, 2000) ప్రముఖ తెలుగు కథా రచయిత. 1934, డిసెంబర్ 9 న ఒడిశా (నాటి ఒడిషా) లోని గంజాం జిల్లాలో జన్మించాడు. శేషగిరి రావు కథలు తమాషాకు రాసిన కథలు కావు. జీవితం గురించి రచయిత తీవ్ర ఆలోచన, లోతుగా పరిశీలన, జీవితంలో అన్యాయాల గురించి ఆందోళన, వేటకథల నేపథ్యంగా అర్థం చేసుకోవచ్చు.

వేటాడడం, అడవి మృగాల స్వభావం, సహజ లక్షణం. ప్రాకృతిక ధర్మం కూడా. సంస్కార వంతుడైన మనిషి మృగంలా మారి బలహీనుణ్ని పీక్కుతినే అరాచ కత్వం, బడుగుల మూలుగులను పీల్చేసే బలాధిక్యతల గురించి నిక్కచ్చిగా, నిజాయతీగా మాట్లాడే కథలు తెలుగులో తక్కువ కనిపిస్తాయి. అలాంటి అరుదైన కథలను పాఠకులకు అందించి, ఆలోచింప చేసిన రచయిత అల్లం శేషగిరిరావు. ఆయన తెలుగు హెమింగ్వే గా లబ్ధ ప్రతిష్టులు. తరాలు మారినా, కాలంలో మార్పు వచ్చినా, అలనాటి నుండి సామాజిక పరిస్థితులలో ఆశించిన మార్పు రానేలేదు. బలవంతుడు, బలహీనునిపై, నిస్సహాయతలపై ఆధిపత్యం కొనసాగుతూనే ఉంది. నాగరిక ముసుగులో దాగిన ఈ అమానవీయతను ఉన్నది ఉన్న ట్టుగా చూపెడతాయి శేషగిరిరావు కథలు. ఇవి మనిషిలోని జంతు ప్రవృత్తిని తేటతెల్లం చేస్తాయి. ఎవరూ చూడని కొత్తకోణాన్ని దర్శించేందుకు వీలు కల్పిస్తాయి. కొత్త ఎత్తుగడ, ఉత్కంఠ, ఆసక్తికర ముగింపూ, అటవీ సంబంధ విశేషాలూ, జంతువుల సహజ ప్రవర్తనాస్థితి.. ఇలాంటి అంశాలతో ఈ కథలు పాఠకులను ఆగకుండా చదివింప జేస్తాయి.

రైల్వేలో గుమాస్తాగా పని చేసిన అల్లం శేషగిరిరావు సమాజాన్ని నిశితంగా పరిశీలించిన తీరు అమోఘం, అద్వితీయం, అస మానం. మనుషుల ధోరణు ల్లోని మానవీయ, అమానవీయ కోణాలను, అంతః సంఘర్షణలను అయన అర్థం చేసుకని కథా వస్తువులుగా మలచు కున్నాడు. తాను చేసుకున్న అవగాహనకు తనదైన భాష, శిల్పాలను జోడించి పాఠకుల హృదయాలను అంది పుచ్చుకునే అద్భుత కథలు రాశాడు. 1980లో 'మంచి ముత్యాలు' పేరిట పుస్తక రూపంలో వచ్చాయి. మరిన్ని కథలను కలుపుకుని 'అరణ్య ఘోష'గా వెలువడ్డాయి. ఇటీవల కథా స్రవంతి (అరసం) వారు 'అల్లం శేషగిరిరావు కథలు' పేరిట ఎంపిక చేసిన వాటిని ప్రచురించారు. శేషగిరిరావు రాసినవి తక్కువే. వాటిలోనూ కొన్ని సుదీర్ఘంగా సాగుతాయి. అయితే.. విషయ ప్రాధాన్యం, వైవిధ్యం మూలంగా ఆ నిడివి పాఠకులను అంతగా బాధించదు. 'మృగ తృష్ణ, వఱడు, ది డెత్ ఆఫ్ ఎ మేనిటర్, జాతి కుక్క, పులి చెరువులో పిట్టల వేట, అశ్వమేధం, నరమేధం, చీకటి' తదితరాలు శేషగిరిరావు కథల్లో చెప్పుకోదగినవి. మనిషికి ప్రతిబింబాలు 'వఱడు' కథ 'దర్పణ్ సీరిస్'లో భాగంగా దూరదర్శన్‌లో సింగిల్ ఎపిసోడ్‌గా ప్రసారమైంది. వఱడు లాంటి మనుషులు మన సమా జంలో ఉన్నారని హెచ్చరించిన ఈ కథ, నాటకం గానూ విశేష ఆదరణ పొందింది. వఱడంటే 'ముసలి నక్క' అని నిఘంటు అర్థం. ముసలి నక్కలు వాటంతటవి వేటాడి తినలేవు కదా. దాంతో పగలంతా ఇతర జంతువుల ఉనికిని కనిపెట్టి, రాత్రిపూట పులిని వాటిమీదకి ఉసిగొల్పి చంపిస్తాయి. పులి తినగా మిగిలిన మాంసంతో కడుపు నింపు కుంటాయి. ఈ కథలో మనిషిలో దాగుండే జంతు స్వాభావిక క్రౌర్యాన్ని చూపించాడు. అందుకే ఈ కథకు 'ది డెత్ ఆఫ్ ఎ మేనిటర్'గా పేరు పెట్టాడు. 'మృగ తృష్ణ' కథలో కనిపించేది దుప్పి వేట కాదు. అది అక్షరాలా బలహీనుడి మీద బలవంతుడి వేట మాత్రమే. ఒకరిది విలాసం కొరకు వేట. మరొకరిది జీవిక కోసం పోరుబాట. పులులను దర్జాగా వేటాడి, వాటి చర్మాలను కోటగోడలకి వేలాడ దీసుకునే జమిందారీలను ఏ చట్టాలూ ఏమీ చేయలేవు. చర్యలు తీసుకోనూ లేవు. పిట్టలను కొట్టి బతికే బడుగు జీవులకే అన్ని శిక్షలూ అమలవు తుంటాయి. కన్నీటిగాథ 'చీకటి', ఆరిపోయిన చైతన్యాగ్ని కణాన్ని రాజేస్తుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

(మిగతా వచ్చేవారం)

## తుఫాను ప్రభావిత ప్రాంతాలలో టొయోటా కిర్లోస్కర్ మోటార్ సేవలు

తమ కస్టమర్-సెంట్రిక్ విధానానికి అనుగుణంగా, టొయోటా కిర్లోస్కర్ మోటర్ ( చెన్నై మరియు ఆంధ్రప్రదేశ్లోని తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో (నెల్లూరు, తిరుపతి, ఒంగోలు, విజయవాడ, రాజమండ్ర, కాకినాడ గుంటూరు) ప్రభావితమైన వినియోగదారుల కోసం ప్రత్యేక సహాయక చర్యలను ప్రారంభించింది.
టొయోటా కిర్లోస్కర్ మోటర్దాని డీలర్ భాగస్వాములతో కలిసి ప్రత్యేక అత్యవసర హెల్ప్లైన్ నంబర్లను ఏర్పాటు చేసింది మరియు అవసరమైన కస్టమర్లకు తక్షణ సహాయం అందించడానికి ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేసింది. అదనంగా, టొయోటా సుషో ఇన్సూరెన్స్ బ్రోకర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వరద పరిస్థితులలో తమ వాహన నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు మార్గదర్శకాలకు సంబంధించి వినియోగదారులకు అవసరమైన సమాచారాన్ని తెలియజేయడంలో చురుకుగా పాల్గొంటోంది. ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఉన్నప్పటికీ, టొయోటా కిర్లోస్కర్ మోటర్ తన డీలర్ అవుట్లెట్ల ద్వారా కస్టమర్లకు చురుగ్గా సేవలందించడం ద్వారా కార్యాచరణ సామర్థ్యాన్ని కొనసాగించడంలో స్థిరత్వంను ప్రదర్శిస్తుంది. టొయోటా కిర్లోస్కర్ మోటర్ యొక్క డీలర్ అవుట్లెట్లు కస్టమర్ల వాహన పికప్ మరియు డ్రాప్ సేవలను వారి ఇంటి వద్దకే సులభతరం చేయడం ద్వారా అదనపు మైలు వెళుతున్నాయి.



వాహనాల ధరలను పెంచుతున్న

## టాటా మోటార్స్




ముంబయి : భారతదేశపు అతిపెద్ద వాణిజ్య వాహన తయారీ సంస్థ అయిన టాటా మోటార్స్, 2024 జనవరి 1 నుంచి అమలులోకి వచ్చే వాణిజ్య వాహనాల ధరలను 3% వరకు పెంచనున్నట్లు ప్రకటించింది. ధరల పెరుగుదల గత ఇన్పుట్ ఖర్చుల యొక్క అవశేష ప్రభావాన్ని భర్తీ చేయడానికి మరియు వాణిజ్య వాహనాల మొత్తం శ్రేణికి వర్తిస్తుంది.
టాటా మోటార్స్ భారతదేశం, యుకె, ఇటలీ మరియు దక్షిణ కొరియాలో ఉన్న అత్యాధునిక డిజైన్ మరియు ఆర్డి కేంద్రాల ద్వారా జెన్నెక్స్ కస్టమర్ల ఊహలను ఆకర్షించే కొత్త ఉత్పత్తులను తీసుకురావడానికి ప్రయత్నిస్తోంది. మొబిలిటీ యొక్క భవిష్యత్తును అందించే ఇంజనీరింగ్ మరియు సాంకేతికతతో కూడిన ఆటోమోటివ్ సొల్యూషన్లపై దృష్టి సారించడం ద్వారా, కంపెనీ యొక్క ఆవిష్కరణ ప్రయత్నాలు స్థిరమైన మరియు అభివృద్ధి చెందుతున్న మార్కెట్ మరియు కస్టమర్ ఆకాంక్షలకు సరిపోయే మార్గదర్శక సాంకేతికతలను అభివృద్ధి చేయడంపై దృష్టి సారించాయి. కంపెనీ భారతదేశం యొక్క ఎలక్ట్రిక్ వెహికల్ పరివర్తనకు మార్గదర్శకత్వం వహిస్తోంది మరియు అనుకూలమైన ఉత్పత్తి వ్యూహాన్ని అభివృద్ధి చేయడం, గ్రూప్ కంపెనీల మధ్య సినర్జీని పెంచడం మరియు పాలసీ ఫ్రేమ్వర్క్ల అభివృద్ధి చేయడంలో భారత ప్రభుత్వంతో అనుసంధానం చేయడంలో చురుకైన పాత్రను పోషించడం ద్వారా స్థిరమైన మొబిలిటీ పరిష్కారాల వైపు మళ్లిస్తోంది.

### ఆహారపు అలవాట్లపై అవగాహన పెంపొందించాలి



జీవన విధానంలో చోటు చేసుకున్న మార్పుల కారణంగా అనారోగ్యాల బారిన పడుతున్న ప్రజలను రక్షించేందుకు వైద్యులు ఆహారపు అలవాట్లపై ప్రతి ఒక్కరికి అవగాహన పెంపొందించాలని ఫిజీషియన్ అసోసియేషన్ ఫర్ న్యూట్రిషన్ (పిఏఎన్) సదస్సులో డాక్టర్లు సూచించారు. బంజారా హిల్స్ లోని ఓ హోటల్లో పాన్ ఆధ్వర్యంలో వైద్యులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాన్ మెడికల్ డైరెక్టర్ రెజీనా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బద్రీనాథ్ హాజరై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు ప్రత్యూష నేరెళ్ల, రాజేందర్, అమ్రిత, ప్రాప్తి లతో కలిసి మాట్లాడారు. ఆహార అలవాట్లు, కనీస శారీరక శ్రమ లేకపోవడంతో యుక్త వయసులోనే బిపి, షుగర్ లాంటి వ్యాధుల బారిన పడుతున్నారని అన్నారు. గ్రామీణ పట్టణ ప్రాంతాలను తేడా లేకుండా ప్రతి ఒక్కరు తీవ్రమైన ఒత్తిడికి గురి కావడం, జంక్ ఫుడ్ సేవించడం, వ్యాయామం లేకపోవడం పెను ప్రమాదానికి దారితీస్తుందని అన్నారు. ఈ నేపథ్యంలో వ్యాధుల బారిన పడకముందే ప్రజలను అప్రమత్తం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. వివిధ సామాజిక మాధ్యమాలలో ఎలాంటి శాస్త్రీయ పరిశోధన జరపకుండా ఆహారపు అలవాట్లపై వీడియోలు చేస్తున్నడంతో తికమక కు గురవుతున్నారని అన్నారు. ఈ నేపథ్యంలోనే పూర్తిస్థాయి శాస్త్రీయ పరిశోధన జరిపి ఆహారపు అలవాట్లపై అంతర్జాతీయ స్థాయిలో అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగానే ప్రాథమికంగా వైద్యులకు ప్రత్యేక శిక్షణ నిర్వహించామని తెలిపారు. సుమారు మూడు గంటల పాటు సాగిన ఈ కార్యక్రమంలో 150 మందికి పైగా వైద్యులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ వీసా జారీ చేసే దిశగా

## కువైట్ యోచన

● ఆర్టికల్ 22 కింద ఫ్యామిలీ వీసా జారీకి కువైట్ యోచన ● నిబంధనల రూపకల్పనకు త్వరలో కమిటీ ఏర్పాటు ● కొన్ని వృత్తుల వారికే వీసాను పరిమితం చేసే అవకాశం



కువైట్ సిటీ : ఆర్టికల్ 22 కింద ఫ్యామిలీ వీసాలు జారీ చేసేందుకు కువైట్ ఇంటీరియర్ మంత్రిత్వశాఖ యోచిస్తోంది. వచ్చే ఏడాది నుంచి ఈ వీసాల జారీ ప్రారంభం కావచ్చని సంబంధిత వర్గాలు సూచించాయి. అయితే, ఇది కొన్ని కేటగరీల వారికే పరిమితం చేయాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. డాక్టర్లు, యూనివర్సిటీ, కళాశాలల ప్రొఫెసర్లు, కౌన్సెలర్లు, ఇతర వృత్తి నిపుణులకు ఈ వీసా జారీ చేసే అవకాశం ఉంది. ఈ వీసా నిబంధనల రూపకల్పనకు ఒక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. భవిష్యత్తులో దేశ జనాభాలో రాబోయే మార్పులను పరిగణనలోకి తీసుకుంటూ ఏయే వృత్తి నిపుణులకు వీసాలు జారీ చేయాల్లో కమిటీ నిర్ణయం తీసుకోనున్నది. ఇది ఇలా ఉండగా, వీసా నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యల కోసం గల్ఫ్ దేశాల కూటమి జీసీసీ ఉమ్మడి విధానాన్ని అమలు చేసేందుకు నిర్ణయించింది. ఇందులో భాగంగా వీసా కాల పరిమితి దాటినా దేశంలో ఉంటున్న వారిపై రోజుకు 100 కువైట్ దినార్ల జరిమానా విధించేందుకు అక్కడి ప్రభుత్వం నిర్ణయించింది.

## ఎర్త్ ఇన్ ఫోకస్ ఫోటోగ్రఫీ పోటీ విజేతలు




డిసెంబర్ : అద్భుతమైన విజయంతో, సోనీ బీబీసీ ఎర్త్ తన 'ఎర్త్ ఇన్ ఫోకస్' మూడవ ఎడిషన్ను ముగించింది. ఇది ఫోటో గ్రఫీ కళ ద్వారా భారతదేశ సారాంశాన్ని పొందుపరచడానికి అన్ని నైపుణ్య స్థాయిల వారు పాల్గొనే ఒక నెల రోజుల ఫోటోగ్రఫీ పోటీ. వన్యప్రాణులు, పోర్ట్రెయిట్లు, స్మారక చిహ్నాలు వంటి ఉపవిభాగాలను కలిగి ఉన్న ఈ పోటీ, పబ్లిక్ ఓటింగ్ దశలో 124,490 ఓట్లతో అద్భుతమైన 6030 ఎంట్రీలను అందుకుంది.
కేటగిరీ విజేతలు, టాప్ 15 ఫోటోగ్రాఫర్లను ప్రముఖ ఫోటోగ్రాఫర్, ఇండస్ట్రీ ప్రముఖులు సుప్రీత్ సాహా ఎంపిక చేశారు. మాన్యుమెంట్స్, పోర్ట్రెయిట్స్, వైల్డ్ లైఫ్ విభాగాల్లో వరుసగా అరుణ్ కుమార్, లుక్మాన్ జీరక్, ధ్రువ్ శి ల్పి విజేతలుగా నిలిచారు. వీళ్లు సోనీ బీబీసీ ఎర్త్ ఛానెల్లో ఫీచర్ కాబడే అవకాశాన్ని పొందడంతో పాటు సోనీ జెడ్వి -1ఎఫ్ వ్లోగ్ కెమెరాతో సత్కరించబడుతారు. ఇంకా, మూడు కేటగిరీలలోని టాప్ 15 ఫోటోగ్రాఫర్లు సుప్రీత్ సాహా మార్గదర్శకత్వంలో తమ నైపుణ్యాలను మెరుగుపరచుకోడానికి ప్రత్యేక అవకాశాన్ని అందుకుంటారు.
ఫీనిక్స్ మార్కెట్ సిటీ, కుర్లా ఆన్-గ్రౌండ్ భాగస్వామిగా అనేక ఆకర్షణీయమైన కార్యకలాపాలతో ఈ పోటీ గురించి ప్రచారం చేయబడింది. ఇది పోటీకి శక్తివంతమైన కోణాన్ని జోడించి, కమ్యూనిటీ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించింది. రంగులు వేసేందుకు డూడుల్ వాల్లు ఏర్పాటు చేయబడ్డాయి. డూడుల్ నైపుణ్యాలను పెంచుకోడానికి చి ట్కాలు, ట్రిక్లపై రోజంతా వర్క్ షాప్ల ఏర్పాటు చేయబడ్డాయి, ఈ ఈవెంట్ అన్ని వయసుల వారి నుండి మం చి ఆదరణ పొందింది.
అలాగే, ఫోటోగ్రఫీపై వర్క్ షాప్ నిర్వహించబడింది. ఇక్కడ ఫోటోగ్రఫీ, లైట్ల ప్రాథమిక అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఎర్త్ ఇన్ ఫోకస్ విజయం దృశ్య కథనాల ద్వారా సానుకూల మార్పును ప్రేరేపించే లక్ష్యంతో ప్రపంచవ్యాప్తంగా గొ ప్ప కథకుడిగా సోనీ బీబీసీ ఎర్త్ నిబద్ధతను నొక్కి చెబుతుంది.
ఎంట్రీ సమర్పణ నుండి న్యాయనిర్ణేత సమీక్ష వరకు, పోటీ కాలక్రమం డిసెంబర్ మొదటి వారంలో అంతా ఆసక్తి గా ఎదురుచూస్తున్న విజేతల ప్రకటనతో ముగిసింది.

## భారీగా తగ్గిన బంగారం ధర

● బంగారం ధర రూ. 550 తగ్గుదల ● పసిడి బాటలోనే వెండి కూడా ● తెలుగు రాష్ట్రాల్లో ఎలా ఉన్నాయంటే?



హైదరాబాద్ : గత రెండు రోజులుగా పెరుగుతూ వచ్చిన బంగారం ధరలు ఆదివారం భారీగా తగ్గాయి. ఆదివారం దేశ వ్యాప్తంగా అన్ని ప్రధాన నగరాల్లో ఉదయం 6 గంటలకు బంగారం ధరలు గమనిస్తే చాలా చోట్ల తగ్గిపోయాయి. ఆదివారం 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 57150గా ఉండగా, 24 క్యారెట్ల బంగారం ధర రూ. 62350కి చేరింది. అంటే శనివారంతో పోల్చితే ఆదివారం 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 550 మేర తగ్గింది. అలాగే, 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 600 మేర తగ్గింది. మరొక వైపు వెండి ధర కూడా కిలోకు రూ. 120 మేర తగ్గింది. ఇక ద్రవ్యోల్బణంతో పాటు సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ గోల్డ్ రిజర్వ్ వడ్డీ రేట్లలో వచ్చిన హెచ్చు తగ్గులు బంగారం ధరపై ప్రభావం చూపినట్లు విదితం అవుతోంది. మరి ఆదివారం దేశంలోని పలు ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరల వివరాలు... 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర దేశ రాజధాని న్యూఢిల్లీలో రూ. 57300, దేశ ఆర్థిక రాజధాని ముంబయి, కోల్కతా, బెంగళూరులో రూ. 57150, చెన్నైలో రూ. 57650గా ఉంది. కాగా, 24 క్యారెట్ల గోల్డ్ రేట్ న్యూఢిల్లీలో రూ. 62500, ముంబయి, కోల్కతా, బెంగళూరులో రూ. 62350, చెన్నైలో రూ. 62890గా కొనసాగుతోంది.
తెలుగు రాష్ట్రాల్లో బంగారం ధరల వివరాలు. హైదరాబాద్, నిజామాబాద్, విజయవాడ, విశాఖపట్నంలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 57150 కాగా, 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 62350 వద్ద కొనసాగుతోంది.
**వెండి ధరలు :** మరొక వైపు వెండి ధరలు కూడా తగ్గుముఖం పట్టాయి. దేశవ్యాప్తంగా దాదాపు అన్ని ప్రధాన నగరాల్లో కిలో వెండి ధర రూ. 76000గా నమోదైంది. ఆదివారం ఢిల్లీ, ముంబయి, కోల్కతాల్లో కిలో వెండి ధర రూ. 76000గా నమోదైంది. ఇక చెన్నైలో కిలో వెండి ధర రూ. 78000కు చేరింది. హైదరాబాద్తో పాటు, మదురై, విశాఖ, విజయవాడలోనూ కిలో వెండి ధర అత్యధికంగా రూ. 78000 పలుకుతోంది.

## రూ. 6299లో ఇన్ఫినిష్ అత్యంత స్టైలిష్ స్మార్ట్ఫోన్



వినియోగదారులకు అద్భుతమైన పనితీరు మరియు సొగసును అందించడానికి రూపొందించబడింది, ఇన్ఫినిష్ స్మార్ట్ 8 హెచ్డి స్మార్ట్ సిరీస్లోని మునుపటి విడుదలల కంటే గణనీయమైన అప్గ్రేడ్లను కలిగి ఉంది. 90 హెచ్జెడ్ రిఫ్రెష్ రేట్, 8ఎంపి సెల్ఫీ కెమెరా మరియు సైడ్-మౌంటెడ్ ఫింగర్ ప్రింట్ సెన్సార్ మరియు డైనమిక్ ఎక్స్పాండబుల్ నాచ్ ఫీచర్తో, స్మార్ట్ 8 హెచ్డిసరసమైన స్మార్ట్ఫోన్ల అవకాశాలను పునర్నిర్వచిస్తుంది. సబ్-10కెస్మార్ట్ఫోన్ సెగ్మెంట్ ప్రస్తుతం వినూత్నమైన ఆఫర్ల కొరతతో వర్గీకరించబడింది. స్మార్ట్ 8 సిరీస్ పరిచయంతో, మా లక్ష్యం ఈ విభాగాన్ని పునర్నిర్వచించడం మరియు ప్రీమియం డిజైన్ మరియు వినూత్న లక్షణాల పరంగా చాలా అవసరమైన రిఫ్రెష్ను అందించడం. స్మార్ట్ 8 హెచ్డి, దాని కలప ఆకృతి డిజైన్ మరియు ఐకానిక్ కెమెరా మాడ్యూల్తో, స్టైలిష్ స్మార్ట్ఫోన్ను కోరుకునే వినియోగదారులకు ప్రాధాన్య ఎంపికగా సిద్ధంగా ఉంది. వినూత్న మ్యాజిక్ రింగ్ ఫంక్షన్ వినియోగదారు పరస్పర చర్యలను మెరుగుపరుస్తుంది మరియు వాడుకలో సౌలభ్యాన్ని మెరుగుపరుస్తుంది. దాని డిజైన్ మరియు సాఫ్ట్వేర్ సామర్థ్యాలకు మించి, స్మార్ట్ఫోన్ 6.6 హెచ్డి+ పంచ్-హోల్ 90 డిస్ప్లే, సైడ్-మౌంటెడ్ ఫింగర్ప్రింట్ సెన్సార్ మరియు ఫ్లాష్తో కూడిన 8ఎంపి సెల్ఫీ కెమెరాతో సహా అనేక ఫస్ట్-ఇన్-సెగ్మెంట్ ఫీచర్లను కలిగి ఉంది. స్మార్ట్ఫోన్ల రంగంలో సాధించగలిగే వాటి సరిహద్దులను స్థిరంగా నెట్టడంలో మేము గర్విస్తున్నాము, వినియోగదారు ప్రాధాన్యతలతో సమలేఖనం చేస్తాము. స్మార్ట్ఫోన్ సెగ్మెంట్లో నిజమైన పురోగతిని సృష్టించేందుకు మేము ప్రయత్నిస్తున్నందున, ఈ ఉత్తేజకరమైన ప్రయాణంలో మా వినియోగదారులు మాతో చేరాలని మేము ఆసక్తిగా ఎదురుచూస్తున్నాము అని ఇన్ఫినిక్స్ ఇండియా సిఈఓ అనీష్ కపూర్ అన్నారు.

## కామెడీ ఎక్స్ఛేంజ్ 2లో అనీల్ రావిపూడి



హైదరాబాద్ : ప్రేక్షకులకు మనసుకు ఉల్లాసాన్ని కలిగించే అపరిమితమైన ఎంటర్టైన్మెంట్ను అందిస్తోన్న వన్ అండ్ ఓన్లీ తెలుగు ఓటీటీ మాధ్యమం ఆహా. కుటుంబం అంతా కలిసి ఎంజాయ్ చేసేలా ఆహా రూపొందించిన కార్యక్రమం కామెడీ ఎక్స్ఛేంజ్ ఎంత పెద్ద విజయాన్ని సాధించిందో తెలుసు. దీనికి కొనసాగింపుగా ఇప్పుడు కామెడీ ఎక్స్ఛేంజ్ 2 ప్రేక్షకులను మెప్పిస్తుంది. చక్కటి చమత్కారం కలగలిసిన ఇలాంటి షోలో భాగం కావటం ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందన్నారు బ్లాక్ బస్టర్ డైరెక్టర్ అనీల్ రావిపూడి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామెడీ ఎక్స్ఛేంజ్ వంటి ఓ ఎంటర్టైన్మెంట్ ప్రోగ్రామ్లో భాగం కావటం చాలా ఆనందంగా ఉందని. ఎగ్జయిటెడ్గానూ ఉందన్నారు. షోలో పాల్గొనే కమెడియన్ చేసే ప్రదర్శనలను చూసిన ఆడియెన్స్ వారికి వేసే ఓట్ల ఆధారంగా కొన్ని స్టాక్స్ను కేటాయిస్తారని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. వ్యక్తిగతంగా తనకు తన చుట్టు పక్కల వారిని నవ్విస్తూ ఉండటం అనేది ఎంతో చెప్పలేని సంతోషాన్నిస్తుందని పేర్కొన్నారు. కుటుంబం, స్నేహితులందరూ కలిసి చూసే ఎంటర్టైన్మెంట్ ఉండటం ఎంత ముఖ్యమనే విషయాన్ని, ప్రాముఖ్యతను ఆయన వివరించారు. కామెడీ ఎక్స్ఛేంజ్ 2 కోసం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మీడియా ప్రతినిధులతో పాటు హరి, సద్దాం, రోహిణి, అవినాష్, రాజు, జ్ఞానేశ్వర్-భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సైడ్ స్ప్లిట్టింగ్ స్కిట్స్తో మీడియా సహా అందరినీ ఎంటర్టైన్ చేశారు. అందరినీ మనస్ఫూర్తిగా కమెడియన్స్ తమ ప్రదర్శనలతో నవ్వించారు. తదనంతరం మీడియా ప్రతినిధులు యాంకర్ శ్రీముఖి, కమెడియన్స్ని ప్రశ్నోత్తరాలు అడగ్గా వారు సమాధానం చెప్పారు. ఈ ఇష్టాగోష్టి అనేది కార్యక్రమానికి మరింత వినోదాన్ని జోడించింది.

## రుమానా సిన్హా సెహగల్కు కర్మవీర్ చక్ర గోల్డ్ మెడల్



హైదరాబాద్ - డైనమిక్ ఎంటర్ప్రెన్యూర్ మరియు టి-హబ్లో మెంటర్ రుమానా సిన్హా సెహగల్కు రెక్స్ కాన్క్లేవ్ 2023-24లో యుఎన్- ఐ కాంగో స్థాపించిన ప్రతిష్టాత్మకమైన కర్మవీర్ చక్ర గోల్డ్ మెడల్ లభించింది. ఈ సంవత్సరం బంగారు పతకంతో సత్కరించబడిన రాష్ట్రానికి చెందిన మొదటి మహిళా పారిశ్రామికవేత్తగా అవతరించిన ఈ అద్భుతమైన విజయం తెలంగాణకు ఒక చారిత్రాత్మక ఘట్టాన్ని సూచిస్తుంది. రాజ్యాంగ దినోత్సవం, రోజున రెక్స్ కాన్క్లేవ్లో ప్రదర్శన కార్యక్రమం జరిగింది. నూతన ఆవిష్కరణలను పెంపొందించడం, మానవాళికి కనికరంలేని సహకారం సేవ మరియు శాశ్వత సామాజిక ప్రభావాన్ని సృష్టించడం కోసం రుమానా యొక్క నిబద్ధత ఈ ప్రశంసలను పొందడంలో కీలకమైన అంశాలు. అంతకుముందు 2019లో ఆమెకు కర్మవీర్ చక్ర రజత పతకాన్ని అందించారు. రుమానా సిన్హా సెహగల్ టి-హబ్లో మార్గదర్శక శక్తిగా ఉన్నారు, ఈ ప్రాంతంలో స్టార్టప్ల వృద్ధి మరియు విజయానికి గణనీయంగా దోహదపడ్డారు. మార్గదర్శకురాలిగా, ఆమె రాష్ట్ర వ్యవస్థాపక ల్యాండ్స్కేప్ను రూపొందించడంలో, తరువాతి తరం ఆవిష్కర్తలను ప్రేరేపించడంలో మరియు మార్గనిర్దేశం చేయడంలో కీలక పాత్ర పోషించారు. ప్రశంసలకు అతీతంగా, రుమానా సిన్హా సెహగల్ సోషల్ ఎంటర్ప్రెన్యూర్షిప్, లింగ సమానత్వం, క్యాన్సర్ అవగాహన మరియు ఋతు పరిశుభ్రతతో కూడిన ఆరోగ్య సంరక్షణ మరియు మహిళలు మరియు పిల్లలపై హింసను అరికట్టడం వంటి వాటిపై ఛాంపియన్గా నిలిచారు.
టి-హబ్ వ్యవస్థాపకుడు, సెరెండిపిటీ మరియు మెంటర్ రుమానా సిన్హా సెహగల్ మాట్లాడుతూ, యుఎన్- ఐ కాంగో నుండి కర్మవీర్ చక్ర గోల్డ్ మెడల్ మరియు రెక్స్ కర్మవీర్ గ్లోబల్ ఫెలోషిప్ 2023-24 అందుకున్నందుకు నేను నిజంగా కృతజ్ఞురాలిని. ఈ గుర్తింపు భాగస్వామ్య విజయం, నమ్మశక్యం కాని సంఘం మద్దతుతో ఇది సాధ్యమైంది. సానుకూల మార్పుకు దోహదపడే అవకాశానికి నేను కృతజ్ఞుడను మరియు కలిసి ఈ ప్రభావవంతమైన ప్రయాణాన్ని కొనసాగించడానికి ఎదురు చూస్తున్నాను అన్నారు.
రుమానా సిన్హా సెహగల్ విజయాల పట్ల మేము ఎంతో గర్విస్తున్నాము. టి-హబ్ మెంటార్గా, ఆవిష్కరణలను ప్రోత్సహించడం మరియు సానుకూల ప్రభావాన్ని సృష్టించడం కోసం ఆమె అంకితభావంతో అసంఖ్యాక పారిశ్రామికవేత్తల జీవితాలను మార్చడమే కాకుండా తెలంగాణకు ప్రపంచ గుర్తింపును తెచ్చిపెట్టింది. ఈ అవార్డు శ్రేష్ఠత పట్ల ఆమెకున్న అచంచలమైన నిబద్ధతకు నిదర్శనం మరియు మన రాష్ట్ర వ్యవస్థాపక పర్యావరణ వ్యవస్థలో అగ్రగామిగా ఆమె పాత్ర ఉంది అని టి-హబ్ సిఇఒ మహంకాళి శ్రీనివాస్ రావు అన్నారు. ఐక్యరాజ్యసమితి మరియు ఐకాంగో ద్వారా స్థాపించబడిన కర్మవీర్ చక్ర మరియు గ్లోబల్ ఫెలోషిప్ అవార్డులు, వారి వినూత్న ఆలోచనలు మరియు చర్యల ద్వారా మార్పును సాధించి, ఇతరులను ప్రేరేపించే వ్యక్తులను గుర్తిస్తాయి.

'మిచాంగ్' ప్రభావిత వినియోగదారులకు

## టాటా మోటార్స్ ప్రత్యేక సేవలు




ముంబయి : 'మిచాంగ్' తుఫాను తర్వాత ప్రతిస్పందనగా, టాటా మోటార్స్ తమిళనాడు మరియు ఆంధ్రప్రదేశ్లోని కొన్ని ప్రాంతాల్లో వరదల కారణంగా నష్టపోయిన తన వినియోగదారులకు సంఘీభావంగా నిలుస్తుంది. ఈ క్లిష్ట సమయంలో కస్టమర్లకు సహాయం చేయడానికి, కంపెనీ సమగ్ర సేవా ప్రణాళికను అమలు చేసింది. ఈ సేవ టాటా మోటార్స్ ప్యాసింజర్ వాహనాలు మరియు ఎలక్ట్రిక్ వాహనాల పరిధిలో అందుబాటులో ఉంది. వారంటీ మరియు సేవా కాలాల పొడిగింపు: వాహన నిర్వహణలో సవాళ్లను ఎదుర్కొంటున్న వినియోగదారులపై భారాన్ని తగ్గించడానికి, కంపెనీ ప్రభావిత ప్రాంతంలోని వాహనాలకు ప్రామాణిక వారంటీ వ్యవధి, పొడిగించిన వారంటీ వ్యవధి, వార్షిక నిర్వహణ కాంట్రాక్ట్ వ్యవధి మరియు ఉచిత సేవా వ్యవధిని పొడిగిస్తోంది. ఈ పొడిగింపు 01.12.2023 నుండి 15.12.2023 మధ్య ముగిసే ఒప్పందాలకు వర్తిస్తుంది మరియు 31.12.2023 వరకు చెల్లుబాటు అవుతుంది. అంకితమైన ఎమర్జెన్సీ రోడ్ అసిస్టెన్స్ టీమ్: కస్టమర్ కాల్ తేదీలు మరియు ఏరియా యాక్సెసిబిలిటీ ఆధారంగా కేసులను క్రమపద్ధతిలో నిర్వహించడానికి ప్రత్యేక అత్యవసర రహదారి సహాయ బృందం ఏర్పాటు చేయబడింది. ఇది ప్రతి బాధిత కస్టమర్ యొక్క ప్రత్యేక అవసరాలకు క్రమబద్ధమైన ప్రతిస్పందనను నిర్ధారిస్తుంది.

## డెట్టాల్ బనేగా స్వస్థ్ ఇండియా జాతీయ విజేతలు



రెకిట్, ప్రపంచంలో ప్రముఖ వినియోగదారు ఆరోగ్యం మరియు హైజీన్ కంపెనీ, రెకిట్ ఫ్లాగ్ షిప్ క్యాంపైన్ డెట్టాల్ బనేగా స్వస్త్ ఇండియా ద్వారా భారతదేశంలో అతి పెద్ద హైజీన్ ఒలంపియాడ్ యొక్క రెండవ ఎడిషన్ డెట్టాల్ హైజీన్ ఒలంపియాడ్ విజేతలను ప్రకటించింది. బాల్యంలో అనారోగ్యాన్ని నివారించడంలో పరిశుభ్రత వహించే బాధ్యత గురించి చైతన్యం పెంచే లక్ష్యంతో ఒలంపియాడ్ నిర్వహించబడింది. ముంబయిలో జరిగిన డెట్టాల్ బనేగా స్వస్త్ ఇండియా సీజన్ 10లో తమ టీచర్స్ సహా 15 మంది ఒలంపియాడ్ విజేతలకు సన్మానం జరిగింది. డెట్టాల్ హైజీన్ ఒలంపియాడ్ 2.0 దేశంలోని 28 రాష్ట్రాలు మరియు 8 కేంద్ర పాలిత ప్రాంతాల్లో 30 మిలియన్ కు పైగా పిల్లలను విజయవంతంగా చేరుకుంది, చేతులు కడుక్కునే పరిశుభ్రతలో అవసరమైన విజ్ఞానం మరియు ఉత్తమమైన పద్ధతులతో దేశంలో అత్యంత సుదూర ప్రాంతాల్లో పిల్లలకు సాధికారత కల్పించింది. 2500 గురుకులాలు మరియు ఇతర ఆధ్మాత్మిక విద్యా పాఠశాలల్లో కూడా విద్యార్థులు పాల్గొన్నారు. విభిన్నమైన ప్రేక్షకులకు అందుబాటులో సంస్కృత భాషలో పరీక్షా ప్రశ్న పత్రాల లభ్యతను ఇవి నిర్ధారించాయి. పరీక్ష పిల్లల కోసం అయిదు స్థాయిలలో విభజించబడింది. దీని ప్రకారం 6 నుండి 16 సంవత్సరాల వారి కోసం ఆరోగ్యం మరియు పరిశుభ్రత పై మల్టిపుల్ ఛాయిస్ క్వశ్చన్స్ (ఎంసీక్యూలు) ఉంటాయి. 1వ తరగతి నుండి 2వ తరగతికి చెందిన విద్యార్థులు లెవెల్ 1 పరీక్ష కోసం తయారయ్యారు; లెవెల్ 2 పరీక్షను 3వ మరియు 4వ తరగతి విద్యార్థులు తీసుకున్నారు; లెవెల్ 3 పరీక్షను 5 మరియు 6వ తరగతికి చెందిన విద్యార్థులు తీసుకున్నారు; 7వ మరియు 8వ తరగతి వారి కోసం లెవెల్ 4; మరియు 9వ మరియు 10వ తరగతి విద్యార్థులు లెవెల్ 5 పరీక్షకు హాజరయ్యారు. దేశవ్యాప్తంగా ఉన్న మొత్తం 15 మంది విద్యార్థులకు (ప్రతి స్థాయిలో ముగ్గురు) నగదు బహుమతులు అందచేయబడ్డాయి. మొదటి స్థానం పొందిన వారు రూ. 50,000, రెండవ స్థానం విజేతలు రూ. 35,000 మరియు మూడవ స్థానం విజేతలు రూ. 15,000 గెలుచుకున్నారు. రవి భట్నాగర్ , డైరెక్టర్ , ఎక్స్ టర్నల్ అఫైర్స్ పార్ట్ నర్ షిప్స్, ఎస్ఓఏ, రెకిట్, మాట్లాడుతూ, పరిశుభ్రత, ఆరోగ్యం మరియు పారిశుద్ధ్యాలు కోసం రెకిట్ వారి నిబద్ధత అనుకూలమైన పారిశుద్ధతతో సంబంధమున్న డమైన్స్ లో ఛాంపియన్స్ అవడానికి భారతదేశపు యువ మేధస్సులను ప్రేరేపించింది. భారతదేశంలోని సుదూర ప్రాంతాల్లో చేరుకునే కార్యాన్ని చేపట్టిన డెట్టాల్ హైజీన్ ఒలంపియాడ్ (డీహెచ్ఓ) రెండవ ఎడిషన్ యొక్క ఆశ్చర్యకరమైన ఫలితాలను చూసి మేము ఎంతో ఆనందించాము; నమ్ సాయ్ మరియు అంజా నుండి, చివరి గ్రామాలు అరుణాచల్ ప్రదేశ్ సరిహద్దులను పంచుకున్నాయి, గుజరాత్ లోని సుదూర తలాలా వరకు, సిక్కింలోని నేపాల్ సరిహద్దు వద్ద ఉత్తరే నుండి మిజోరాంలోని చంపాయ్ వరకు, కాశ్మీర్ లోని బుద్గాం వరకు. భారతదేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పిల్లల విజయాలను సంబరం చేయడం మాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది మరియు దేశపు ఆరోగ్య ప్రగతికి వారి ఉత్సుకత మరియు విజ్ఞానం తోడ్పడుతుందని మేము ఆత్మవిశ్వాసం కలిగి ఉన్నాము. అని తెలిపారు.



# ఛత్తీస్‌గఢ్ కొత్త సీఎంగా విష్ణుదేవ్ సాయ్

● బీజేపీ శాసనసభా పక్ష నేతగా ఎన్నిక ● వారం రోజుల సస్పెన్స్‌కు తెర ● 2019లో టిక్కెట్టే ఇవ్వలేదు
● ఈసారి ఏకంగా సీఎం పోస్ట్ ● ఛత్తీస్‌గఢ్ కొత్త సీఎం ప్రస్థానం ● గతంలో కేంద్ర మంత్రిగా పని చేసిన విష్ణుదేవ్



రాయ్‌పూర్ : వారం రోజుల సస్పెన్స్‌కు భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అధిష్ఠానం తెర దించింది. ఛత్తీస్‌గఢ్ కొత్త ముఖ్యమంత్రిగా విష్ణుదేవ్ సాయ్‌ను బీజేపీ అధిష్ఠానం ఎంపిక చేసింది. సీఎం ఎంపిక కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ ఎమ్మెల్యేలతో భేటీ తరువాత నిర్ణయం తీసుకుంది. మొత్తం 54 మంది ఎమ్మెల్యేలు బీజేపీ శాసనసభా పక్ష నేతగా విష్ణుదేవ్ సాయ్‌ను ఎన్నుకున్నారు. విష్ణుదేవ్ సాయ్ గతంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ తొలి కేబినెట్‌లో కేంద్ర మంత్రిగానూ వ్యవహరించారు. మరొక వైపు ఛత్తీస్‌గడ్ మాజీ సీఎం డాక్టర్ రమణ్ సింగ్‌ను పక్కన పెడుతూ కొత్త వ్యక్తి వైపే బీజేపీ అధిష్ఠానం మొగ్గు చూపింది. అంతకుముందు బీజేపీ శాసనసభా పక్ష నేతను ఎన్నుకునేందుకు బీజేపీకి చెందిన 54 మంది ఎమ్మెల్యేలు రాయ్‌పూర్‌లో సమావేశమయ్యారు. వారితో కేంద్ర మంత్రులు అర్జున్ ముండా, సర్బానంద సోనోవాల్, పార్టీ జనరల్ సెక్రటరీ దుష్యంత్ కుమార్ గౌతమ్, ఛత్తీస్‌గడ్ బీజేపీ ఇన్‌చార్జ్ ఓమ్ మాథూర్, మరో కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయ భేటీ అయ్యారు.

ఎమ్మెల్యేల అభిప్రాయాన్ని వారు తెలుసుకున్నారు. అనంతరం బీజేపీ శాసనసభా పక్ష నేతగా విష్ణుదేవ్ సాయ్‌ను ఎన్నుకున్నారు. 59 ఏళ్ల విష్ణుదేవ్ సాయ్ ఉత్తర ఛత్తీస్‌గఢ్‌లోని కున్‌కురీ నియోజకవర్గం నుంచి గెలుపొందారు. శాసనసభ ఎన్నికల్లో ఈ ప్రాంతంలో బీజేపీ దాదాపు క్లీన్ స్వీప్ చేయగా, ఇందులో విష్ణుదేవ్ సాయ్ కీలక పాత్ర పోషించారు. విష్ణుదేవ్ సాయ్ సాహు సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కాగా, దుర్గ్, రాయ్‌పూర్, బిలాస్‌పూర్ డివిజన్లలో ఈ వర్గం జనాభా అధికంగా ఉంది. మరొక వైపు విష్ణుదేవ్ సాయ్ గతంలో రెండు సార్లు ఎమ్మెల్యేగా, నాలుగు సార్లు ఎంపీగా గెలిచారు. రాయ్‌గఢ్ లోక్‌సభ స్థానం నుంచి 1999 నుంచి 2014 వరకూ నాలుగు సార్లు ఎంపీగా గెలుపొందారు. అయితే, 2019 ఎన్నికల్లో ఆయనకు బీజేపీ అధిష్ఠానం టిక్కెట్ ఇవ్వలేదు. ఆయన మూడు సార్లు ఛత్తీస్‌గఢ్ బీజేపీ అధ్యక్షునిగా ఉన్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో భాగంగా ఇటీవల ఛత్తీస్‌గఢ్ శాసనసభకు ఎన్నికలు జరిగాయి. 90 స్థానాలకు ఎన్నికలు జరగగా 54 స్థానాల్లో బీజేపీ విజయం సాధించింది. 2018లో 68 సీట్లు కైవసం చేసుకున్న కాంగ్రెస్ పార్టీ ఈసారి 35 సీట్లకు పరిమితమైంది. గోండ్వానా గణతంత్ర పార్టీకి ఒక సీటు వచ్చింది. అయితే. శాసనసభ ఫలితాలు వెల్లడి అయ్యి వారం రోజులు కావస్తున్నా సీఎంను ఎంపిక చేయలేకపోతున్నారని కాంగ్రెస్ విమర్శలు గుప్పిస్తూ వచ్చింది. ఈ నేపథ్యంలోనే విష్ణుదేవ్ సాయ్‌ను ముఖ్యమంత్రిగా నియమించింది బీజేపీ అధిష్టానం. 2018 ఎన్నికల్లో గిరిజనులు అధికంగా ఉన్న సర్‌గుజా డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధిక్యం ప్రదర్శించింది. ఆ డివిజన్‌లో ఉన్న 14 స్థానాలను హస్తం పార్టీ కైవసం చేసుకుంది. అయితే, 2023 ఎన్నికల్లో విష్ణుదేవ్ సాయ్ ప్రభావంతో ఈసారి హస్తం పార్టీకి చుక్కెదురైంది. ఆ డివిజన్‌లో మెజారిటీ స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంది. ఛత్తీస్‌గఢ్ జనాభాలో ఎస్టీల వాటా 32 శాతం కాగా, బీజేపీ 29 సీట్లు కేటాయించింది. వాటిలో 17 చోట్ల గెలుపొందింది.

# జేబులకు భరోసా కాదు

● ప్రజలను శక్తిమంతం చేయాలి ● ఉచిత పథకాలపై ఉప రాష్ట్రపతి కీలక వ్యాఖ్యలు
● మానవ హక్కుల దినోత్సవం సభలో ధన్కర్ ప్రసంగం ● మానవ హక్కుల పరిరక్షణలో మన నిబద్ధత గమనార్హం



న్యూఢిల్లీ : దేశంలో రాజకీయ పార్టీలు ఉచిత పథకాలను అమలు చేయడం గురించి కొన్ని నెలలుగా చర్చ సాగుతోంది. ప్రస్తుత సమాజంలో వోట్ల కోసం ఉచిత పథకాలను అమలు చేయడం, హామీలు ఇవ్వడం, పోటాపోటీ రాజకీయాలపై ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్కర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఉచిత పథకాలు అమలు చేయడం వ్యయ ప్రాధాన్యతలను మార్చుకోవడమే అవుతుందని ఆయన సంచలన వ్యాఖ్య చేశారు. జేబులకు భరోసా ఇవ్వడం కాదని, ప్రజలను శక్తిమంతం చేయవలపిన అవసరం ఉందని ధన్కర్ వునరుద్ఘాటించారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా భారత్ మండపంలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్ ముఖ్య అతిథిగా ప్రసంగించారు. దీర్ఘ కాలంలో మానవ హక్కుల ఫలితాలపై దేశవ్యాప్తంగా ఆరోగ్యకరమైన చర్చ జరగవలసి ఉందని ఆయన సూచించారు. భారత్ మాదిరిగా ప్రపంచంలో ఏ ప్రదేశమూ మానవ హక్కులతో విరాజిల్లడం లేదని వెల్లడించారు. మానవ హక్కుల్లో ప్రపంచంలో ఏ భాగం కూడా భారత్ మాదిరిగా విరాజిల్లడం లేదని, మన నాగరికత, రాజ్యాంగ రూపకల్పన అనేవి మానవ హక్కులను గౌరవించడం, పరిరక్షించడం, పెంపొందించడంలో మన నిబద్ధతను చాటిచెబుతున్నాయని, ఇవి భారత డీఎన్ఏలోనే ఉన్నాయని ఉప రాష్ట్రపతి పేర్కొన్నారు. ఉచిత పథకాల రాజకీయాలు కేవలం వ్యయ ప్రాధాన్యతలను వక్రీకరించడమేనని ధన్కర్ పేర్కొన్నారు. దిగ్గజ ఆర్థిక నిపుణుల ప్రకారం, ఉచితాలు అనేవి స్థూల ఆర్థిక స్థిరత్వం ప్రాథమిక సూత్రాన్ని బలహీనపరుస్తాయని, దీర్ఘ కాలంలో జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, ఆర్థిక వ్యవస్థపై ఈ ప్రోత్సాహం ఎంతగా ప్రభావితం చూపుతాయనే విషయాలపై జాతీయ స్థాయిలో చర్చ జరగవలసిన అవసరం ఉందని ధన్కర్ అభిప్రాయపడ్డారు. అమృఎత్ కాల్ సమయంలోనే యూనివర్సల్ డిక్లరేషన్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ కూడా 75వ వార్షికోత్సవాన్ని చేసుకోవడం యాదృచ్ఛికమని జగదీప్ ధన్కర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భారత్‌లోని ఐక్యరాజ్య సమితి రెసిడెంట్ కో ఆర్డినేటర్ శోంబి షార్ప్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐక్యరాజ్య సమితి జనరల్ సెక్రటరీ ఆంట్నియో గుటెర్రెస్ పంపిన సందేశాన్ని చదివి వినిపించారు.

## సికింద్రాబాద్ నుంచి

# మరో వందే భారత్ రైలు

● ఇప్పటికే దేశంలో వివిధ రూట్లలో వందే భారత్ రైళ్లు ● త్వరలో మరో 10 వందే భారత్ రైళ్లకు పచ్చ జెండా ● వాటిలో సికింద్రాబాద్- పుణె రైలు



హైదరాబాద్ : సికింద్రాబాద్ నుంచి ఇప్పటికే రెండు వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయి. ఒకటి సికింద్రాబాద్- విశాఖ మార్గంలో, మరొకటి సికింద్రాబాద్- తిరుపతి మార్గంలో నడుస్తున్నాయి. ఇప్పుడు మరొక వందే భారత్ రైలు సికింద్రాబాద్ నుంచి పరుగులు తీయనున్నది. ఈ కొత్త వందే భారత్ రైలు సికింద్రాబాద్ నుంచి పుణె మార్గంలో నడవనున్నది. దేశంలో వందే భారత్ సెమీ హైస్పీడ్ రైళ్లకు చంచి డిమాండ్ ఉండడంతో రైల్వే శాఖలో ఉత్సాహం వెల్లివిరుస్తోంది. ఈ నేపథ్యంలో, త్వరలోనే ఒకే రోజు 10 మార్గాల్లో వందే భారత్ రైళ్లకు ప్రధాని నరేంద్ర మోడీ వర్చువల్‌గా పచ్చ జెండా ఊపనున్నారు.

వాటిలో సికింద్రాబాద్- పుణె రైలు కూడా ఉంది. అయితే, ఇది వందే భారత్ రైలా, వందే సాధారణ్/ అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలా అన్నది స్పష్టత రావలసి ఉంది.



## కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు ధీరజ్‌దిగా చెబుతున్న

# రూ. 300 కోట్లు స్వాధీనం

● తమకు సంబంధం లేదన్న జైరామ్ రమేశ్ ● ఒడిశాలోని బౌధ్ డిస్టిలరీ ప్రైవేట్ లిమిటెడ్ ప్రాంగణంలో ఐటీ సోదాలు ● దాదాపు రూ. 300 కోట్ల నగదు స్వాధీనం ● ధీరజ్ సాహు వ్యాపారాలతో పార్టీకి సంబంధం లేదన్న జైరామ్ రమేశ్ ● ప్రజల నుంచి దోచుకున్న సొమ్మును తిరిగి వారికే ఇస్తామన్న మోడీ

న్యూఢిల్లీ : ఒడిశా, ఝార్ఖండ్‌లలో కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు ధీరజ్ సాహుకు సంబంధించిన పలు ప్రాంతాల్లో ఆదాయ పన్ను (ఐటీ) శాఖ నిర్వహించిన దాడుల్లో లెక్కల్లో చూపని దాదాపు రూ. 300 కోట్ల నగదు బయపడడం సంచలనమైంది. బుధవారం దాడులు ప్రారంభించగా, అవి ఇంకా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ స్పందించారు. ధీరజ్ సాహు వ్యాపారాలతో కాంగ్రెస్ పార్టీకి ఎటువంటి సంబంధమూ లేదని ఆయన స్పష్టం చేశారు. అధికారులు పెద్ద ఎత్తున స్వాధీనం చేసుకున్న సొమ్ముపై ఆయన మాత్రమే చెప్పగలరని జైరామ్ పేర్కొన్నారు. ఐటీ అధికారులు స్వాధీనం చేసుకున్న మొత్తంలో ఎక్కువ భాగం ఒడిశాలోని బౌధ్ డిస్టిలరీ ప్రైవేట్ లిమిటెడ్ ప్రాంగణంలోనే లభ్యమైనట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు ధీరజ్ సాహుకు చెందిన ప్రాంతాల్లో పెద్ద మొత్తంలో నగదు లభ్యం కావడంపై బీజేపీ నేతలు విమర్శనాస్త్రాలు సంధించారు. కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ మాట్లాడుతూ, ధీరజ్ అవినీతిలో భాగం కావడం ఇదే తొలిసారి కాదని విమర్శించారు. కుంభకోణం ఎక్కడ జరిగితే అక్కడ కాంగ్రెస్ నేత ఎందుకు ఉంటారని ఆమె ప్రశ్నించారు. ప్రధాని నరేంద్ర మోడీ కూడా ఎక్స్ ద్వారా కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. ప్రజల నుంచి దోచుకున్న ఈ సొమ్మును తిరిగి వారికే ఇచ్చేస్తామని మోడీ పేర్కొన్నారు.



## శ్రీ బేడి ఆంజనేయస్వామివారికి

# శాస్త్రోక్తంగా ప్రత్యేక అభిషేకం

తిరుమల మేజర్ న్యూస్: తిరుమల శ్రీవారి ఆలయం ఎదురుగా వెలసివున్న శ్రీ బేడి ఆంజనేయస్వామివారికి ఆదివారం శాస్త్రోక్తంగా ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. కార్తీక మాసం చివరి ఆదివారం సందర్భంగా ప్రతి సంవత్సరం ఆలయంలో ప్రత్యేక అభిషేకం నిర్వహించడం ఆనవాయితీ. శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో మూలమూర్తికి ఉదయం పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపులతో విశేషంగా అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఈవో ఏవి. ధర్మారెడ్డి, విజివో నంద కిషోర్, పెష్కర్ శ్రీహరి, ఇతర అధికారులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

# శ్రీవారి సేవలో ప్రముఖులు





తిరుమల మేజర్ న్యూస్: శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని పలువురు ప్రముఖులు ఆదివారం ఉదయం దర్శించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న వారిలో రాష్ట్ర మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం, రాష్ట్ర మాజీ ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్, రాష్ట్ర హైకోర్టు మాజీ జస్టిస్ భవాని ప్రసాద్, హిమాచల్ ప్రదేశ్ మాజీ చీఫ్ జస్టిస్ ఎం ఎన్ రావు, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, టిడిపి ఎమ్మెల్యే డోల బాల వీరాంజనేయ స్వామి, తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కె ఆర్ నాగరాజు, గంట సత్యనారాయణ రావు, మాజీ పార్లమెంటు సభ్యుడు లగడపాటి రాజగోపాల్ తదితరులు స్వామివారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు. వీరికి టిటిడి అధికారులు ఆలయ వద్ద స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లను చేపట్టారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.



# ఇతడే నా రాజకీయ వారసుడు

● కీలక ప్రకటన చేసిన బీఎస్పీ అధినేత్రి మాయావతి
● తన తరువాత పగ్గాలు అందుకునేది తన మేనల్లుడేనని వెల్లడి
● ఇప్పటికే సోదరుడికి పార్టీ జాతీయ ఉపాధ్యక్ష పదవి ఇచ్చిన మాయావతి

లక్నో : బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధినేత్రి మాయావతి తన రాజకీయ వారసుడిని ప్రకటించారు. తన రాజకీయ వారసత్వాన్ని మేనల్లుడు ఆకాశ్ ఆనంద్ కొనసాగిస్తాడని ఆమె వెల్లడించారు. లక్నోలో ఆదివారం జరిగిన బీఎస్పీ కార్యవర్గ సమావేశంలో మాయావతి ఈ ప్రకటన చేశారు.

ఆకాశ్ ఆనంద్ వయసు 28 ఏళ్లు. 2017 యూపీ ఎన్నికలు, 2019 లోక్ సభ ఎన్నికల్లో మాయావతి ప్రచారం సాగించిన వేళ ఆకాశ్ ఆనంద్ కూడా ఆమె వెన్నంటే ఉన్నారు. వారసత్వ రాజకీయాలను నిశితంగా విమర్శించే మాయావతి 2019లో తన సోదరుడు ఆనంద్ కుమార్‌ను పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడిగా ప్రకటించడం, ఇప్పుడు మేనల్లుడికి పార్టీ పగ్గాలు అప్పగించబోతున్నట్లు పరోక్షంగా సంకేతాలు ఇవ్వడం చూస్తుంటే విమర్శలు వచ్చే అవకాశం కనిపిస్తోంది.

# 19న ఇండియా కూటమి నేతల సమావేశం

● సీట్ల పంపకమే ప్రధాన అజెండా ● రానున్న భేటీలో కాంగ్రెస్‌కు చిక్కులు తప్పవేమో ? ● మూడు రాష్ట్రాల్లో ఓటమి ప్రభావం
● ఈ సారి అఖిలేష్ హాజరయ్యే అవకాశ




న్యూఢిల్లీ : ఇండియా కూటమి నేతలు త్వరలో సమావేశం కానున్నట్లు తెలుస్తోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు ఈ నెల 19న ఢిల్లీలో సమావేశం జరగనున్నది. ఆ సమావేశం ప్రధాన అజెండా రానున్న లోక్ సభ ఎన్నికల సందర్భంగా పార్టీల మధ్య సీట్ల పంపకం చేయడమే అని తెలుస్తోంది. ప్రభుత్వ వ్యతిరేక వోటు చీలకుండా ఎన్డీఏను దెబ్బ తీయాలని నేతలు భావిస్తున్నారు. అయితే, ఈ సారి జరిగే సమావేశంలో కాంగ్రెస్ కఠిన పరిస్థితులు ఎదుర్కొనున్నది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ మూడు రాష్ట్రాల్లో ఘోర ఓటమిపాలైంది. ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మధ్య ప్రదేశ్‌లలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఘన విజయం సాధించింది. దీనితో ప్రధాన ప్రతిపక్షం, ఇండియా కూటమికి చెందిన ప్రధాన పార్టీ కాంగ్రెస్‌పై సీట్ల పంపకంలో ఒత్తిడి తెచ్చే అవకాశమూ లేకపోలేదు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్‌తో విభేదాలను కూడా కాంగ్రెస్ పరిష్కరించుకోవడంతో ఆయన కూడా త్వరలో జరిగే సమావేశానికి హాజరు కానున్నట్లు తెలుస్తోంది. అఖిలేష్, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ గైర్హాజరుతో గత వారం జరగవలసిన సమావేశం వాయిదా పడింది. తెలంగాణలో కాంగ్రెస్ గెలుపు మినహా మిగతా రాష్ట్రాల్లో చెప్పుకోదగిన ఫలితాలు ఆ పార్టీ సాధించలేదు. వచ్చే ఏడాది జరగనున్న లోక్ సభ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీతో కూడిన ఎన్డీఏ కూటమిని ఢీ కొట్టడానికి ప్రతిపక్ష నేతలు ఇండియా కూటమిగా జత కట్టారు.

## మొదటి ఘాట్‌లోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారికి

# వైభవంగా ప్రత్యేక అభిషేకం



తిరుమల మేజర్ న్యూస్: తిరుమల మొదటి ఘాట్ రోడ్డులోని నడకమార్గం చెంత వెలసివున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారికి వైభవంగా ఆదివారం ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. కార్తీక మాసంలో స్వాతి తిరునక్షత్రం సందర్భంగా ప్రతి సంవత్సరం ఆలయంలో ప్రత్యేక అభిషేకం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో మూలమూర్తికి ఉదయం అర్చకులు శాస్త్రోక్తంగా ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అధికారులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి జనవరి 5 వరకు

# శ్రీవారి ఆలయంలో అధ్యయనోత్సవాలు

తిరుమల మేజర్ న్యూస్: శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయంలో మంగళవారం నుంచి 2024 జనవరి 5వ తేదీ వరకు అధ్యయనోత్సవాలు ఘనంగా జరుగనున్నాయి. సాధారణంగా ధనుర్మాసంలో వైకుంఠ ఏకాదశికి 11 రోజులు ముందుగా శ్రీవారి సన్నిధిలో దివ్యప్రబంధ అధ్యయనంగా పిలిచే ఈ అధ్యయనోత్సవం ప్రారంభమవుతుంది. ఈ సందర్భంగా స్వామివారి ప్రాశస్త్యంపై 12 మంది ఆళ్వార్లు రచించిన దివ్యప్రబంధ పాశురాలను శ్రీవైష్ణవ జీయంగార్లు గోష్ఠిగానం చేస్తారు. ఆళ్వార్ దివ్యప్రబంధంలోని 4 వేల పాశురాలను 25 రోజుల పాటు శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో శ్రీవైష్ణవులు పారాయణం చేస్తారు. కాగా, తొలి 11 రోజులను పగల్పత్తు అని, మిగిలిన 10 రోజులను రాపత్తు అని వ్యవహరిస్తారు. 22వ రోజున కణ్ణినున్ శిరుత్తాంబు, 23వ రోజున రామానుజ నూత్రందాది, 24వ రోజున శ్రీవరాహస్వామివారి శాత్తుమొర, 25వ రోజున అధ్యయనోత్సవాలు పూర్తవుతాయి.

## మహాశక్తి కమిటీ మహిళలను ఘనంగా సత్కరించిన నారా లోకేష్

కాకినాడ జిల్లా జగ్గంపేట, సూర్య బ్యూరో ప్రతినిధి : జగ్గంపేట నియోజకవర్గంలో 90 రోజుల పాటు మహాశక్తి మహిళా కమిటీ బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ సూపర్ సిక్స్ పథకాలను ప్రచారం చేసి తెలుగుదేశం పార్టీ పై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చిన కమిటీ సభ్యులను నారా లోకేష్ యువ గళం పాదయాత్రలో లంచ్ బ్రేక్ లో జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో నియోజకవర్గ మహిళా కమిటీ లో ఉన్న ప్రతి మహిళకు అభినందన పత్రం అందజేసి ఘనంగా సత్కరించారు. మీరు పార్టీ కోసం కష్టపడిన తీరు సూపర్ సిక్స్ పథకాలు ప్రచారం ప్రజల్లో తెలుగుదేశం పార్టీ కి మరింత బలం చేకూరిందని ఆయన ప్రతి మహిళను పేరుపేరునా అభినందించారు. లోకేష్ తో పాటు మాజీ మంత్రి పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చిన రాజప్ప, రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ అభినందించారు. మహిళా కమిటీ సభ్యులు పోలినాటి ధర్మానంద కుమారి, నకిరెడ్డి సూర్యవతి, గుమ్మల్ల అనంతలక్ష్మి, రాపాకలక్ష్మి, చెక్కా మరియా, ఎల్లాటి అమ్మాజీ, గొల్లవిల్లి శ్రీదేవి, గెద్దాడ సత్యవేణి, పాఠం శెట్టి వెంకటలక్ష్మి, గొల్లవిల్లి వరలక్ష్మి, కడారి లక్ష్మి, తిప్పన సత్యవతి, గుండుపల్లి సుజాత, వారితోపాటు మహిళా కమిటీని సమర్థవంతంగా ముందుకు నడిపించిన ఎస్వీఎస్ అప్పలరాజు, పాలూరి బోసు బాబు, దాపర్తి సీతారామయ్య, మండపాక అప్పన్న దొర, కంచుమర్తి రాఘవ, అడపా తాతాజీ, తదితరులు కూడా ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమంలో గండేపల్లి మండల టిడిపి అధ్యక్షులు పోతుల మోహనరావు, కిర్లంపూడి మండల టిడిపి నాయకులు కుంచే తాతాజీ తదితరులు పాల్గొన్నారు.



# ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యం

## యువనేత లోకేష్ ఎదుట కౌలు రైతుల ఆవేదన

తుని, సూర్య బ్యూరో ప్రతినిధి : తుపాను కారణంగా తీవ్రంగా దెబ్బతిన్న తమను ప్రభుత్వం ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యమని కౌలురైతులు ఆవేదన వ్యక్తం చేశారు. యువగళం పాదయాత్రలో భాగంగా తుని నియోజకవర్గం ఒంటిమామిడి వద్ద పంటపొలాలను యువనేత లోకేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణాపురానికి చెందిన కౌలురైతు యన్నా బాబ్జి లోకేష్ తో మాట్లాడుతూ నేను 4 ఎకరాల్లో వరి పంటను కౌలుకు సాగు చేశాను. అర ఎకరంలో మిర్చి, మరో అర ఎకరంలో బెండ సాగు చేశాను. వరి, మిరప పంటలు నీటిలో నానిపోయి కుళ్లిపోయాయి. వరిపంట చేతికొచ్చే స్థితిలో లేదు. మిర్చి మొక్కలు కుళ్లిపోయి నేలకొరిగి పాడైపోయాయి. మొత్తంగా రూ.1.70వేలు నష్టం వచ్చింది. నాకు ప్రభుత్వం నుండి కౌలుకార్డు, ప్రభుత్వ పథకాలు ఏవీ రావడం లేదు. గతేడాది కూడా నేను వ్యవసాయంలో తీవ్రంగా నష్టపోయి అప్పుల్లో కూరుకుపోయి ఉన్నాను. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యంమని ఆవేదన చెందారు. తాటేరుపాలెంకు చెందిన మరో కౌలురైతు వీరబాబు మాట్లాడుతూ నేను 3 ఎకరాల్లో వరిపంట కౌలుకు వ్యవసాయం చేస్తున్నాను. మిచౌంగ్ తుఫాను వల్ల పంట మొత్తం నేలకొరిగిపోయింది. వర్షపునీరు పొలాల్లో చేరి పంట మొత్తం కుళ్లిపోయింది. పంట కోత కోసినా ఉపయోగం లేదు. ఇప్పటి వరకు రూ.70వేలు పెట్టుబడి పెట్టాను. జమ్మేరు వూడిక నాలుగేళ్లుగా తీయడం లేదు. దీనివల్ల మా పొలాలన్నీ వర్షాలు వచ్చినప్పుడు మునిగిపోయి తీవ్రంగా నష్టపోతున్నాం. మాకు కౌలుకార్డు లేదు, ప్రభుత్వ పథకాలు అందడం లేదు. ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలని విన్నవించాడు. ఒంటిమామిడికి చెందిన కాకాడ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతియేటా మాకున్న 60సెంట్ల పొలంలో పండించుకున్న ధాన్యం తిని బతుకుతున్నాం. పంట చేతికొచ్చే సమయంలో మిచౌంగ్ తుఫాను వల్ల మా తిండిగింజలు మొత్తం నేలపాలయ్యాయి. ఇప్పటివరకు రూ.30వేలు పెట్టుబడి పెట్టాను. ప్రభుత్వం నుండి మాకు ఇన్ పుట్ సబ్సిడీలు, పంట బీమాలు ఏవీ రావడం లేదని వాపోయాడు. ఈ సందర్భంలో లోకేష్ రైతులతో మాట్లాడుతూ కౌలు రైతులకు న్యాయం చేసేలా మేం అధికారంలోకి వచ్చాక ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. పంటను సాగుచేసే వారికి అందాల్సిన పథకాలను పారదర్శకంగా అందించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపడతాం. కౌలు రైతులు నష్టపోకుండా చూస్తామని రైతులకు భరోసా ఇచ్చారు.






# కాపుల ఆత్మ గౌరవాన్ని పెంచింది వైఎస్సార్సీపీ

## రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

తణుకు, సూర్య బ్యూరో ప్రతినిధి : రాష్ట్రంలో కావుల అభివృద్ధి, సంక్షేమంతో పాటు వారి ఆత్మ గౌరవం, పెంచేలా ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. ఆదివారం తణుకు మండలం తేతలి గ్రామంలో నూతనంగా నిర్మించిన కావు సామాజిక భవనాన్ని ప్రారంభించారు.

అనంతరం తేతలి గ్రామంలో కార్తీకమాసం సందర్భంగా కావు వనసమారాధన కార్యక్రమాల్లో మంత్రి పాల్గొని మాట్లాడారు. తణుకు నియోజకవర్గంలో గత ప్రభుత్వం హయాంలో వంగవీటి రంగా విగ్రహాల ఏర్పాటుకు అనుమతుల పేరుతో ఏర్పాటు చేయకుండా ఆడ్డుకున్నారని, తాను ఎమ్మెల్యే గా తణుకు పట్టణంలో వివిధ గ్రామాల్లో సొంత నిధులతో విగ్రహాల ఏర్పాటు చేశామని చెప్పారు. తణుకు పట్టణంలోని ప్రధాన సెంటర్ వెంకటేశ్వర దియేటర్ సెంటర్లో వంగవీటి మోహన రంగా రావు విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతోపాటు ఆరోడ్డుకు రంగా మార్గ్ గా నామకరణ చేశామని చెప్పారు. వీటితో పాటు కావు కార్పోరేషన్ ద్వారా అనేక మందికి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. అనంతరం తణుకు వెంకటేశ్వర థియేటర్ సెంటర్లో నూతనంగా నిర్మించిన రంగా రోడ్డును ప్రారంభించారు. అనంతరం తణుకు పట్టణ కావు సంఘం, విశ్వబ్రాహ్మణ సంఘం, శెట్టి బలిజ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వనసమారాధన కార్యక్రమాల్లో మంత్రి కారుమూరి పాల్గొన్నారు.

ఈ కార్యక్రమాల్లో జిల్లా కావు సంఘం అధ్యక్షుడు చినిమిల్లి వెంకట్రాయుడు, మండల వైఎస్సార్సీపీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, పట్టణ కావు సంఘం అధ్యక్షుడు వంటెద్దు ఈశ్వర ప్రసాద్, గాజుల కాశీ, ఎంపీపీ రుద్రధనరాజు, అత్తిలి జెడ్పీటీసీ అద్దాల జానకి, అత్తిలి మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణి ప్రసాద్, ఇరగవరం జెడ్పీటీసీ అంజిబాబు, ఎంపిపి మంగతాయారు, నాయకులు ఇందుగపల్లి బలరామ కృష్ణ, తణుకు పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, వివిధ కుల సంఘాల పెద్దలు పాల్గొన్నారు.



# రైతులను చంద్రబాబు ఏనాడూ పట్టించుకోలేదు

## ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి

నెల్లూరు, సూర్య బ్యూరో ప్రతినిధి : టీడీపీ అధినేత చంద్రబాబుపై ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి సీరియస్ కామెంట్స్ చేశారు. రైతులను చంద్రబాబు ఏనాడూ పట్టించుకోలేదన్నారు. వ్యవసాయాన్ని కించపరిచేలా మాట్లాడిందే చంద్రబాబు అంటూ తీవ్ర విమర్శలు చేశారు. మంత్రి కాకాణి ఆదివారం నెల్లూరులో మీడియాతో మాట్లాడుతూ.. వ్యవసాయం దండగ అన్న వ్యక్తి చంద్రబాబు. 14 ఏళ్లలో వ్యవసాయానికి చంద్రబాబు తీసుకున్న చర్యలు ఏంటీ?. రైతులను చంద్రబాబు ఏనాడూ పట్టించుకోలేదు. విపత్తుల సమయంలో వైఎస్సార్సీపీ ప్రభుత్వం ప్రజలకు అండగా నిలిచింది. విపత్తు కాలంలో రైతాంగానికి అన్ని విధాలా అండగా నిలిచాం. విపత్తుల సమయంలో రైతులకు చంద్రబాబు ఇచ్చిందేమిటీ?. చంద్రబాబు కూతలు కూస్తుంటే రామోజీ రాతలు రాస్తున్నారు. రైతులకు మంచి చేస్తున్న ప్రభుత్వంపై చంద్రబాబు, రామోజీ విషం చిమ్ముతున్నారు. రాష్ట్రంలో తుపాన్, వరదల నేపథ్యంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో స్పందించారు. సమస్యాత్మక గ్రామాలను ముందుగానే గుర్తించి తగిన ఏర్పాట్లు చేపట్టగలిగాం. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేశాం. విద్యుత్ విషయంలో అపారమైన నష్టం జరిగినా యుద్ధప్రాతిపదికన వునరుద్ధరణ చేపట్టాం. గత రెండు రోజులుగా చంద్రబాబు పర్యటనలు చేస్తున్నారు. ఎక్కడా ప్రభుత్వం ఏవిధంగా విఫలమైందో స్పష్టంగా చెప్పలేక పోయారు.

గతంలో రైతులను చంద్రబాబు అవమానకరంగా మాట్లాడారు. వ్యవసాయం దండగ అన్నారు. మేము పరిహారం ఎక్కువగా ఇచ్చామని అవాస్తవాలు మాట్లాడుతున్నారు. ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంటే చంద్రబాబుకు కడుపు మంట. ఫొటోలకు ఫోజులు ఇవ్వడం చంద్రబాబు నైజం. ప్రజలతో మమేకమయ్యే నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి. టీడీపీ హయాంలో విత్తనాలు కోసం క్యూ లైన్లో నిలబడి రైతులు ప్రాణాలు కోల్పోయారు. కందిపప్పుకి, పెసర పప్పుకి తేడా తెలియని వ్యక్తి నారా లోకేష్. ఎవరి హయాంలో రైతులకు మేలు జరిగిందో బహిరంగ చర్చకు నేను సిద్ధం. దమ్ముంటే చంద్రబాబు నాతో చర్చకు రావాలి. తేదీ, టైమ్, ప్లేస్ చెబితే వస్తాను. నా సవాల్ను చంద్రబాబు స్వీకరించాలని అన్నారు.





# మజ్లిస్- కాంగ్రెస్ దోస్తానా?

- ప్రొటెం స్పీకర్‌గా అక్బరుద్దీన్ ఎంపికతో చర్చ
- కొత్త ఎమ్మెల్యేలు కొలువుదీరే వేళ..
- అక్బరుద్దీన్ ఒవైసీని నియమించడం మజ్లిస్ వర్గాల్లో కొత్త ఉత్సాహం
- కొన్నేళ్లుగా రెండు పార్టీల మధ్య ఉప్పు నిప్పు
- రానున్న రోజుల్లో ప్రతిపక్షమా? ప్రభుత్వ పక్షమా?

తెలంగాణ బ్యూరోప్రతినిధిః కొత్త ఎమ్మెల్యేలు కొలువుదీరే వేళ.. ప్రొటెం స్పీకర్‌గా అక్బరుద్దీన్ ఒవైసీని నియమించడం మజ్లిస్ వర్గాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఎన్నికలకు ముందు ఉప్పు- నిప్పులా ఉన్న మజ్లిస్, కాంగ్రెస్‌ల మధ్య సంబంధాల నేపథ్యంలో శనివారం చోటు చేసుకున్న పరిణామాలు ఆ రెండు పార్టీలు దగ్గరైనట్లు ఆయా పార్టీల్లో చర్చ జరుగుతోంది. వైఎస్సార్ మరణానంతరం రాష్ట్రంలో చోటు చేసుకున్న పరిణామాలు.. కిరణ్‌కుమార్ రెడ్డి హయాంలో అక్బరుద్దీన్ ఒవైసీ జైలు పాలు కావడాన్ని ఆ పార్టీ జీర్ణించుకోలేకపోయింది. అప్పట్లో అక్బరుద్దీన్ చెప్పిన మాటలు రాష్ట్ర కాంగ్రెస్ వర్గాల్లో కలవరం నింపాయి. రాష్ట్రంలోనే కాదు.. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని వెంటాడుతామని నాడు ఆయన హెచ్చరించారు. చెప్పినట్లే కాంగ్రెస్ ఓట్లను చీల్చడానికి పలుచోట్ల మజ్లిస్ పార్టీ అభ్యర్థులను పోటీలో నిలిపినట్లు ఆరోపణలున్నాయి. అంతేకాకుండా కాంగ్రెసకు నష్టం చేయడంకంటే బీజేపీకి లబ్ది చేకూరుస్తోందనే అభిప్రాయాలు కూడా దేశవ్యాప్తంగా వ్యక్తమయ్యా యి. దీంతో తాము బీజేపీకి బీ టీమ్ కాదని అసదుద్దీన్ ఒవైసీ పలుమార్లు సంజాయిషీ ఇచ్చుకోవాల్సి వచ్చింది. తాజా ఎన్నికల్లోనూ రాష్ట్రంలో సిట్టింగ్ స్థానాలతో పాటు రాజేంద్రనగర్, జూబ్లీహిల్స్‌లో అభ్యర్థులను దించడానికి కాంగ్రెసను నష్ట పరచడానికేనని ఆరోపణలు వినిపించాయి. ఫలితాలు కూడా అలాగే కనిపించాయి.

అంతేకాకుండా ఇతర రాష్ట్రాల్లోనూ మజ్లిస్ తమ అభ్యర్థులను ఎన్నికల్లో పోటీకి దించి కాంగ్రెసకు నష్టం కలిగించిందనే వార్తలు కూడా వైరల్‌గా మారాయి. ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్‌లలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తోందని ఎగ్జిట్ పోల్స్ చెప్పినా.. వాస్తవ ఫలితాలు మాత్రం భిన్నంగా వచ్చాయి. ఆయా రాష్ట్రాల్లో ఎంఐఎం వల్లనే నష్టపోయినట్లు కూడా ఆరోపణలు వినిపించాయి. కాంగ్రెస్‌పై కక్ష సాధింపు బీజేపీకి లబ్ది చేకూరుస్తోందనే సంకేతాల నేపథ్యంలో ముస్లిం పెద్దలు సైతం కాంగ్రెసతో మజ్లిస్ సయోధ్య బెటర్ అనే సందేశాలు ఇస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత పార్లమెంట్ ఎన్నికలకు అన్ని పార్టీలు సిద్ధమవుతున్నాయి. ఈ క్రమంలో మజ్లిస్ పార్టీ ఎటువైపు మొగ్గు చూవుతోందనే విషయం ఆసక్తికరంగా మారింది. పదేళ్లనుంచి బీఆర్ఎస్‌తో దోస్తీ చేసిన పార్టీ రాష్ట్రంలో ఆ పార్టీవైపే ఉంటుందా.. లేక ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాంగ్రెస్ వైపు మొగ్గు చూవుతుందా అనేది ఆసక్తికరంగా మారింది. మరోవైపు అసెంబ్లీ ఫలితాలు వెల్లడైన తర్వాత అసదుద్దీన్ సీఎం రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు చెప్పడంతోపాటు ప్రతిపక్షంలో నిర్మాణాత్మక పాత్ర పోషిస్తామని ప్రకటించారు. అయితే, గతం లో ఎప్పుడూ లేనివిధంగా ఈసారి మజ్లిస్ ప్రతిపక్షంలో ఉంటుందా? లేక ప్రభుత్వంతో కలిసేందుకు ఏమైనా ప్లాన్ చేస్తుందా అనే విషయాలు చర్చనీయాంశంగా మారాయి. అక్బరుద్దీన్‌ను ప్రొటెం స్పీకర్‌గా ఎంపిక చేసి ప్రారంభించిన సంబంధాలు పార్లమెం ట్ ఎన్నికలకు ముందు ఆ రెండు పార్టీల మధ్య బలమైన బంధంగా మారుతోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు

## త్వరలో తెలంగాణ సీఎం క్యాంప్ ఆఫీస్‌గా ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీ?

తెలంగాణ బ్యూరోప్రతినిధిః ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ భవనం త్వరలో తెలంగాణ సీఎం క్యాంప్ ఆఫీస్‌గా మారనున్నట్లు సమాచారం. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీకి సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా వెళ్లి పరిశీలించారు. సీఎం అధికారిక భవనంగా ఉన్న ప్రగతి భవన్‌ను ప్రజా భవన్‌గా మార్చిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి తన సొంత నివాసంలోనే ఉంటున్నారు. ప్రగతి భవన్‌ను‌ప్రజాభవన్‌గా మారుస్తున్నట్లు, అక్కడే ప్రజాదర్బార్ నిర్వహించనున్నట్లు రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ప్రజాభవన్‌గా మారిన ప్రగతి భవన్ ఎదుట సుదీర్ఘకాలంగా ఉన్న ఇనుప కంచెను జీహెచ్ఎంసీ అధికారులు తొలగించారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడానికి ముందే రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఆదేశాలతో ఈ చర్యలు తీసుకున్నారు.

## కేసీఆర్ ఆరోగ్యంపై మంత్రి పొన్నం ఆరా

తెలంగాణ బ్యూరోప్రతినిధి: తన నియోజకవర్గంలో ఓ కార్యకర్తను పరామర్శించడానికి మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదివారం ఉదయం యశోద హాస్పిటల్ వెళ్లారు. అలాగే మాజీ సీఎం కేసీఆర్ కూడా ఇక్కడే చికిత్స పొందుతున్నారని తెలిసి పరామర్శించడానికి వెళ్లారు. అయితే ఆ సమయంలో కేసీఆర్‌కు లోపల ట్రీట్మెంట్ అవుతుండటంతో కేటీఆర్, హరీష్ రావులను కలిసి కేసీఆర్ హెల్త్ కండిషన్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ యశోద ఆస్పత్రి వద్ద మీడియాతో మాట్లాడుతూ.. తన నియోజక వర్గానికి చెందిన కార్యకర్తను పరామర్శించేందుకు యశోద ఆస్పత్రికి వచ్చానన్నారు. అలాగే కేసీఆర్ కుటుంబ సభ్యులను కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నానన్నారు.

ప్రస్తుతం కేసీఆర్ హెల్త్ కండిషన్ నిలకడగా ఉందని హరీష్‌రావు, కేటీఆర్ చెప్పారని, ఆయన త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నానని పొన్నం ప్రభాకర్ అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి కూడా యశోద ఆస్పత్రికి వస్తారని చెప్పారు. ఇందులో ఎలాంటి రాజకీయాలు లేవని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.



## 3 వేల ఆటోలతో టీడీపీ నేత మన్నవ ఆధ్వర్యంలో గుంటూరులో భారీ ఆటో ర్యాలీ

గుంటూరు జిల్లా, నేటి దినపత్రిక సూర్య బ్యూరో: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 3 వేల కిలోమీటర్లు చేరుకుంటున్న సందర్భంగా రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి, ఎన్టీఆర్ ట్రస్ట్ డైరెక్టర్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ తెలుగుదేశం నాయకుడు మన్నవ మోహన కృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరు నగరంలో 3 వేల ఆటోలతో భారీ ఆటో ర్యాలీని నిర్వహించారు. గుంటూరు నగరంలో ఈ 3 వేల ఆటోల ర్యాలీని మన్నవ మోహన కృష్ణ జండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీలో తెలుగు దేశం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా పాల్గొన్నారు. ఈ ర్యాలీ నిద్దేశించి మన్నవ మోహనకృష్ణ మాట్లాడుతూ లోకేష్ యువ గళం పాదయాత్ర దేశ రాజకీయాలలో సంచలనం అని కొనియాడారు. టిడిపి అధికారంలోకి రావడానికి యువ గళం యాత్రే వునాది అన్నారు. తెలుగుదేశం పార్టీ కి పూర్వ వైభవాన్ని, వునరుత్తేజాన్ని యువగళం తీసుకోచ్చింది అని మన్నవ మోహన కృష్ణ అన్నారు. లోకేష్ నాయకత్వ పటిమకు యువ గళం పాద యాత్రే నిదర్శనమన్నారు. యువ గళం యాత్రకు వైసిపి ప్రభుత్వం అనేక ఆటంకాలు కల్పించినా యాత్రను దిగ్విజయంగా కొనసాగించిన లోకేష్, టిడిపి శ్రేణులు అభినందనీయులు అన్నారు. యువ గళం పాదయాత్ర 200 రోజులు పూర్తయిన సందర్భంగా గుంటూరులో 200 ట్రాక్టర్లతో భారీ ప్రదర్శన నిర్వహించామని, ఇప్పుడు 3000 కిలోమీటర్లు చేరుకుంటున్న సందర్భంగా 3వేల ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహించామన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో తాము చేపట్టిన ట్రాక్టర్ల ర్యాలీకి, అలాగే పండుగ సందర్భంగా అందజేస్తామన్న చంద్రన్న కానుకలను ప్రభుత్వం అడ్డుకున్నా పార్టీ శ్రేణులు సమిష్టిగా నిలిచి కార్యక్రమం విజయవంతం చేసినందుకు ఆయన ప్రతి ఒక్కరికి మన్నవ మోహనకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. మరో 3 నెలలలో టిడిపి అధికారంలోకి రావడం, ప్రజా రంజక పాలన అందించడం తధ్యమన్నారు. ర్యాలీ అసాంతం చంద్రబాబు,లోకేష్ మద్దతుగా నినాదాలు చేశారు.వైసీపీ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి జగన్ కి వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. ఆటోల ర్యాలీలో టిడిపికి మద్దతుగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు అలరించాయి. కనీ వినీ ఎరుగని రీతిలో ఈ 3 వేల ఆటోల భారీ ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అందరికీ మన్నవ మోహనకృష్ణ ధన్యవాదాలు తెలిపారు.



## నష్టపోయిన పొలాలకు ఎకరాకు రూ.50 వేలు ఇవ్వాలి

### ఏపి పీసీసి చీఫ్ రుద్రరాజు



తెనాలి, మేజర్ న్యూస్: నష్టపోయిన ప్రతి రైతుకి ఎకరాకు రూ.50 వేల ప్రభుత్వం నష్టపరిహారం కింద అందించాలని ఏపి పీసీసి చీఫ్ గిడుగు రుద్రరాజుపేర్కొన్నారు.తుఫాన్ కారణంగా నీట మునిగిన పంట పొలాలను రూరల్ మండలం నందివెలుగు,నేలపాడు గ్రామాలలో ఏపి పీసీసి చీఫ్ రుద్రరాజు ఆదివారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నష్టపోయిన ఏ రైతు కూడా ఆత్మహత్యలకు పాల్పడవద్దని,రైతు పక్షాన కాంగ్రెస్ పార్టీ ఉంటుందని రాష్ట్ర ముఖ్యమంత్రి పరిస్థితి చూస్తే పొలాలలోకి రాకుండా రోడ్లపై ఉండి పొలాలను పరిశీలిస్తున్నారన్నారు.గత మాజీ ముఖ్యమంత్రి చెన్నారెడ్డి ఆరోగ్యరీత్యా అమెరికా వెళ్లే సమయంలో ప్రజల అవసరార్థమై ఆరోజుల్లో రూ.700 కోట్లు డ్రైనేజ్ ల కొరకు ఖర్చు పెట్టారని రాష్ట్రంలో అలా పని చేసే ముఖ్యమంత్రులు లేరని అన్నారు.కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలి, తెనాలి నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ చందు సాంబశివుడు ఉన్నారు.

## తెలంగాణ ఎన్నికల ఫలితంపై ప్రశాంత్ కిశోర్ ఆసక్తికర విశ్లేషణ

- ఇటీవల తెలంగాణ, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మిజోరంలో ఎన్నికలు
- తెలంగాణలో కాంగ్రెస్ విజయం
- బీఆర్ఎస్‌పై వ్యతిరేకత వల్లే కాంగ్రెస్ గెలిచిందని వివరణ
- తెలంగాణ ఓటర్లు కాంగ్రెస్‌ను చూసి ఓటేయలేదని వెల్లడి




తెలంగాణ బ్యూరోప్రతినిధిః ఇటీవల జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలపై ప్రముఖ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ స్పందించారు. తెలంగాణలో కాంగ్రెస్ గెలిచిందని చెప్పడం కంటే బీఆర్ఎస్ ఓడిందని చెబితేనే బాగుంటుందని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ పై ఉన్న వ్యతిరేకతే వారిని ఓడించిందని అభిప్రాయపడ్డారు. ఇటీవల ఎన్నికలు జరిగిన మధ్య ప్రదేశ్ మినహా తెలంగాణ, చత్తీస్ గఢ్, రాజస్థాన్, మిజోరం రాష్ట్రాల్లో ప్రభుత్వ వ్యతిరేకత తీవ్రంగా ఉందని, ఇతర పార్టీల గెలువునకు కారణమైందని ప్రశాంత్ కిశోర్ విశ్లేషించారు. మధ్యప్రదేశ్ లో బీజేపీ అధికారం నిలబెట్టుకోగా... తెలంగాణలో కాంగ్రెస్ గెలిచింది. చత్తీస్ గఢ్, రాజస్థాన్ లో బీజేపీ విజయం సాధించి అధికారంలోకి వచ్చింది. మిజోరంలో స్థానిక పార్టీల కూటమి జెడ్ పీఎమ్ నెగ్గింది. ఈ నేపథ్యంలో ప్రశాంత్ కిశోర్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. తెలంగాణలో కాంగ్రెస్ తన సొంత బలంతో గెలవలేదని, తెలంగాణ ఓటర్లు కాంగ్రెస్ పార్టీని బీఆర్ఎస్ కు ప్రత్యామ్నాయం అని భావించి ఓటేశారని, కాంగ్రెస్ విజయానికి ఇదే కారణం అని ప్రశాంత్ కిశోర్ వివరించారు. అంతే తప్ప కాంగ్రెస్ ను చూసి ఎవరూ ఓటు వేయలేదని తెలిపారు. అటు, బీజేపీ విజయాలకు కారణం ఆ పార్టీ హిందుత్వ విధానాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లడమేనని అభిప్రాయపడ్డారు.

## కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నిప్పులా ఉండాలి




తెలంగాణ బ్యూరోప్రతినిధి: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నిప్పులా ఉండాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ) పేర్కొన్నారు. ఆదివారం నాడు జిల్లాలోని పాల్వంచ సుగుణ గార్డెన్‌లో కాంగ్రెస్, సీపీఐ పార్టీల ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ... ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు అవమానాలు సహించలేరు. ఆత్మ గౌరవం కోసం కాంగ్రెస్ సీపీఐ పార్టీలను గెలిపించిన ప్రజానీకానికి శిరస్సు వహించి నమస్కరిస్తోన్నాను. వసూళ్లు లేని కబ్జాలు లేని ప్రజాపాలన కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉంటుంది. తల వంచే పరిస్థితి జీవితంలో రాదు. సీతారామ ప్రాజెక్ట్ గత ప్రభుత్వంలో నత్త నడకన సాగింది. సీతారామ ప్రాజెక్ట్ పూర్తి చేసి గోదావరి జలాలతో సస్యశ్యామలం చేస్తాం. ఈ దేశానికే అన్నం పెట్టే శక్తి తెలంగాణకు ఉంది. పామాయిల్ సాగుతో రైతుల తలరాత మారుస్తాం. వ్యవసాయం రంగంలో తెలంగాణను అగ్రగామిగా నిలువుతాం అని తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

surya cinema_Layout 1 10-12-2023 21:03 Page 1

సూర్య cinema@suryaa.com
విజయవాడ
సోమవారం
11 డిసెంబర్ 2023
8
సూర్య సినిమా

# యువకుడిగా కనిపించేందుకు 6 కోట్లు



సీనియర్ హీరోలకు ఏదైనా ఫ్లాష్ బ్యాక్ పెట్టినప్పుడు వాళ్ళ వయసు తగ్గించేందుకు దర్శక నిర్మాతలు పడే పాట్లు అన్ని ఇన్ని కావు. టెక్నాలజీ వాడి ఏవో తిప్పలు పడతారు కానీ చాలా సందర్భాల్లో ఇవి తేడా కొడుతుంటాయి. ఆచార్యలో చిరంజీవి, టైగర్ నాగేశ్వరరావులో రవితేజలు ఇలా ప్రయోగం చేయబోయి దెబ్బ తిన్నారు. అయితే ఇక్కడ రాజీ పడని బడ్జెట్ చాలా అవసరం. దాన్ని ఖర్చు పెట్టే ప్రొడ్యూసర్ దొరికినప్పుడు చేసుకోవచ్చు. గత కొన్నేళ్లుగా తెలుగులోనూ మంచి మార్కెట్ సంపాదించుకున్న విజయ్ కొత్త సినిమా కోసం అత్యాధునిక సాంకేతిక నైపుణ్యాన్ని వాడబోతున్నారు.

దీని కోసం అక్షరాలా 6 కోట్ల రూపాయలు ఖర్చు పెడతారట. కథ ప్రకారం విజయ్ కాసేపు 19 సంవత్సరాల యువకుడిగా కనిపించాలి. డీ ఏజింగ్ టెక్నిక్ అవసరం. విదేశీ నిపుణులు దీని కోసం పని చేయబోతున్నారు. నాగ చైతన్యకి కస్టడీ రూపంలో అల్ట్రా డిజాస్టర్ ఇచ్చిన వెంకట్ ప్రభు ఈ విజయ్ 68కి దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటిదాకా విజయ్ చేసిన రెగ్యులర్ కమర్షియల్ సినిమాలకు భిన్నంగా కొత్త ట్రీట్ మెంట్, స్క్రీన్ ప్లే దీన్ని తీయబోతున్నట్టు తెలిసింది. కొంత భాగం ఆల్రెడీ పూర్తయి-ృపోయింది. దీని తర్వాత విజయ్ రాజకీయాల్లోకి వస్తాడనే టాక్ బలంగా తిరుగుతోంది.


స్కై ఫై జానర్ లో రూపొందుతున్న ఈ యాక్షన్ ఎంటర్ టైనర్ కి ఇంకా టైటిల్ ప్రకటించలేదు. యువన్ శంకర్ రాజా సంగీతం సమకూర్చబోతున్నాడు. మానాడు తరహాలో ఇది కూడా లూప్ తరహాలో ఉంటుంది కానీ టైం ట్రావెల్ మూవీ కాదు. ఒకప్పుడు ఎన్టీఆర్, ఏఎంఆర్ కాలంలో అరవై వయసు దాటాక కూడా శ్రీదేవి లాంటి కుర్ర హీరోయిన్ల పక్కన డాన్సులు చేస్తే ఆడియన్స్ బాగా ఎంజాయ్ చేసేవాళ్ళు . కానీ ఇప్పుడు జనరేషన్ మారింది. జోడి ఏ మాత్రం కుదరకపోయినా ట్రోలింగ్ కి పని చెబుతున్నారు. అందుకే విజయ్ విషయంలో అలాంటి కామెంట్స్ రాకుండా జాగ్రత్త పడుతున్నారు.

# "థర్టీ ఇయర్స్ ఆఫ్ వన్ బై టు "



ముప్పై ఏళ్ల క్రితం 10/12/1994 న" వన్ బై టు" చిత్రం విడుదలైంది. ఈ సందర్భంగా "థర్టీ ఇయర్స్ ఆఫ్ వన్ బై టు " పేరున సరదాగా ఒక రీ యూనియన్ కార్యక్రమాన్ని ఈ రోజు ఉదయం ఫిల్మ్ ఛాంబర్ లో నిర్వహించింది చరిత చిత్ర యూనిట్. ముప్పై ఏళ్ల నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ సరదాగా సాగిన ఈ కార్యక్రమంలో చిత్ర నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ , దర్శకుడు శివ నాగేశ్వర రావు,హీరోలు జే. డి. చక్రవర్తి , శ్రీకాంత్, కెమెరామెన్ బాబు , సీనియర్ నటులు బిక్షు,చిట్టి , పి. ఆర్. ఓ.ప్రభు పాల్గొన్నారు.

## డైరెక్టర్ క్రిష్ లాంచ్ చేసిన
# 'హద్దు లేదురా' ఫస్ట్ లుక్



టైగర్ హిల్స్ ప్రొడక్షన్, స్వర్ణ పిక్చర్స్ సంయుక్తంగా నిర్మించిన నూతన చిత్రానికి "హద్దు లేదురా.." చ%ఖీ=×జుచీణూ౧శ్రూ% అనే టైటిల్ని ఖరారు చేశారు. వీరేష్ గాజుల బళ్లారి నిర్మాతగా, రావి మోహన్ రావు సహ నిర్మాతగా, యువ దర్శకుడు రాజశేఖర్ రావి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ఆశిష్ గాంధీ, అశోక్ హీరోలుగా వర్ష, ప్రితిక హీరోయిన్లుగా నటిస్తున్నారు. తనికెళ్ల భరణి, రాజీవ్ కనకాల ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ప్రముఖ క్రియేటివ్ డైరెక్టర్ క్రిష్ 'హద్దు లేదురా'.. టైటిల్, ఫస్ట్ లక్ పోస్టర్ ని లాంచ్ చేశారు

టైటిల్ విడుదల సందర్భంగా డైరెక్టర్ క్రిష్ మాట్లాడుతూ.. హద్దు లేదురా.. టైటిల్ చాలా బాగా వుందని, ఫస్ట్ లుక్ %ద% సినిమా థీమ్ వైవిధ్యంగా ఉందని, తప్పకుండా సినిమా విజయం సాధిస్తుందని అన్నారు.

డైరెక్టర్ రాజశేఖర్ రావి మాట్లాడుతూ.. అలనాటి కృష్ణార్జునులు స్నేహితులు అయితే ఎలా ఉంటారో తెలిపే కథ ,కథనం హైలైట్ గా నిలుస్తాయని, ఫైట్స్, పాటలు సెకండ్ హాఫ్ లో వచ్చే ట్విస్టులు ముఖ్యంగా క్లైమాక్స్ తప్పకుండా అందరిని ఆకట్టుకుంటుందని తెలిపారు.

నిర్మాత గాజుల వీరేశ్ మాట్లాడుతూ.. రుద్రాంగి చిత్రంలో తన నటనతో అందరిని ఆకట్టుకున్న హీరో ఆశిష్ గాంధీ సీన్స్, డైరెక్టర్ రావి రాజశేఖర్ కథని తీర్చిదిద్దిన విధానం, సంభాషణలు ఈ చిత్రనికి హైలెట్ గా నిలుస్తాయని, త్వరలో టీజర్ , ఆడియో వేడుకను నిర్వహించి, జనవరి చివరలో మీ ముందుకు తీసుకువస్తామని తెలిపారు.

హీరో ఆశిష్ గాంధీ మాట్లాడుతూ.. అర్జున్, కృష్ణ మధ్య వచ్చే ఫ్రెండ్షిప్ సీన్స్ అన్ని ఈ జనరేషన్ కి, యూత్ బాగా కనెక్ట్ అవుతాయని, చాలా సంవత్సరాల తర్వాత ఫ్రెండ్షిప్ నేపద్యంలో వచ్చే ఈ సినిమా నాకు, దర్శకనిర్మాతలకు మంచిపేరు తీసుకొస్తుందని తెలిపారు

# 'నా సామిరంగ' నుంచి పెప్పీ మెలోడీ 'ఎత్తుకెళ్లి పోవాలనిపిస్తుంది' విడుదల



కింగ్ నాగార్జున అక్కినేని పర్ఫెక్ట్ సంక్రాంతి మూవీ 'నా సామిరంగ'తో రాబోతున్నారు. ఈ చిత్రం షూటింగ్ చివరి దశలో ఉంది. పండుగకు గొప్ప ట్రాక్ రికార్డ్ ఉన్న నాగార్జున, విజయ్ బిన్నీ దర్శకుడిగా పరిచయం అవుతున్న ఈ చిత్రంలో మ్యాసీ, రగ్గడ్ అవతార్‌లో కనిపించనున్నారు. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రాన్ని టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్ పై నిర్మాత శ్రీనివాస చిట్టూరి మ్యాసీవ్ బడ్జెట్‌తో భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. పవన్ కుమార్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు.

ఆస్కార్ అవార్డ్- విన్నింగ్ కంపోజర్ ఎంఎం కీరవాణి, ఆస్కార్ విన్నింగ్ లిరిసిస్ట్ చంద్రబోస్ నాగార్జునకు మరో చార్ట్‌బస్టర్ ఆల్బమ్‌ను అందించడానికి మరొకసారి కొలబరేట్ అయ్యారు. మేకర్స్ మొదటి సింగిల్ ఎత్తుకెళ్లి పోవాలనిపిస్తుంది పాట విడుదల చేయడంతో మ్యూజిక్ ప్రమోషన్స్ గ్రాండ్ గా ప్రారంభమయ్యాయి.

ఎంఎం కీరవాణి ప్లజెంట్ వైబ్‌లను కలిగి ఒక మెస్మరైజింగ్ మెలోడీని స్కోర్ చేసారు. రామ్ మిరియాల తన వోకల్స్ తో కట్టిపడేశారు. చంద్రబోస్ మెలోడీ చార్ట్‌బస్టర్‌గా నిలిపే సాహిత్యాన్ని అందించారు. నాగార్జున, ఆషికా రంగనాథ్‌ల కెమిస్ట్రీ అందరినీ ఆకట్టుకుంటుంది. ఎప్పటిలాగే నాగార్జున తన హ్యాండ్సమ్ లుక్స్‌తో అందరి హృదయాలను కొల్లగొట్టగా, ఆషికా సాంప్రదాయక గెటప్‌లో ఆకట్టుకుంది. పాటలో విజువల్స్ గ్రాండ్ గా ఉన్నాయి. ఖచ్చితంగా ఈ పెప్పీ మెలోడీ చార్ట్-టాపింగ్ హిట్ అవుతుంది.

2024 సంక్రాంతికి థియేటర్లలో విడుదల కానున్న ఈ చిత్రానికి బ్లాక్ బస్టర్ రచయిత ప్రసన్న కుమార్ బెజవాడ కథ, మాటలు అందించారు.

# పుష్ప 2 సెట్స్‌లోకి రష్మిక



పాన్ ఇండియా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా తన హిట్ దర్శకుడు టాలీవుడ్ క్రియేటివ్ దర్శకుడు సుకుమార్ కాంబినేషన్ లో తెరకెక్కిస్తున్న భారీ సీక్వెల్ చిత్రం "పుష్ప 2 ది రూల్". మరి ఈ సినిమా షూటింగ్ పక్కా క్లారిటీగా కొనసాగుతూ ఉండగా ఈ చిత్రంలో హీరోయిన్ గా నేషనల్ క్రష్ రష్మికా మందన్నా హీరోయిన్ గా నటిస్తున్న సంగతి తెలిసిందే.మరి రీసెంట్ గానే రష్మికా "అనిమల్" తో తన కెరీర్ లో మరో హిట్ అందుకోగా ఇపుడు ఈ సినిమా రిలీజ్ అయ్యి సక్సెస్ అయ్యిన వెంటనే తన నెక్స్ట్ సినిమాల కోసం వచ్చేసింది. ఇక అలా ఇపుడు పుష్ప షూట్ లో ఆమె జాయిన్ అయ్యేందుకు డేట్ లాక్ చేసుకున్నట్టుగా తెలుస్తుంది. దీనితో ఈమె ఈ డిసెంబర్ 13న జాయిన్ కానుందట. ఈ షూట్ హైదరాబాద్ లో స్టార్ట్ కానుండగా ఆరోజు నుంచి అయితే ఆమె రెగ్యులర్ షూట్ లో పాల్గొననుంది. ఇక ఈ భారీ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తుండగా మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణం వహిస్తున్నారు.

# తంత్ర టీజర్ - రక్తపిశాచాలు ఉన్నాయా?




మల్లేశం, వకీల్‌సాబ్ సినిమాలతో ప్రేక్షకులని మెస్మరైజ్ చేసిన మన తెలుగు హీరోయిన్ అనన్య నాగళ్ల ప్రధాన పాత్రలో నటించిన 'తంత్ర ' మూవీ టీజర్ ఈరోజు ప్రియదర్శి చేతుల మీదుగా రిలీజ్ అయ్యింది.'ఊరిలో పుట్టిన దుష్టశక్తి రక్తదాహంతో విరుచుకుపడుతోంది..' అంటూ చెబుతున్న డైలాగ్స్ మీద కట్ అయిన టీజర్ రకరకాల తాంత్రిక పూజలని చూపిస్తూ మైండ్-బ్లోయింగ్‌గా ఉంది. టీజర్‌ని బట్టి ఈ సినిమాలో మన పురాతన తాంత్రిక రహస్యాలని వెలికితీస్తున్నట్టు తెలుస్తోంది. అనన్య దుష్టశక్తి బారిన పడిన అమ్మాయిగా కొత్తగా కనిపిస్తోంది. అనన్య ఇంతవరకు చెయ్యని ఒక క్రేజీ రోల్ చేస్తోందని మేకర్స్ చెబుతున్నారు. క్షుద్రపూజలు చేసే తాంత్రికుడిగా 'టెంపర్ వంశీ' లుక్ బాగా సెట్ అయ్యింది. సలోని పాత్ర మిస్టీరియస్‌గా కనపడుతోంది.

ప్రస్తుతం హర్రర్ ట్రెండ్ నడుస్తోంది. క్షుద్రపూజలు ఇతివృత్తంగా వస్తున్న సినిమాలు బ్లాక్‌బస్టర్ హిట్స్ కొడుతున్న టైమ్‌లో వస్తున్న ఈ మూవీ కూడా ప్రామిసింగ్‌గా కనపడుతోంది. శ్రీహరి తమ్ముడి కొడుకు ధనుష్ రఘుముద్రి ఈ మూవీతో హీరోగా పరిచయమవుతున్నాడు. సలోని ఈ సినిమాతో గట్టిగా రీ-ఎంట్రీ ఇస్తోందని అర్ధమౌతోంది. రీసెంట్‌గా మంగళవారం సినిమాతో ఆకట్టుకున్న మీసాల లక్ష్మణ్ ఈ సినిమాలో ఒక మంచి రోల్ చేసారని తెలుస్తోంది.

ఫస్ట్ కాపీ మూవీస్, బి ద వే ఫిల్మ్స్ బ్యానర్స్ కలిసి రూపొందించిన ఈ సినిమా ఫస్ట్‌లుక్‌కి ఇప్పటికే మంచి రెస్పాన్స్ వచ్చింది. వాల్ట్‌డిస్నీలో పనిచేసిన శ్రీనివాస్ గోపిశెట్టి ఈ మూవీతో దర్శకుడిగా డెబ్యూ చేస్తున్నారు. టీజర్ చూసి ఇంప్రెస్ అయిన ప్రియదర్శి దీనిని లాంచ్ చేయడానికి ముందుకొచ్చారని మేకర్స్ చెబుతున్నారు.

# భూకంపం పుట్టించిన సమంత




## కిల్లర్ ఫోజులతో కుర్రకారు గుండెల్లో గుబులు

తనదైన అందం నటనతో పాన్ ఇండియా స్థాయిలో ఆకర్షిస్తోంది సమంత రూత్ ప్రభు. బాలీవుడ్ టాలీవుడ్ సహా అన్నిచోట్లా భారీ క్రేజ్ ఉన్న స్టార్ గా వెలిగిపోతోంది. ప్రియాంక చోప్రా నటించిన సిటాడెల్ ఇండియా వెర్షన్ లో నటించిన ఘనత సమంతకే సొంతమైంది. తదుపరి బాలీవుడ్ లో బిగ్ కెరీర్ ఆశిస్తున్న సమంత ఫోటోషూట్ల పరంగా అగ్గి రాజేస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా సమంత ఎర్త్ బ్రేకింగ్ ఫోటోషూట్ వెబ్ లో అగ్గి రాజేస్తోంది. ప్రఖ్యాత ఎంటీవీ హాజిల్ కోసం ఫోటోషూట్ ఇదని సమంత స్వయంగా వెల్లడించింది ఇన్ స్టాలో. ఇక ఈ డిజైనర్ డెనిమ్ లుక్ ఇంప్రెస్సివ్ అంటూ



అభిమానులు ప్రశంసిస్తున్నారు. ముఖ్యంగా సమంత కిల్లర్ ఫోజులు కుర్రకారు గుండెల్లో గుబులు పెంచుతున్నాయి. డెనిమ్ టాప్ డెనిమ్ ఫ్యాంట్ లో కనిపించిన సమంత.. తన ఫ్యాంట్ కి దాదాపు రెండు డజన్ల పిన్నీసులు ధరించడం కనిపించింది. ఇది నిజంగా ఆశ్చర్యం కలిగించే డిజైనర్ లుక్. ప్రస్తుతం ఈ ఫోటోషూట్ అంతర్జాలంలో వైరల్ గా మారింది.సమంత సోషల్ మీడియా ప్రచారంలో మాత్రమే కాకుండా తన దుస్తుల బ్రాండ్ సాకి తో పాటు ఏకమ్ ప్రీ-స్కూల్ బిజినెస్ వంటి వ్యాపారాలలోను బిజీగా ఉంది. 'ఆహా'లో సామ్ జామ్ వంటి షోలు చేస్తూ కొన్ని ఇంటర్వ్యూలను చేస్తోంది. ఇప్పుడు సామ్ కొత్త జాబ్ చర్చగా మారింది. ఒక పాపులర్ రియాలిటీ షోకు సమంత న్యాయనిర్ణేతగా వ్యవహరిస్తోంది. రియాలిటీ షో MTV హాజిల్ తదుపరి ఎపిసోడ్‌లో సమంత కనిపించనుంది. కార్యక్రమంలో న్యాయనిర్ణేతగా ఉన్న పాప్ స్టార్ బాద్‌షా తన ఇన్‌స్టాగ్రామ్‌లో సమంత ఫోటోలను షేర్ చేశారు. ఈ జోడీ వేదికపై నవ్వుతూ నృత్యం చేస్తూ కనిపిస్తారు.దఫ్యామిలీ మ్యాన్ 2 తర్వాత సమంత బాలీవుడ్‌లో ఎక్కువ మంది ఫాలోవర్లను సంపాదించుకుంది. ఉత్తరాది వారికి సుపరిచితం గనుక తను హిందీ పరిశ్రమలో బుల్లితెర జడ్జిగా కనిపిస్తే ఆ క్రేజ్ వేరుగా ఉంటుంది. సమంత ప్రస్తుతం మైయోసిటిస్ అనే ఆటో ఇమ్యూన్ కండిషన్‌తో పోరాడుతున్న సంగతి తెలిసిందే. దీనికి చికిత్స కొనసాగుతోంది. సమంతా నటించిన సిటాడెల్ ఇండియన్ వెర్షన్ విడుదల కావాల్సి ఉంది.



PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044.